ఏప్రిల్
2015

108

సంపుటి : 9 సంచిక : 12 వెల రు. 10/-

ఈ సంచికలో........

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉద్యమ నిర్మాణం
భారత పత్రికారంగం భవిష్యత్తేమిటి?
అభివృద్ధికి నోచని అభాగ్యులగురించి ఆలోచించరా?
'ప్రకృతి గతితర్కం' పరిచయం
ఘర్ వాపసీ కార్యక్రమం నిజస్వరూపం
ఏజెన్సీ గిరిజనులపై ప్రపంచీకరణ ప్రభావాలు
పశ్చిమాసియాలో తీవ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న అమెరికా
కమ్యూనిస్టులు, అభ్యుదయ శక్తులు తీవ్ర కృషిద్వారా మార్పు సాధించాలి
ప్రజా రచయిత వట్టికోట ఆళ్వారుస్వామి

శత జయంతి నివాళి

# ప్రజా రచయిత వట్టికోట ఆళ్వారుస్వామి

యు. రామకృష్ణ

ఒంటిపూట తిండికి కూడా జరుగుబాటు లేని నిష్ట దరిద్రం అతనిది. పిన్నవయస్సులోనే తండ్రీనీ కోల్పోయాడు. పలకా బలపం పట్టుకొని బడికి పోవాల్సిన సమయంలో కుటుంబ పోషణార్థం భిక్షం ఎత్తుకోవాల్సి వచ్చింది. ఓ దయగల కుటుంబం అతణ్ణి చేరదీస్తే.. వారికి వంట చేసి పెడుతూ తాను పొట్ట పోషించు కున్నాడు. ఆ కుటంబానికి వంట పనీ, ఇంటి పనీ చేసి పెడుతూనే చదవనూ, రాయనూ నేర్చుకున్నాడు. యుక్త వయసొచ్చాక హోటల్లో సర్వరుగా పనికి కుదిరాడు. ఆ పని చేస్తూనే గ్రంథాలయాలకు వెళ్లి గ్రంథ పఠనం చేస్తూ ఎనలేని విజ్ఞానాన్ని సంపాదించాడు. అదే ఆయన జీవితాన్ని మలుపు తిప్పింది. గొప్ప మానవతావాది గానూ, పరిశోధనాత్మక పాత్రికేయుడి గానూ, ప్రముఖ నవలాకారుణ్ణిగానూ తీర్చిదిద్దింది. అంతేకాదు.. సమాజంలో దోపిడీకి గురయ్యే వారి పక్షాన కలం ఝుళిపించి, గళం కంగు మనిపించిన ఉద్యమ నేతగానూ భాసిల్లాడు. భూస్వాము, దొరల, దేవ్‌ముఖ్‌ల, పాలకుల దాష్టీకానికి వ్యతిరేకంగా ఆంధ్రమహాసభలోనూ పనిచేశాడు. చివరికి కమ్యూనిస్టు పార్టీలో చేరి అజ్ఞాత వాసమూ, జైలు జీవితమూ గడిపాడు. ఆ విధంగా అణగారిన జన సంక్షేమానికి జీవితాన్ని అర్పించిన దార్శనికుడిగా నిలిచాడు. ఆయనే వట్టికోట ఆళ్వారుస్వామి.

ఆళ్వారుస్వామి నల్గొండ జిల్లా నకిరేకల్ సమీపానగల మాధవరం గ్రామంలో నిరుపేద శ్రీవైష్ణవ బ్రాహ్మణ కుటుంబంలో 1915 నవంబరు ఒకటో తేదీన జన్మించాండు. తల్లిదండ్రులు సింహాద్రమ్మ, రామచంద్రా చార్యులు. కటిక నిరుపేద కుటంబం కావడంతో బాల్యంలో చదువు వంటబట్టలేదు. పలకా బలపం పట్టుకొని బడికి పోవాల్సిన వయసులో బిచ్చమెత్తుతూ కుటుంబాన్ని పోషించాల్సి వచ్చింది. పన్నెండేళ్ల ప్రాయంలో తండ్రిని కోల్పోయాడు. దీంతో నరికేకల్‌లో కంచినేపల్లి సీతారామారావనే ఉపాధ్యాయుడు చేరదీసి వంట పని అప్పగించి అతడి ఉదరపోషణకు సాయపడ్డాడు. ఆయనే చదవనూ, రాయనూ నేర్పారు. కొన్నాళ్ల తరువాత ఆ ఉపాధ్యాయుడు సూర్యాపేటకు బదిలీ కావడంతో వారితో కలిసి ఆళ్వారుస్వామి అక్కడికి వెళ్లాల్సి వచ్చింది. అక్కడి కొత్త వాతావరణం, కొత్త పరిచయాలు అతనిలో నూతనోత్సాహాన్ని నింపాయి.



కొంతకాలం గడిచాక.. అభాగ్యులను ఆదరించే కరుణార్ద్ర కుటుంబీకుడైన కందిబండ గ్రామానికి చెందిన నారపరాజు రాఘవరావుతో పరిచయం ఏర్పడింది. ఆయనతో ఏర్పడిన సాన్నిహిత్యం వల్ల వారింటికి ఆళ్వారుస్వామి మకాం మార్చాడు. రాఘవరావు సోదరుల్లో ఒకరు అన్నంతగా ఆళ్వారుస్వామి ఆ కుటుంబంలో కలిసిపోయాడు. నారపరాజు సోదరులు తమ తండ్రి సంస్మరణార్థం ఒక గ్రంథాలయాన్ని స్థాపించారు. పత్రిలకతోపాటు అనేక విలువైన గ్రంథాలనూ తెప్పించడం ప్రారంభించారు. దీంతో ఆళ్వారుస్వామికి గ్రంథ పఠనాసక్తి పెరిగి ప్రతిరోజూ గ్రంథాలయానికి వెళ్లి గ్రంథ పఠనం చేసేవాడు. కొంతకాలం తరువాత ఆళ్వారుస్వామి మళ్లీ హైదరాబాదు మకాం మార్చాడు. అప్పటికే గోలుకొండ పత్రికలో ప్రూపురీడరుగా పనిచేస్తున్న కోదాటి నారాయణరావు ఆ ఉద్యోగాన్ని మానివేయాల నుకుంటున్న దశలో ఆళ్వారుస్వామి ఆయన దృష్టిలో పడ్డాడు. సురవరం ప్రతాపరెడ్డికి సిఫార్సుచేసి ఆ ఉద్యోగాన్ని ఆళ్వారుస్వామికి ఇప్పించారు. ఆ ఉద్యోగం వల్ల ఆయనకు జీవితాన్నీ, సమాజాన్నీ, సాహిత్యాన్నీ అధ్యయనం చేసే అవకాశం కలిగింది. నెలకు 15 రూపాయల జీతం ఏమూలకూ సరిపోయేది కాదు. కొంతకాలానికి ఆ ఉద్యోగమూ మానేశారు.

మళ్లీ కందిబండలోని నారపరాజు రాఘవరావును చేరుకున్నాడు. అక్కడి గ్రంథాలయంలో అనేక గ్రంథాలను చదివాడు. క్రమంగా ఆయన దృష్టి రచనా వ్యాసంగంపైకి మళ్లింది. ఆంగ్ల భాషాధ్యయనంపైనా ఆయన దృష్టి మళ్లింది. స్వయం కృషితో ఆంగ్ల భాష నేర్చుకున్నాడు. నారపరాజు కుటుంబం తరచూ బెజవాడ వెళ్లివస్తుండేది. వారి కుటుంబంలో సభ్యుడుగా కలిసిపోయిన ఆళ్వారుస్వామి కూడా బెజవాడ వెళ్లివస్తుండేవాడు. ఆ క్రమంలో అక్కడి వెల్‌కం హోటల్ వారితో పరిచయమేర్పడింది. యాజమాన్యంతో మాట్లాడుకొని సర్వర్‌గా హోటల్లో చేరాడు. వసతి కల్పించి ఉచితంగా భోజనం పెట్టేవారు. దాంతోపాటు 20 రూపాయల జీతం కూడా ఇచ్చేవారు. నెలకు 8 రూపాయలు చెల్లించి ఇంగ్లీషు ట్యూషన్లకు వెళ్లేవాడు. జీతాన్ని పొదుపుగా వాడేవాడు. మిగుల్చుకున్న డబ్బుతో పత్రికలనూ, గ్రంథాలనూ కొని చదివేవాడు. ఇలా రెండేళ్లు సాగిపోయింది ఆయన జీవితం.

నారపరాజు కుటుంబ అవసరాల రీత్యా ఆళ్వారుస్వామి బెజవాడ నుంచి మళ్లీ హైదరా బాద్‌కు మకాం మార్చాల్సి వచ్చింది. అక్కడ ఉన్నత విద్యను చదువుకుంటున్న నారపరాజు కుటుంబ సభ్యులకు వంట చేసి పెడుతూనే తీరిక సమయాల్లో ఆంగ్ల విద్యను అభ్యసించడం మొదలు పెట్టాడు. మళ్లీ గోలుకొండ పత్రికలో ప్రూపురీడరుగా కుదిరాడు. ఇటు వంట పనీ, అటు ప్రూపురీడరు ఉద్యోగమూ రెండూ బాధ్యతలూ చక్కగా నిర్వర్తించాడు. పత్రికా ఉద్యోగం కారణంగా ఎందరో ఉన్నత వ్యక్తుల సాంగత్యం ఏర్పడేది. దీనివల్ల ఎంతో పరిణితి చెందాడు. యశోదమ్మ అనే

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


**1. ప్రజా రచయిత వట్టికోట ఆళ్వారుస్వామి**

యు. రామకృష్ణ 2

**2. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉద్యమ నిర్మాణం**

– వి. శ్రీనివాసరావు 4

**3. భారత పత్రికారంగం భవిష్యత్తేమిటి?**

– ఎన్. రామ్ 7

**4. అభివృద్ధికి నోచని అభాగ్యులగురించి ఆలోచించరా?**

– మాణిక్ సర్కార్ 10

**5. 'ప్రకృతి గతితర్కం' పరిచయం**

– ఫ్రెడరిక్ ఏంగెల్స్ 13

**6. ఘర్ వాపసీ కార్యక్రమం నిజస్వరూపం**

– సుభాషిణి ఆలి 21

**7. ఏజెన్సీ గిరిజనులపై ప్రపంచీకరణ ప్రభావాలు**

– వై. సిద్దయ్య 23

**8. పశ్చిమాసియాలో తీవ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న అమెరికా**

– విజయ ప్రసాద్ 30

**9. కమ్యూనిస్టులు, అభ్యుదయ శక్తులు తీవ్ర కృషిద్వారా మార్పు సాధించాలి**

– బివి రాఘవులు 33



**సంపాదకుడు:**

**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**

**పాటూరు రామయ్య**

**బి.వి. రాఘవులు**

**తమ్మినేని వీరభద్రం**

**ఎస్. వీరయ్య**

**తెలకపల్లి రవి**



**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరుపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**

సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**

**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,

ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్–20

**ఫోన్:** ఎడిటోరియల్ **0866–2573822**

**మేనేజర్: 040–27673787**

EMail: svenkatarao_1958@yahoo.com

Visit cpi(m) site at : cpim.org


# సిపిఐ(ఎం) 21వ మహాసభలు

**భా**రత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 21వ అఖిల భారత మహాసభలు ఈ నెల 14 నుండి 19 వరకు విశాఖపట్నంలో జరుగుతున్నాయి. ఈ మహాసభలకు రెండు విధాలా ప్రాధాన్యత ఉంది. మొదటిది, ప్రతి మహాసభకూ ఉన్న ప్రాధాన్యతే. జరిగిన మూడు సంవత్సరాల కాలంలో పార్టీ అనుసరించిన రాజకీయ విధానాన్ని సమీక్షించుకుని రానున్న మూడు సంవత్సరాలకు అనుసరించే విధానాన్ని ఖరారు చేసుకోవడం. సిపిఎం విధానం అంటే అది కేవలం పార్టీకే పరిమితమైన విషయంగా భావించకూడదు. అది దేశంలోని విశాలమైన ప్రజారాశులకు సంబంధించిన విధానం. పాలక వర్గాల దాడులనుండి ప్రజలను రక్షిస్తూ వారిని సమీకరించి, సంఘటితపరిచి దోపిడీనుండి విముక్తి పరిచే అంతిమ లక్ష్య సాధనవైపు నడిపించే విధానం. అందువల్లనే పార్టీ విధానం బూర్జువా–భూస్వామ్య పార్టీల మాదిరిగా నాలుగు గోడల మధ్య కాకుండా ప్రజల మధ్య రూపుదిద్దుకుంటుంది. పాలక పార్టీల మాదిరిగా కొద్ది మంది పెట్టుబడిదారీ, భూస్వాముల ప్రయోజనాల కోసం కాకుండా కార్మిక, కర్షక, దళిత, గిరిజన, ఇతర సామాన్య ప్రజల ప్రయోజనాలకోసం రూపుదిద్దబడుతుంది. అందువల్ల సిపిఐ(ఎం) మహాసభలు పార్టీ సభ్యులు, కార్యకర్తలకే కాకుండా ప్రజలందరికీ సంబంధించిన మహాసభలు. అటువంటి మహాసభలు తీసుకునే నిర్ణయాలు దేశానికీ, దేశ ప్రజానీకానికీ ఎంతో ప్రాధాన్యతగలవి.

రెండవది, 21వ మహాసభలకు మరో ప్రాధాన్యత ఉంది. భారత దేశంలో పెట్టుబడిదారీ అభివృద్ధి ఒక నూతన దశకు చేరిన తరుణంలో జరుగుతున్న ఈ మహాసభల్లో నూతన పరిస్థితికి అనుగుణంగా తీసుకోబోతున్న నిర్ణయాలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఏమిటీ నూతన పరిస్థితి? పాతికేళ్లుగా దేశంలో అనుసరించబడుతున్న నయా–ఉదారవాద ఆర్థిక విధానాలవల్ల ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగాయి. మార్క్స్ చెపినట్లు అవి అనివార్యంగా సంక్షోభంవైపు తీసుకుపోతున్నాయి. మన దేశమే కాదు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సంక్షోభ సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోంది. దీన్నుండి తప్పుకుని తమ లాభాలు నిలుపుకోడానికి పాలక వర్గాలు ప్రజల మీద విపరీతమైన భారాలు వేయడం మినహా మరోమార్గం లేదని భావిస్తున్నాయి. దీనికే అవి సంస్కరణలు అని ముద్దు పేరుపెట్టాయి. సంస్కరణలు పూర్తి స్థాయిలో అమలు జరిపేటప్పుడు వచ్చే ప్రజా ప్రతిఘటనను అణచివేయడానికి పాలక వర్గాలకు... ప్రజలను మానసికంగా, భౌతికంగా అణచివేసే శక్తి కావాల్సి వచ్చింది. నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీఎ ప్రభుత్వం అటువంటి ఒక ఆయుధంగా పాలకవర్గాలకు లభించింది. అందుకే డబ్బు, ప్రచారం ఇతర అన్ని శక్తులు ఒడ్డి గత ఎన్నికల్లో దాన్ని అధికారంలోకి తెచ్చారు. మోడీ ప్రభుత్వం ఇతర అన్ని ప్రభుత్వాల్లాంటిది కాదు. రాజకీయ మితవాదం, స్వదేశీ–విదేశీ కార్పొరేట్ పెట్టుబడుల విషకలయిక అది. ఇటువంటి ప్రభుత్వంపై పోరాటం ఎక్కుపెట్టడానికి పార్టీ అవగాహనలోనూ, ఓరిఎంటేషన్‌లోనూ, పని విధానంలోనూ కొత్త పంథా అవలంభించాల్సి ఉంటుంది.

21వ మహాసభలు గత పాతికేళ్లలో పార్టీ అనుసరించిన విధానాన్ని ఆత్మవిమర్శనాత్మకంగా సమీక్షించుకుని కొత్త పరిస్థితులకు అనుగుణమైన విధానాన్ని రూపొందించనున్నాయి. పార్టీ సభ్యులు, ప్రజలు అందరూ విధాన రూపకల్పనలో పాల్గొనేందుకుగాను రెండు మాసాల ముందుగానే సమీక్ష నివేదికనూ, రాజకీయ తీర్మానం ముసాయిదానూ బహిరంగంగా విడుదల చేయడం జరిగింది. వచ్చే అభిప్రాయాలు, సవరణలను మహాసభ పరిశీలించి తుది నిర్ణయం చేస్తుంది. రానున్న మూడేళ్లకు పార్టీ సభ్యులందరికీ అది పోరాట కరదీపికగా ఉంటుంది.

ఇంతటి ముఖ్యమైన 21వ మహాసభలు మన తెలుగు నేలపై జరుగుతుండడం మనందరికీ గర్వకారణం. మహాసభలను జయప్రదం చేయడానికి కార్యకర్తలు కొద్ది మాసాలుగా కృషి చేస్తున్నారు. మహాసభ సందర్భంగా జరిగే భారీ ర్యాలీకి హాజరుకావడం, ప్రజలను సమీకరించడం, మహా సభ అనంతరం అది ఇచ్చిన సందేశాన్ని ప్రజలవద్దకు తీసుకుపోవడం ప్రతి పార్టీ సభ్యుని ప్రధాన కర్తవ్యం.


**చందా వివరాలు**


విడిపత్రిక: **రూ.10,** సంవత్సర చందా:**రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**

**మేనేజర్,**
**మార్క్సిస్టు**
**(సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.హెచ్ భవన్** (ప్రజాశక్తి కార్యాలయం),
**అజామాబాద్, హైదరాబాద్- 20**

# మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉద్యమ నిర్మాణం



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు

**వి. శ్రీనివాసరావు**

గత పాతికేళ్లుగా అమలవుతున్న సరళీకరణ ఆర్థిక విధానాలకు నెర్రలు వారాయి. తన ప్రపంచ ఆధిపత్యానికి ఎదురులేదన్న అమెరికా 2008లో సంక్షోభంలో పడింది. ఇప్పటికీ అది సంక్షోభం నుంచి ఇప్పటికీ బయటపడలేకపోతోంది. కొత్తగా యూరప్ ఆర్థిక సంక్షోభంలో ఇరుక్కుంది. దాని నుంచి బయటపడడానికి పొదుపు చర్యలు పేరుతో ప్రజలకు ఇచ్చే సబ్సిడీలు, సంక్షేమ పథకాలపై పెద్దఎత్తున కోతలు విధించింది. దీనికి ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత, ప్రతిఘటన ఎదురైంది. అది రాజకీయ పెనుమార్పులకు సైతం దారితీస్తోంది.

### గ్రీసు పరిణామాలు

గ్రీసు చిన్న దేశమైనప్పటికీ అత్యంత ప్రాచీన దేశం కూడా. ప్రాచీన నాగరికతకు ఇది పుట్టినిల్లు. అలెగ్జాండర్ వంటి యోధులు, అరిస్టాటిల్ వంటి మేధావులు ఈ గెడ్డపై జన్మించారు. యూరోపియన్ యూనియన్ ఏర్పడిన తరువాత అందులో గ్రీసు కూడా భాగస్వామి అయింది. ఆర్థికాభివృద్ధి పేరుతో అప్పుల ఊబిలో కూరుకుపోయి, చివరికి వడ్డీలు సైతం కట్టుకోలేక కుతికల్లోతు సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ అప్పులు తీర్చడానికి ఐరోపా యూనియన్ పెట్టిన షరతులు దాన్ని మరింత ఇబ్బందుల్లోకి నెట్టింది. కార్మికులు దేశవ్యాప్తంగా సమ్మెలకు పూనుకోవడమే కాకుండా పార్లమెంట్‌ను దిగ్బంధించింది. గత్యంతరం లేని స్థితిలో అధ్యక్షుడు గద్దె దిగిపోయాడు. పొదుపు చర్యలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో కార్మికవర్గం దేశవ్యాపితంగా అనేక పోరాటాలు చేసింది. దీనికి కమ్యూనిస్టుల నేతృత్వంలోని 'పామె' నాయకత్వం వహించింది. పొదుపు చర్యలకు వ్యతిరేకంగా గ్రీస్‌లో 'సిరిజ' అనే కొత్త శక్తి ఆవిర్భవించి నాలుగేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో మొదటి స్థానానికి చేరువుగా వచ్చి ఆగిపోయింది. నాడు అధికారం చేపట్టిన మితవాద శక్తులు ఈ సంక్షోభాన్ని పరిష్కరించలేక పోయాయి. పైగా ప్రజలపై అదనపు భారాలు మోపడంతో ఈసారి ఎన్నికల్లో ప్రజల అసంతృప్తి భగ్గున లేచింది. ఫలితంగా 'సిరిజ' ఘన విజయం సాధించింది. పొదుపు చర్యలు అమలుపరిచేది లేదని, అదే సమయంలో యూరోపియన్ యూనియన్‌లో కొనసాగుతూనే దాని షరతులకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామని సిరిజ ప్రకటించింది.

### అదే దారిలో స్పెయిన్




ఇదే దారిలో ప్రయాణిస్తున్న మరో దేశం స్పెయిన్. పెట్టుబడిదారీ విధానం ప్రారంభంలో వివిధ దేశాలకు సరుకులను ఎగుమతి చేసి బలిసిన దేశాల్లో ఇది ఒకటి. ఇంగ్లాండ్ మన దేశాన్ని పాదాక్రాంతం చేసుకోగా కొలంబస్ పుణ్యాన పశ్చిమిండియా (వెస్టిండీస్) ప్రయాణం కట్టిన స్పెయిన్... లాటిన్ అమెరికాలో తిష్ట వేసింది. బొలివేరియా తిరుగుబాటుతో ఆరంభమైన స్వాతంత్ర్య పోరాటం చివరకు స్పెయిన్ ఆధిపత్యాన్ని దెబ్బతీసింది. ఐరోపా యూనియన్‌లో భాగస్వామ్యమైన స్పెయిన్ కూడా గ్రీసు తరహాలోనే పొదుపు చర్యలు తీసుకుంది. అక్కడ కూడా ప్రజా ఉద్యమాలు, కార్మిక సమ్మెలు ఊపందుకున్నాయి. ఈ పోరాటాలు నుంచే 'పొడెమాస్' అనే కొత్త రాజకీయ శక్తి పుట్టుకొచ్చింది. తాజాగా జరిగిన ఎన్నికల్లో వారు విజయం సాధించారు. వీటికితోడు పోర్చుగీసు, సైప్రస్ వంటి దేశాల్లో వామపక్ష శక్తులు బలంగా ఉన్నాయి. ఒక్క జర్మనీ తప్ప అన్ని యూరోపియన్ దేశాల్లోనూ ప్రజా ఉద్యమాలు పుంజుకుంటున్నాయి. జర్మనీలో సైతం తూర్పు బెర్లిన్‌లో వామపక్షాలు బలపడుతున్నాయి. ఈ పరిణామాలు ప్రపంచ పెట్టుబడిదారులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వామపక్షాల పురోగమనాన్ని నిరోధించడానికి నానా తంటాలు పడుతున్నాయి. ఇప్పటికే లాటిన్ అమెరికాలో వామపక్షాల పురోగమనం అంతర్జాతీయ పెట్టుబడిదారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రజాస్వామ్య హక్కుల కోసం అరబ్ దేశాల్లో ప్రజాగ్రహం పెల్లుబికిలితే ఆర్థిక సంక్షోభానికి వ్యతిరేకంగా ఐరోపా ప్రజలు కదులుతున్నారు.

సరళీకరణ విధానాలకు ఎదురేలేదని గప్పాలు కొట్టిన పెట్టుబడిదారులు ఇప్పుడు తమ వ్యవస్థలను కాపాడుకోవడానికి ప్రత్యామ్నాయాలు అన్వేషిస్తున్నారు. సమర్థత పేరుతో లాభాలే పరమవధి అనీ, లాభాల కోసం ఏ గడ్డి కరిచినా పర్వాలేదని పెట్టుబడిదారులు నీతి నియమాలు సైతం చుట్ట చుట్టి పక్కన పెట్టేశారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని సైతం డబ్బుతోనే తమ కనుసన్నల్లోనే ఉంచుతున్నారు. డబ్బుతోనే ఈ వ్యవస్థను అదుపు చేయాలని

అనుకుంటున్నారు. మీడియాను నియంత్రణలో పెట్టుకుని ప్రజాభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. ప్రజాగ్రహం ముందు ఇవేవీ పనిచేయవని తాజా పరిణామాలు రుజువు చేస్తున్నాయి.

**గుణపాఠాలు నేర్వని పాలకులు**

సోవియట్ యూనియన్ పతనం తరువాత అమెరికాకు సాగిల పడిపోయిన మన పాలకులు తాజా పరిణామాల నుంచి గుణపాఠాలు నేర్చుకోవడంలేదు. పైగా అంతర్జాతీయ సంక్షోభాన్ని తమకు అనుకూలంగా మలుచుకుని ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదగాలని ఉవ్విళ్లూరుతున్నారు. యుపిఎ-1 కాలంలో వామపక్షాల మద్దతుతో ఆర్థిక సంస్కరణలు మందగమనం పట్టాయని కాకి గోల చేశారు. యుపిఎ-2 హయాంలో వామపక్షాలు మద్దతు లేకుండా సొంత బలంతోనే నెగ్గినా ఆర్థిక పురోగతి లేకపోగా మరింత మందగమనంలో పడింది. దీన్ని నుంచి బయటపడడానికి బడా కార్పొరేట్ శక్తులు మన్మోహన్‌సింగ్‌కు బదులుగా నరేంద్రమోడీని తెచ్చుకున్నాయి. 30 ఏళ్ల తరువాత ఏకపార్టీ పాలన మొదలైంది. మొదటిసారి బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశాయి. ఎన్డీయే కూటమిలో మిత్రులున్నా వారెవరికీ విలువ లేదు. గతంలో ఢిల్లీలో చక్రం తిప్పానని ప్రగల్భాలు పలికిన ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్డీయేలో చేరి మంత్రి పదవులు తీసుకున్నా ఏ మాత్రం ప్రభావితం చేయలేకపోతున్నారు. గతంలో పులి అనుకున్న ఆయన నేడు పిల్లిగా మారిపోయారు.

బడా కార్పొరేట్ శక్తుల కోర్కెలు తీర్చడం, దానికి ప్రజల నుంచి ప్రతిఘటన రాకుండా మతం పేరుతో చీలికలు పెట్టడం మోడీ అనుసరిస్తున్న ద్వంద్వ వ్యూహం. తన లక్ష్యసాధనకు ఆయన తన వారితో సహా ఎవరినీ లెక్క చేయడంలేదు. మోడీ వైఖరి నియంతృత్వ పోకడలకు దారి తీస్తుంది. దీన్ని ఎదుర్కోవాల్సిన ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ నేడు సన్యాశాశ్రమంలో చేరింది. గత ఎన్నికలకు నాయకత్వం వహించిన రాహుల్‌గాంధీ అజ్ఞాతవాసంలోకి వెళ్లిపోయారు. పార్లమెంట్‌లో కాంగ్రెస్ బిజెపితో దాగుడుమూతలు ఆడుతోంది. రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగంపై తీర్మానాన్ని వామపక్షాలతో కలిసి ఓడించిన కాంగ్రెస్.. ఇన్సూరెన్స్ రంగంలో పెట్టుబడుల ఉపసంహరణ వంటి ప్రజా వ్యతిరేక బిల్లును నిర్లజ్జగా బలపరిచింది. మరోవైపు భూసేకరణ చట్టం సవరణ ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తోంది. బిజెపి

> **" గతంలో కేంద్రాధిపత్యానికి వ్యతిరేకంగా రాష్ట్రాల హక్కులు కోసం, సంక్షేమ పథకాల అమలుకోసం నిలబడ్డ ప్రాంతీయ పార్టీలు దారి మార్చి కాంగ్రెస్, బిజెపిల సరసన చేరాయి. సరళీకరణ విధానాలు అమలుచేయడంలో ఆ పార్టీలతో పోటీపడుతున్నాయి. అందువలనే కాంగ్రెస్, బిజెపిలకు వ్యతిరేకంగా మూడో ప్రత్యామ్నాయమన్న ఆలోచన విఫలమైంది. "**




గ్రీకు పార్లమెంటు వద్ద కార్మికుల ర్యాలీ

మతోన్మాదాన్ని ఎదుర్కోవలసిన సందర్భాల్లో తటపటాయిస్తోంది. ఆర్థిక సంస్కరణలను బలపరుస్తోంది. మొత్తమ్మీద చూసుకుంటే సరళీకరణ విధానాలు అమలుచేయడంలో బిజెపి, కాంగ్రెస్‌లకు ఏమాత్రం తేడా లేదని రుజువవుతోంది.

**దారి మార్చిన ప్రాంతీయ పార్టీలు**

గతంలో కేంద్రాధిపత్యానికి వ్యతిరేకంగా రాష్ట్రాల హక్కులు కోసం, సంక్షేమ పథకాల అమలుకోసం నిలబడ్డ ప్రాంతీయ పార్టీలు దారి మార్చి కాంగ్రెస్, బిజెపిల సరసన చేరాయి. సరళీకరణ విధానాలు అమలుచేయడంలో ఆ పార్టీలతో పోటీపడుతున్నాయి. అందువలనే కాంగ్రెస్, బిజెపిలకు వ్యతిరేకంగా మూడో ప్రత్యామ్నాయమన్న ఆలోచన విఫలమైంది. బిజెపి, కాంగ్రెస్‌ల ఆధిపత్యాన్ని నిలువరించే పోరాటానికి తెలుగుదేశం, డిఎంకె వంటి పార్టీలు చేసిన ద్రోహం వల్ల దేశానికి చాలా నష్టం కలిగింది. వీటిని నమ్ముకొని తృతీయ ప్రత్యామ్నాయం నిర్మించుకోవాలనుకున్న వామపక్షాల వ్యూహం విఫలమైంది. ఈ అనుభవాల నుంచి పాఠం నేర్చుకుని భవిష్యత్‌లో వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం శరణ్యమన్న నిర్ధారణకు వచ్చాయి. ఈ సంఘటన ఎలా నిర్మించాలన్న దానిపైనే సిపిఐ(ఎం) 21వ మహాసభలో చర్చలు కేంద్రీకృతమవుతున్నాయి.

ఇటీవల జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఎవరూ ఊహించని విధంగా ఘన విజయం సాధించింది. వామపక్ష బలంపై విశ్వాసం కోల్పోయినవారు ఢిల్లీ లాంటి పరిణామాలు దేశం మొత్తం జరుగుతాయని భావిస్తున్నారు. కానీ ప్రస్తుతమున్న పరిస్థితుల్లో ఆప్ ప్రత్యామ్నాయాన్ని అందించగలదా అన్నది అసలు ప్రశ్న. నిజాయితీగా పరిపాలన అందించడమన్న విషయం తప్ప మరే విషయంలోనూ దాని దగ్గర ప్రత్యామ్నాయం లేదు. వామపక్షాల బలహీనతలు వల్లనే ఆప్ లాంటి శక్తులు పుంజుకుంటున్నాయనడంలో సందేహం లేదు. ఆప్‌ను కాంగ్రెస్, బిజెపేతర శక్తిగానే సిపిఎం భావిస్తోంది. కానీ వామపక్షాలతో కలిసి పనిచేయడానికి ఆప్ సిద్ధంగా లేదు. అందువలనే ఆప్‌తో సంబంధం లేకుండానే గత ఎన్నికల్లో వామపక్షాలు స్వతంత్రంగానే పోటీ చేశాయి. తాము పోటీ చేయనిచోట ఆప్‌ను ఏకపక్షంగా బలపరిచాయి. ఆప్ పరిణామం భారతదేశ రాజకీయాల్లో ఒక మధ్యంతర పరిణామంగానే చూడాల్సివుంటుంది. వామపక్షాలు బలపడితేనే దేశ రాజకీయాలకు సంపూర్ణత్వం వస్తుంది.

వామపక్షాలు ప్రాంతీయ పార్టీలతో కలవక పోతే దేశ రాజకీయాల్లో ఒంటరిపాలవు తాయని

> **"సమ్మెలు, ఆందోళనలతోనే రాజకీయ ప్రత్యామ్నాయం రాదు. ఆ పోరాటాల్లో పాల్గొనే ప్రజలు, కార్మికులు, రైతులు, కూలీలు తమ సొంత రాజకీయ పార్టీని బలపరుచుకోవాలి. తమ సొంత హక్కులు సాధన కోసం పోరాటాల్లోకొచ్చే ప్రజలు తమ సొంత రాజకీయ పార్టీని కూడా బలపరుచుకోవాలి. అలాంటి పార్టీ కమ్యూనిస్టు పార్టీ. కమ్యూనిస్టులు, వామపక్షాలకే ఓటెయ్యాలన్న ప్రాథమిక స్పృహను వారిలో కల్పించాలి."**

కొందరు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. నిజానికి వాటితో కలవడం వల్ల వామపక్షాలు తమ స్వతంత్రతను కోల్పోయి ప్రజల నుంచి ఒంటరి అయ్యాయి. ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయం కనిపించకపోవడంతో వామపక్షాలు చుట్టూ ఉన్న జనం కూడా భూర్జువా పార్టీల చుట్టూ చేరాయి. వామపక్షాలతో అవసరం తీరిందనుకున్న భూర్జువా పార్టీలు ఈసారి ఎన్నికల్లో వామపక్షాలను వదిలేశాయి. ప్రజలను స్వతంత్రంగా కూడగడితేనే వామపక్షాలు ఒంటరితనం నుంచి బయటపడగలుగుతాయి. అందుకే వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం కోసం పిలుపునిచ్చాయి. ఆ విధంగా మాత్రమే అవి రానున్న రోజుల్లో ప్రజలకు ప్రత్యామ్నాయం అందించగలుగుతాయి.

**ప్రత్యామ్నాయ నిర్మాణం ఎలా?**

ఎన్నికలు, పొత్తులు, పార్లమెంటరీ సమీకరణాలతో ప్రత్యామ్నాయం ఆవిర్భవించదని అనుభవం రుజువు చేస్తోంది. బలమైన రాజకీయ ప్రత్యామ్నాయం లోపించిన కారణంగానే ప్రజలు నోట్లకు ఓట్లు అమ్ముకుంటున్నారు. పాలకులు పెట్టే ప్రలోభాలకు లోనవుతున్నారు. ప్రజలను చైతన్యవంతం చేసి పోరాటాలకు దించడం ద్వారానే డబ్బు ప్రభావాన్ని ఎదుర్కోగలం. వీటిని లాటిన్ అమెరికా, యూరోప్ అనుభవాలు తెలియజేయస్తున్నాయి. ప్రజాసమస్యలు, లౌకిక తత్వం వంటి సమస్యలపై విశాల వేదికలు ఏర్పాటు చేసి వివిధ పార్టీలు, శక్తులతో కలిసి పని చేయడానికి సిపిఎం సిద్ధంగా ఉంది.

సమ్మెలు, ఆందోళనలతోనే రాజకీయ ప్రత్యామ్నాయం రాదు. ఆ పోరాటాల్లో పాల్గనే ప్రజలు, కార్మికులు, రైతులు, కూలీలు తమ సొంత రాజకీయ పార్టీని బలపరుచుకోవాలి. తమ సొంత హక్కులు సాధన కోసం పోరాటాల్లోకొచ్చే ప్రజలు తమ సొంత రాజకీయ పార్టీని కూడా బలపరుచుకోవాలి. అలాంటి పార్టీ కమ్యూనిస్టు పార్టీ. కమ్యూనిస్టులు, వామపక్షాలకే ఓటెయ్యాలన్న ప్రాథమిక స్పృహను వారిలో కల్పించాలి. పోరాటాలకు నాయకత్వం వహించేవారే ఈ చైతన్యాన్ని తీసుకురావాలి. తమ సొంత పార్టీకి ఓటేసుకోలేనివారు రాజ్యాధికారం కోసం కార్పొరేట్ శక్తులతో పోరాడలేరు. బడా కార్పొరేట్ శక్తులు ఎత్తుల్ని చిత్తుచేసి వామపక్ష, ప్రజాతంత్ర సంఘటన నిర్మించాలి. అందుకు కార్మిక, కర్షక ఉద్యమాలు, సామాజి కోద్యమాలు, సాంస్కృతికోద్యమాలు బహు ముఖంగా నిర్మించాలి.



సిఐటియు నాయకత్వంలో ఢిల్లీలో కార్మికుల ధర్నా

విశాఖలో జరగనున్న 21వ మహాసభలు ఈ దిశగా ఒక ముందడుగు వేయనున్నవి. మారుతున్న పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికుల్నీ, అసంఘటితరంగ కార్మికుల్నీ సంఘటితం చేయాలని తలపెట్టింది. పట్టణాల్లోనే కాదు గ్రామాల్లో కూడా కార్మిక, కర్షక ఐక్యత బలపడాలి. పట్టణాల్లో కార్మికులను ఫ్యాక్టరీలోనే కాకుండా వీరు నివసించే ప్రాంతాల్లో పౌర సమస్యలపై సంఘటితపరచాలి. దాని కోసం పౌర సంఘాలు ఏర్పాటు చేయాలి. కుల వివక్ష, మహిళా సమస్యలపై సామాజికోద్యమాలు నిర్వహించాలి. తద్వారా ప్రజల ఐక్యతను పెంచాలి. ప్రజల్లో పార్టీని రాజకీయంగా బలపరిచే నిర్మాణ పద్ధతులను, సమస్యలను చర్చించేందుకు ఈ మహాసభ అనంతరం ప్రత్యేక ప్లీనరీ నిర్వహిం చాలని సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ నిర్ణయిం చింది. రానున్న రోజుల్లో కమ్యూనిస్టు పార్టీని ప్రజల రాజకీయ ప్రత్యామ్నాయ శక్తిగా తీర్చిదిద్దడమే మన ముందున్న తక్షణ లక్ష్యం.

ఆహ్వానం




వైజాగ్ ఫెస్ట్ 2015

ఏప్రిల్ 10 - 19 వరకు

ఆంధ్రా యూనివర్శిటీ

ఇంజనీరింగ్ కాలేజి గ్రౌండ్

విశాఖపట్నం

మీడియా

# భారత పత్రికారంగం భవిష్యత్తేమిటి?

**ఎన్. రామ్**



రచయిత హిందూ పత్రిక మాజీ సంపాదకులు

అభివృద్ధి చెందిన ప్రపంచ దేశాలలో వార్తా పత్రికారంగం చూస్తుండగానే సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ డిజిటల్ యుగంలో బాగా అభివృద్ధి చెందిన దేశాలలోని వార్తా పత్రికలూ, సమాచార టెలివిజన్ల భవితవ్యంపై విషాదం అలముకుంది. వ్యాన్ ఇఫ్రా ఆధ్వర్యంలో అక్టోబర్ 2011న వియన్నాలో నిర్వహించిన ప్రపంచ వార్తా పత్రికల మహాసభ, ప్రపంచ సంపాదకుల ఫోరంలలో నేనూ పాల్గొన్నాను. ఆ సమావేశాల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరిలోనూ వార్తా పత్రికారంగ చారిత్రక యుగం ముగింపు కొచ్చిందని, ప్రపంచవ్యాప్తంగా అటూ ఇటూగా అందరం నిలకడలేని అనిశ్చితిలోకి అడుగుపెడుతున్నామన్న భావన కలిగింది. పాఠకుల ప్రవర్తనలోనూ, వార్తలను స్వీకరించే తీరులోనూ పెనుమార్పులు వస్తున్నాయి. వెబ్, మొబైల్ వేదికలు వేగాన్ని పుంజుకుంటున్నాయి. ప్రాణాంతకమైన ఆర్థిక ఇబ్బందులతో పాటు జారిపోతున్న పాఠకలోకాన్ని తిరిగి చేజిక్కించుకోవడం సంప్రదాయ వార్తాపత్రికా రంగానికి పెను సవాలైంది. పరిశ్రమకు సంబంధించిన ఇటువంటి ధోరణులతోపాటు అభివృద్ధి చెందిన దేశాలలో ఒత్తిళ్ళు, నిరాశ నిర్వేదాలు, గందరగోళాలతో ఇప్పటికే స్వతంత్రమైన, సమర్థవంతమైన జర్నలిజం భారీగా దెబ్బతింది. కొలంబియా యూనివర్శిటీలోని మా పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ప్రచురించిన "అమెరికా జర్నలిజం పునర్నిర్మాణం" అన్న సమకాలీన నివేదికలలో ప్రస్తావించినట్లు, " దేశానికి పట్టుగొమ్మలైన వార్తాపత్రికలు, కొద్దిమంది జర్నలిస్టులతో, కొద్ది పేజీలకు పరిమితమై, కొన్ని కథనాలతో వాస్తవంగా కుంచించుకుపోతున్నాయి.

ఈ దుస్థితితో భారతదేశ వార్తా పత్రికా రంగాన్ని పోల్చిచూస్తే, అది అభివృద్ధి బాటలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. కాని ఎగిసిపడుతున్న మన అభివృద్ధి వృత్తాంతం, దాని పర్యవసానాల్ని విమర్శనాత్మకంగా పరిశీలించుకోవాల్సివుంది. గణాంకాలు అందుబాటులో ఉన్నా వాటిని అంతగా పట్టించుకోదలచలేదు. 2012 న్యూయార్కర్ పత్రికలో కెన్ ఔలెట్టా తన వ్యాసంలో భూమండలంలో వార్తాపత్రికలు బతికి బట్టకడుతున్న దేశాలలో భారతదేశం ఒకటని, ఇక్కడ జర్నలిస్టులకు, ప్రత్యేకించి యువకులకు పుష్కలంగా నైపుణ్యావకాశాలు ఉన్నాయని వ్రాశారు.

ఇండియన్ ప్రెస్, ప్రత్యేకించి భారతదేశ భాషా వార్తా పత్రికలూ మరియు ఉపగ్రహ వార్తా టెలివిజన్ వృద్ధిపథంలో కొనసాగుతున్నాయి. ఈ అభివృద్ధి కథనంతో కొంతభాగాన్ని విశేషంగా పరిశోధించి, విశ్లేషించిన అంశాల్ని 15 సంవత్సరాల క్రితమే రాజకీయ శాస్త్రవేత్త అయిన రాబిన్ జఫ్రీ తన "భారతదేశ వార్తా



పత్రికా విప్లవం" అన్న పుస్తకంలో పొందుపరిచారు. దీనితోపాటు ఈ అంశంపై ఎకనామిక్ మరియు పొలిటికల్ వీక్లీలో 1987, 1993, 1997లలో సీరియల్‌గా ఆయన వ్యాసాల్ని ప్రచురించారు. అభివృద్ధి చెందిన సాంతికే విజ్ఞానం, నిలకడగా విస్తరిస్తున్న అక్షరాస్యత, మెరుగైన కొనుగోలుశక్తి, వైవిధ్య భరితమైన కథనాలు, వీటన్నింటిని మించి రాజకీయ ఉత్సుకతలు-భారత వార్తా పత్రికా విప్లవం వెనుకనున్న కీలకాంశాలుగా రాబిన్ జఫ్రీ పేర్కొన్నారు. ఇక్కడ వార్తల దాహర్తి పుష్కలంగా ఉండి, విశ్లేషణలు, వ్యాఖ్యానాలు, వినోదం, వాటి సంకర ఆవిష్కరణ అయిన "వినోదాత్మక సమాచారం" అన్నీ వార్తల ముసుగు క్రింద చలామణి అవుతున్నాయి. ఈ మూసలో పలుకుబడి కలిగిన భారత భాషా వార్తా దినపత్రికలు పుంఖాను పుంఖాలుగా విస్తరించాయి. అందులో చాలా పత్రికలు అత్యధిక సర్క్యులేషన్, భారీ పాఠక లోకాన్ని కలిగి ఉన్నాయి.

అయినప్పటికీ భారత పత్రికారంగం ప్రదర్శిస్తున్న ఎగసిపడే అభివృద్ధిని, వాటి పర్యవసానాల్ని ఆరాధనా స్థాయికి తీసుకు వెళ్ళకూడదు. భిన్నత్వాలు కలిగిన ప్రజల అవసరాలు, ప్రత్యేకించి గ్రామీణ ప్రజలు, మహిళల అవసరాలకు న్యాయం చేయకలిగే సామాజిక దృక్కోణం కలిగి ఉండటానికి భారతదేశ వార్తా పత్రికారంగం ఇంకా చాలా దూరం ప్రయాణించవలసి ఉన్నది. ఈ అంశాలపై సంపాదకీయాలు వ్రాయటానికి వాస్తవంలో అనేక ఇబ్బందులు ఇమిడే ఉన్నాయి.

భారత టెలివిజన్ భారీ ప్రేక్షకలోకాన్ని కలిగివుండి ఇంకా వృద్ధి చెందుతూనే ఉంది. అయినప్పటికీ ఈ సామూహిక ప్రేక్షక లోకంలో అత్యధికభాగం వినోద ఛానళ్ళకు సంబంధించినవారే. ఇంగ్లీష్ మరియు ఇతర భాషా వార్తాపత్రికలతో పోటీ పడగలిగిన 24×7 ఉపగ్రహ టెలివిజన్ వార్తా ఛానళ్ళు డజన్లలో ఉన్నా, మొత్తం టీవీ మార్కెట్లో వారి నిష్పత్తి చాలా స్వల్పంగా ఉంది.

భారత పత్రికారంగం ప్రదర్శిస్తున్న ఎగసిపడే వృద్ధిని పెద్దదిగా చేసి చూపించవద్దనటానికి ఇతర కారణాలు కూడా ఉన్నాయి. కవర్‌పేజీ ధరలకంటే తక్కువ ధరలకు పత్రికలను అమ్మడం, వందల వేలాది కాపీలను ముద్రించి, వాటిని పాత కాగితాల మార్కెట్‌కు తరలించడం లాంటి అనైతిక పద్ధతులతో భారీ సర్క్యులేషన్

**"ప్రింట్, సమాచార రంగ వ్యవస్థలన్నీ క్రమంగా ఆర్థిక సంక్లిష్టతను ఎదుర్కొంటున్నాయి. గత కొద్ది సంవత్సరాలుగా వాణిజ్య ప్రకటనల రంగం కుంచించుకుపోతున్నది. పత్రికాప్రచురణ రంగంలో వృద్ధి మందగించింది. 2008-09 ప్రపంచ ఆర్థిక సంక్షోభం ఇందుకు దోహదపడినట్టుంది. అది భారత పత్రికారంగ వృద్ధిని దెబ్బతీసింది. సంక్షోభ పూర్వకాలంలో చవిచూసిన, కీలకమైన వాణిజ్య ప్రకటనల రెవెన్యూను మనం తిరిగి చూడలేమని నిపుణులు చెబుతున్నారు."**




ప్రింట్ మీడియా స్థానాన్ని ఆన్‌లైన్ న్యూస్ వేగంగా ఆక్రమిస్తోంది

లేబిల్ పొందడం వార్తా పత్రికలకు పరిపాటి అయ్యింది. వీటిలో రెండవ పద్ధతి వాణిజ్య ప్రకటనల సముపార్జనకు ఒక విధాన ప్రక్రియగా మారింది. ఇది చాలదన్నట్లు టెలివిజన్ ప్రేక్షకుల కొలమాన విధానం (టి.ఎ.ఎం.) విస్తృతమైన విమర్శలకు గురై, న్యాయపరమైన చిక్కులను ఎదుర్కొంటున్నది.

ప్రింట్, సమాచార రంగ వ్యవస్థలన్నీ క్రమంగా ఆర్థిక సంక్లిష్టతను ఎదుర్కొంటున్నాయి. గత కొద్ది సంవత్సరాలుగా వాణిజ్య ప్రకటనల రంగం కుంచించుకుపోతున్నది. పత్రికాప్రచురణ రంగంలో వృద్ధి మందగించింది. 2008–09 ప్రపంచ ఆర్థిక సంక్షోభం ఇందుకు దోహదపడినట్టుంది. అది భారత పత్రికారంగ వృద్ధిని దెబ్బతీసింది. సంక్షోభ పూర్వకాలంలో చవిచూసిన, కీలకమైన వాణిజ్య ప్రకటనల రెవెన్యూను మనం తిరిగి చూడలేమని నిపుణులు చెబుతున్నారు.

భారతదేశం డిజిటల్ యుగ వైరుధ్యాలను ఎదుర్కొని ఎలా మనగలుగుతుంది? పరివర్తనా యుగానికి కేంద్రమైన ఈ వైరుధ్యాన్ని వివరించటానికి ప్రయత్నిస్తాను. ఒక ప్రక్కన అత్యధికంగా ప్రజలు డిజిటల్‌గా వార్తాపత్రికల్ని చదివేందుకు ముందుకొస్తున్నారు. మొట్ట మొదటిసారిగా చరిత్రలో ఉత్తమ ప్రచురణలకు ప్రపంచవ్యాప్త సజీవ పాఠకలోకాన్ని కలిగి వున్నాము. బహుముఖమైన శీర్షికలతో, మల్టీ మీడియా హంగులతో సుసంపన్నమైన అనేక అత్యుత్తమ వార్తాపత్రికలూ, వార్తా వెబ్‌సైట్లు లభ్యమౌతున్నాయి. లభ్యమౌతున్న ఈ స్థలంలో అందించగలిగే సమర్థతకు ఆకాశమే హద్దుగా ఉన్నది. మరోప్రక్క పాత వార్తాపత్రికారంగాన్ని అతలాకుతలం చేస్తున్న "అస్తిత్వ సంక్షోభం" ఇంకా పరిష్కరింపబడలేదు. భారీ నష్టాన్ని చవిచూస్తూ అది కొనసాగుతూనే ఉన్నది. ఎందుకంటే ఈ అద్భుతమైన పరిణామం అటు అంతర్జాలానికి గాని లేదా ఇటు డిజిటల్ జర్నలిజానికి గాని మనగలిగే ఆదాయాన్ని మరియు వ్యాపార నమూనాని ఇవ్వలేక పోతున్నది.

అంతర్జాల వినియోగంలో, బ్రాడ్ బ్యాండ్ లభ్యం కావడంలో మన దేశం సాపేక్షంగా వెనుకబడి ఉన్న కారణంగా వార్తా పత్రికారంగం సమాచార టెలివిజన్ ఆ మేరకు ప్రయోజనాల్ని పొందగలగడంలో ఎవరికీ లేశమాత్రమైన సందేహం కూడా లేదు. ఈ విషయంలో చైనా అత్యద్భుత ప్రగతిని సాధించింది. జులై 2014 అంతానికి ఆ దేశంలో 63.2 కోట్లమంది అంతర్జాల వినియోగదారులున్నట్లు అంచనా వేస్తున్నారు. వీరిలో అత్యధికభాగం బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులు కావడం విశేషం. మనదేశ అంతర్జాల అభివృద్ధిపై అధికారికంగా ఇంతవరకు ఏవిధమైన శాస్త్రీయ సర్వే నిర్వహింపబడలేదు. చిత్తు అంచనాలలో భారతదేశంలో 24కోట్ల మంది అంతర్జాల వినియోగదారు లున్నట్లు తెలుస్తున్నది. వీరిలో అత్యధికులు లోప భూయిష్టమైన బ్యాండ్‌విడ్త్‌తో సతమతమౌతున్నారు. పోల్చదగ్గ జనాభా కల్గిన ఈ రెండు దేశాల్లో అంతర్జాల విస్తరణ పోలిక ఆసక్తికరమైన విశేషాల్ని తెలియజేస్తుంది. భారతదేశంలో కంటే చైనాలోఅంతర్జాల విస్తరణ రెండున్నర రెట్లకుపైగా ఉంది.

దీనర్థమేమంటే వార్తాపత్రికారంగం మరియు సమాచార టెలివిజన్లపై డిజిటల్ విప్లవ ప్రభావం పడటం ఇంకా ప్రారంభం కాలేదు. మనదేశంలో ప్రతి వార్తాపత్రిక వెబ్‌సైట్ కలిగి ఉండి, అందులో అనేక పత్రికలు సమాచారాన్ని, ఆకర్షణీయమైన డిజిటల్ హంగులను దేశ, విదేశీ పాఠకుల కోసం నిర్వహిస్తున్నప్పటికీ, అవి ప్రింట్ మీడియాకు లోబడే ఉన్నాయి. ది గార్డియన్ పత్రిక సంపాదకులు ఎలన్ రుస్ బ్రిడ్జర్ ఇలా చెప్తున్నారు. 'జర్నలిజం కాంతి తరంగాల వేగంతో సమానంగా మార్పుకు గురౌతున్నది. (దాదాపు సెకనుకు 3 లక్షల కి.మీ.) మీడియాను పరివర్తింప చేస్తున్న డిజిటల్ టెక్నాలజీల నూతన విజ్ఞానాన్ని, నవీన సత్యాలను తప్పనిసరిగా ప్రతి వారం తెలుసుకుంటున్నాము" ఈ మార్పు మన దేశంలో శబ్ద తరంగాల వేగంతో (సెకనుకు 342.29 మీటర్లు) ఉన్నట్లు మన దేశ వార్తా పత్రికా పరిశ్రమ అంతర్గతంగా అభిప్రాయపడుతున్నట్లుంది.

ఈ పరిస్థితి ఉదాసీనతను పుట్టిస్తున్నది. డిజిటల్ యుగానికి ముఖ్యమైన నూతన విజ్ఞానాన్ని, నవీన సత్యాలను తెలుసుకోవాలనే నిజమైన చొరవ ఉండటం లేదు. అమెరికా ప్రింట్‌మీడియా ఎదుర్కొంటున్న పరిస్థితిని భారత వార్తా పత్రికారంగం 2040 నాటికి ఎదుర్కోవలసి ఉంటుందని, ప్రకటనలపైన, ఇతర అంశాలపైన ఆర్జించగలిగే రెవెన్యూలో అత్యధికభాగం మనం సొంతం చేసుకోవటానికి సంసిద్ధులం కావాలని భారతదేశంలో కొన్ని అధ్యయనాలు తెలుపుతున్నాయి. డిజిటల్ ప్రభావం తక్షణం కాకపోయినా సమీపంలో ఉంటుందన్న వాస్తవాల్ని గుర్తించలేని వారి జోస్యాలు, అంచనాలు సత్య దూరాలనిపిస్తుంది. 2040 వరకు పరివర్తన సమయం రాకుండటం అసాధ్యమనిపిస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న ఏకీకరణల ప్రక్రియతో రాజీపడటం, ఇక్కడ మన ముందు పెద్ద సవాలుగా నిలిచింది. 'మార్పు' యొక్క నడకను నిశితంగా అంచనా వేసుకొని, సంక్లిష్ట పరిస్థితులను గమనంలో ఉంచుకొని

భవిష్యత్ మార్పులకు సిద్ధం కావలసి ఉంది.

భారత వార్తా పత్రికల రంగంలో పలుకుబడి కలిగిన వర్గాలు చాలాకాలంగా రాజకీయాలలో నిర్వహిస్తున్న ప్రజాతంత్ర పాత్ర ప్రశ్నించలేనిది. దురదృష్టవశాత్తూ, ఆర్థిక సమస్యలు, విధానాలు వచ్చేసరికి ప్రధాన స్రవంతి మీడియా అప్రజాస్వామికంగానే వ్యవహరిస్తున్నది. కానీ ఎప్పుడూ ఇదే విధానం కొనసాగటం లేదు. ఆకలి చావుల సమస్యల్లో క్షేత్రస్థాయిలో తీవ్ర బాధితుల వాస్తవ జీవితాల్ని బహిరంగపరచటంలోను, ప్రభుత్వం అనుసరిస్తున్న వినాశకర విధానాల అమలును నివారించి, తీవ్ర ఆకలి, క్షామ పరిస్థితుల నుండి విముక్తిపరిచే గ్యారంటీలు పొందటంలోను ఇతర ప్రజాతంత్ర సంస్థలతో కలిసి భారత దేశ మీడియా నిర్వహించిన చారిత్రాత్మక పాత్రను అమర్త్యసేన్ కొనియాడారు.

గత రెండు దశాబ్దాలుగా తీవ్ర దుష్ప్రభావాల్ని కలిగించిన నయా ఉదారవాద విధానాలను సవాలు చేసే వార్తలు, విశ్లేషణలు, వ్యాఖ్యానాల్ని భారత వార్తా పత్రికా పరిశ్రమను నిర్వహిస్తున్న అనేక శక్తులు బహిష్కరించాయి. ప్రధాన స్రవంతి పత్రికలు మరియు సమాచార టెలివిజన్ ఆ విధానాలను నెత్తికెత్తుకొని, వాటిపై వస్తున్న విమర్శల్ని, అభ్యంతరాల్ని ప్రచురణకు నోచుకోకుండా చేయటమో లేదా విమర్శల పదును తగ్గించడమో చేస్తున్నారు. సామాజిక ఆర్థిక ప్రతికూల ప్రభావాల్ని సెన్సార్ చేస్తున్నారు. ఆర్థిక నిపుణులతో పాటు ఈ విధానాలపై పటిష్టమైన విమర్శలు చేసే వారి గొంతుకలకు కూడా ప్రచురణలో స్థానం కల్పించడం లేదు.

ప్రజల దైన్యస్థితుల వాస్తవాలను ప్రముఖంగా చెప్పటం కంటే "అంతా బాగానే ఉంది" అన్న భావనకు ప్రచురణలలో ప్రాధాన్యత నివ్వాలని పత్రికా యజమానులు, ప్రకటనకర్తలు, మార్కెటింగ్ అధికారులు, కార్పొరేట్ మేనేజర్లు, చివరకు సీనియర్ జర్నలిస్టుల నుండి కూడా భారతదేశ జర్నలిజం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నదని విమర్శకులు ఎత్తిచూపుతున్నారు. "పేదరికం, ప్రత్యేకంగా గ్రామీణ పేదరికం, వార్తలకుగాని, సంపాదకీయాలకుగాని కథనా వస్తువుగా ఉండకలిగే అర్హత లేదంటున్నారు. పేదరికంలో ఉన్న యువకులకు, ఈ వార్తాసేకరణ వారి ఆకాంక్షల్ని ఎలా నెరవేర్చగలదని, వ్యాపార తాత్వికత నుండి ఉద్భవించిన వార్తాపత్రిక సంపాదకీయ తాత్వికత, ఆశావాదాలలో ఒకటిగా ఎలా మనగులుగుతందనే అంశాల గూర్చి భారతదేశ వార్తా పత్రికా ఎగ్జిక్యూటివ్లతో 'ఔలెట్ట' నిర్వాహమాటంగా జరిపిన సంభాషణల నుండి తెలుసుకొన్నారు.

> **"ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న ఏకీకరణల ప్రక్రియతో రాజీపడటం, ఇక్కడ మన ముందు పెద్ద సవాలుగా నిలిచింది. 'మార్పు'యొక్క నడకను నిశితంగా అంచనా వేసుకొని, సంక్లిష్ట పరిస్థితులను గమనంలో ఉంచుకొని భవిష్యత్ మార్పులకు సిద్ధం కావలసి ఉంది."**

చెన్నైలోని ఆసియా స్కూల్ ఆఫ్ జర్నలిజం విద్యార్థులకు 2002 సంవత్సర స్నాతకోత్సవం సందర్భంగా ప్రముఖ ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్, "మార్కెట్లు, నైతికత, మీడియా" అనే అంశంపై తన స్వతసిద్ధమైన, అసాధారణమైన అవగాహనతో ప్రసంగించారు. ఆయన ఆ సందర్భంగా చేసిన ప్రసంగ పూర్తి పాఠం ఆన్‌లైన్‌లో లభ్యమౌతున్నది. ఇక్కడ దాని ముగింపును మాత్రం ప్రస్తావిస్తాను.


ఆర్థిక అంశాలకు సంబంధించి మీడియా శక్తిపై, పై ప్రసంగాన్ని మనం "పట్నాయక్ చట్టం"గా అభివర్ణించవచ్చును. "అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి, మీడియా ఒకే సరసన ఉన్నప్పుడు, మీడియా శక్తివంతంగా కనిపిస్తుంది. కానీ దానంతటదిగా మీడియా మానవ విలువల్ని సమర్థిస్తూ, పేదలు నిర్భాగ్యుల వేదనల్ని వాస్తవంగా వ్యక్తం చేసినప్పుడు అది శక్తివిహీనంగా కనిపిస్తుంది. ఈ శక్తి విహీనత ఒక ప్రక్రియ ద్వారా ఉద్భవిస్తుందని ఆయన సూత్రీకరించారు. ఆర్థికవ్యవస్థపై అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రాబల్యం సాధించడమే ఆ ప్రక్రియగా చెప్పారు. వైరుధ్యపూర్వకమైన, గౌరవనీయమైన కొన్ని మినహాయింపులు తప్పించి, స్థూలంగా ఈ ప్రాబల్యాన్ని మీడియా మనస్ఫూర్తిగా సమర్థిస్తున్నది. పేదరికం, సామూహిక నిరాకరణ, మౌలిక జీవనాధార సమస్యలు, ఈ సమస్యలపై ప్రభుత్వ విధానాల ప్రభావం, వ్యవసాయం స్థితిగతులు, గ్రామీణ సమస్యలు భారతదేశ వార్తాపత్రికల్లో, సమాచార టెలివిజన్‌లో అతి తక్కువస్థాయిలో ప్రచురణకు నోచుకుంటున్నాయి. పట్నాయక్ ప్రస్తావించిన 'గౌరవనీయ మినహాయింపులు' చాలా సార్థకమైనవి. గ్రామీణ దుస్థితి, రైతుల ఆత్మహత్యలు, సామూహిక వలసలులాంటి సామాజిక అంశాలపై పి. సాయినాథ్ పరిశోధన వ్యాసాలు, ప్రజాహితమైన, పరిశోధనాత్మకమైన, కార్యాచరణను రూపొందించే జర్నలిజం యొక్క విలువైన సాంప్రదాయాలకు కట్టుబడి ఉన్నాయి. ఇటువంటి జర్నలిజానికి విలువనివ్వకలిగే ప్రజా సంస్కృతిని నిర్మించగలిగి, ప్రతిభావంతమైన పై కృషికి వివిధ భారతీయ భాషల్లో ఈ అంశాల పైనే ఆదర్శ భావాలు గల యువ విలేకరుల రచనలు తోడైతే ప్రస్తుత సంక్లిష్ట స్థితినుండి బయటపడటానికి మార్గం దొరకగలదు.

భారత వార్తా పత్రికా రంగం చర్చలలో తరచూ ఉపేక్షింప బడుతున్న క్లిష్టమైన అంశం దగ్గరకు వచ్చాను. రెండురకాలైన పరిస్థితులు, వార్తా పత్రికా పరిశ్రమ అదృష్టాలు, జర్నలిజం స్థితి. ఈ రెంటిని కలుపకూడదు. యాజమాన్యాల ఆర్థిక రాజకీయ ప్రయోజనాల్ని నెరవేర్చడం కోసం వార్తల్ని, విశ్లేషణల్ని, వ్యాఖ్యానాల్ని మార్చుతున్నారు. ప్రముఖ వార్తాపత్రికలూ, వార్తా టెలివిజన్ సంస్థలలో సంపాదకీయ విషయాన్ని, సంపాదకీయ కార్యకలాపాల్ని తక్కువచేయడం, విలువలేకుండా చేయడం, మార్కెట్ పరిశోధన పేరుమీద క్రమపద్ధతిన నోరు మూయించడం చేస్తున్నారు. యాజమాన్యాలు, సీనియర్ మేనేజ్‌మెంట్ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సంపాదకీయాల స్థాయిని దిగజార్చే పద్ధతులను ఇష్టపూర్వకంగా అంగీకరించడం, సంపాదకీయ సమాచారం ముందుగులో అందించే అడ్వర్‌టైజ్‌మెంట్ సమాచారంలో వార్తలకు చెల్లించే వివరాలను పూర్తిగా ఇవ్వకపోవడం, అసలు ఇవ్వకపోవడం చేస్తున్నారు. ప్రైవేటు ఒప్పందాలు, ఎన్నికల ప్రచార వార్తలకు చెల్లింపులు స్వీకరించడం, అనుకూల వార్తల ప్రచురణలకు లంచాలు తీసుకోవడం, ఈ రకమైన పద్ధతులలో వార్తా పత్రికలూ, ఇతర వార్తా మీడియా వర్ధిల్లుతుంటే భారత దేశ మీడియా రంగం తీవ్రమైన అక్రమాలతో కూడిన అభివృద్ధిబాటలో పయనిస్తున్నదని భావించాల్సి వస్తున్నది.

**(అనువాదం: కొండముది లక్ష్మీ ప్రసాద్)**

ఈ మాసం ప్రత్యేకం

# అభివృద్ధికి నోచని అభాగ్యులగురించి ఆలోచించరా?



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పొలిట్ బ్యూరో సభ్యులు, త్రిపుర ముఖ్యమంత్రి

మాణిక్ సర్కార్

**ఫిబ్రవరి 7వ తేదీన న్యూఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ (నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా) మొదటి సమావేశంలో త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్‌సర్కార్ చేసిన ప్రసంగ పూర్తి పాఠం మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం:**

ప్రణాళికా సంఘం స్థానంలో ఏర్పాటు చేసిన నీతి ఆయోగ్ భారతదేశంలో అన్నిరంగాల్లోనూ ప్రైవేటీకరణను ప్రోత్సహించేదిగానూ, మార్కెట్ ఆధారిత ఆర్థికవ్యవస్థగా మార్చేదిగానూ ఉండకూడదు. ప్రభుత్వ నిధులను ప్రైవేటురంగం, మార్కెట్ శక్తుల చేతుల్లోనూ పెట్టేదిగా ఈ విధానాన్ని అమలుచేయకూడదు.

ప్రణాళికాబద్ధమైన ఆర్థికాభివృద్ధి లక్ష్యం దేశంలోని అన్ని తరగతుల ప్రజానీకపు జీవితాన్ని మెరుగుపరిచేదిగానూ, వారు మరింత గౌరవప్రదమైన జీవితం గడిపేలా చేయటంగా ఉండాలనే అంశాన్ని మీరందరూ అంగీకరిస్తారు. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే ప్రజలందరికీ కొన్ని రక్షణలు కల్పించాలి. ఆహారభద్రత, ఇల్లు, విద్య, వైద్యం, వీటితో పాటుగా వారు అర్థవంతమైన జీవితం గడపటానికి తగిన ఆదాయం వచ్చేలా ఉత్పత్తి రంగంలో ఉద్యోగాలు సంపాదించుకోవటానికి వారికి తగిన అవకాశాలు కల్పించాలి.

భారతదేశంలో ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఉన్నదని తరచుగా చెపుతున్నారు. ఈ అభివృద్ధి ఫలితాలు దేశంలో అట్టడుగున ఉన్న పేదలకు, బలహీనవర్గాలకు చేరుతున్నాయా అనేది ప్రధానమైన అంశం. వాస్తవమేమిటంటే దేశంలో ఉన్నవారికి, లేనివారికి మధ్య అగాధం పెరుగుతున్నది.

పెద్దసంఖ్యలో ప్రజలు దరిద్రం, నిరుద్యోగంతో బతుకుతున్నపుడు ప్రణాళిక, అభివృద్ధి అనేవి అర్థంలేనివి అవుతాయి. దేశంలో ఉన్న మానవ వనరులను సక్రమంగా వినియోగించుకొంటూ, విద్యావంతులైనవారికి, కొద్దిమేరకు చదువుకున్నవారికి, చదువులేనివారికి అర్థవంతమైన ఉద్యోగాలు కల్పిస్తూ, ఉత్పత్తిలోనూ, దేశాభివృద్ధిలోనూ వారిని భాగస్వాములనుచేస్తూ, వారి శక్తిసామర్థ్యాలను వినియోగించుకోవాలి. కాబట్టి ప్రణాళిక అనేది ఉద్యోగాలు కల్పించటం లక్ష్యంగా ఉండాలి. ప్రతివారూ వారి శక్తిసామర్థ్యాలకు, నైపుణ్యానికి తగిన ఉద్యోగాలు పొందాలి. దారిద్ర్యం సమస్యను పరిష్కరించటానికి నిర్దిష్ట కాల పరిమితిని నిర్ణయించుకోవాలి.

అజెండా 1. నీతిఆయోగ్‌ను ఏర్పాటు చేస్తూ తీర్మానం చేయాలి. పూర్తికాలపు నిర్మాణ చట్రాన్ని రూపొందిస్తూ నోటిఫికేషన్ జారీ చేయాలి.

వివిధ అంశాలను సంస్థాగతమైన పద్ధతిలో కేంద్రం, రాష్ట్రాలు ఐక్యంగా పరిష్కరించుకోవటం కోసం కమీషన్‌లో ఉండే నాన్ ఎక్స్‌అఫీషియో సభ్యులను కేంద్రం, రాష్ట్రాలు కలిసి పరస్పరం సంప్రదింపులతో, ఏకాభిప్రాయంతో నిర్ణయించాలి. రెండవఅంశం. ఎక్స్‌అఫీషియో సభ్యులలో కేంద్రమంత్రుల సంఖ్యతో సమానంగా రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఉండాలి. మూడవఅంశం. కమీషన్‌లోని ఎక్స్‌అఫీషియో సభ్యులలో ఈశాన్యరాష్ట్రాల నుండి ఒకరు తప్పనిసరిగా ఉండాలి. నాలుగవ అంశం. ఈశాన్యరాష్ట్రాల నుండి, దేశంలోని ఇతర ప్రాంతాల నుండి కమీషన్‌లోకి ముఖ్యమంత్రులను రొటేషన్ పద్ధతిలో తీసుకోవాలి. ఆ విధంగా అయితే ప్రతిరాష్ట్ర ముఖ్యమంత్రి ఏదోఒక సమయంలో కమీషన్‌లో సభ్యునిగా ఉండటం సాధ్యమౌతుంది. ఐదవఅంశం. ఎక్స్‌అఫీషియో సభ్యులతో కలిపి కమీషన్ పూర్తిస్థాయి సమావేశాలు సంవత్సరానికి రెండు సార్లయినా జరగాలి.

అజెండా 2. ప్రణాళికాసంఘం నుండి నీతిఆయోగ్‌కు క్రమపద్ధతిలో మార్పు జరగటానికి తగిన ఏర్పాట్లు చేయాలి.

పన్నెండవ పంచవర్ష ప్రణళిక (2012–17) అమలు మూడవ సంవత్సరంలో ఉంది. కాబట్టి సంవత్సర ప్రణాళికల అమలు క్రమాన్ని సమీక్షించుకోవటం అవసరం. ఈ సమీక్షలు, లోపాలను సరిచేసుకొనే చర్యలు, ఆచరణాత్మకంగా, ఫలితాలు సాధించేలా ఉండాలి.

కేవలం అత్యధిక జిడిపి పెరుగుదలను సాధించటం మాత్రమే ఆర్థికవ్యవస్థలో నిరుద్యోగాన్ని, పాక్షిక నిరుద్యోగాన్ని, ప్రచ్ఛన్న నిరుద్యోగాన్ని నిర్మూలించటానికి అవసరమైనంత ఉద్యోగకల్పనను సాధించలేదు. ఆకలిని, దారిద్రాన్ని తగ్గించటంలో కూడా ఏమాత్రం ప్రభావం చూపలేదనే విషయాన్ని చెప్పుకోవటం సమంజసంగా ఉంటుంది. కాబట్టి నీతిఆయోగ్

జిడిపి పెరుగుదలపై కేంద్రీకరిస్తూనే, సాధ్య మైనంత త్వరలో విస్తారమైన ప్రజానీకం యొక్క పరిస్థితిని మెరుగుపర్చటానికి తగిన చర్యలు తీసుకోవాలి.

అజెండా 3. జాతీయాభివృద్ధి ప్రాధాన్య తలు, విధానాలు, రంగాలవారీ వ్యూహాలకు సంబంధించి నీతిఆయోగ్ విధాన చట్రాన్ని రూపొందించాలి.

నిర్దిష్టమైన కాలపరిమితిలేని ప్రణాళిక అంటే ఏ విధమైన ప్రణాళికా లేకపోవటమే. కాబట్టి పంచవర్ష ప్రణాళికల క్రమం కొనసాగు తుండాలి. కొన్ని లక్ష్యాలు సాధించటానికి ఐదు సంవత్సరాల ప్రణాళికా కాలం కన్నా ఎక్కువకాలం పట్టవచ్చు. అయినా నీతిఆయోగ్ లక్ష్యం వాటిని నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేసేలా ఉండాలి. సంవత్సర ప్రణాళికలు పంచవర్ష ప్రణాళికలలో భాగం. పంచవర్ష ప్రణాళికల లక్ష్యాలను సాధించటానికి ప్రతిరాష్ట్రం లోనూ జరుగుతున్న కృషిని మదింపు చేయటానికి ఇవి మంచి అవకాశాన్ని కల్పిస్తాయి. కాబట్టి వాటిని తప్పనిసరిగా కొనసాగించాలి.

మన అవగాహన ననుసరించి జాతీయాభివృద్ధి ప్రాధాన్యతలను నిర్ణయించు కోవటం, విధానాలను, రంగాలవారీగా వ్యూహాలను నిర్ణయించుకోవటంలో నీతిఆయోగ్ శక్తివంతమైన పాత్రను నిర్వహించాలి. నూతన రూపకల్పనలు, నాలెడ్జ్ హబ్‌లాంటి వాటిని పరస్పరం పోటీపడే స్వతంత్ర సంస్థల ఆధ్వర్యం లో కాకుండా నీతిఆయోగ్ పర్యవేక్షణలోకి తీసుకురావాలి. మన అవగాహన ననుసరించి నీతిఆయోగ్ అభివృద్ధి రేటు తదితరాలను పట్టించుకోనవసరం లేనప్పటికీ, స్వేచ్ఛ, సమానత్వంతో కూడిన భారతదేశాన్ని నిర్మించ టానికి తగిన భౌతిక పరిస్థితులను సృష్టించటం కోసం ఉత్పత్తి, ఉత్పత్తిదారులకు ప్రోత్సాహకాలు, ఉత్పత్తిపై ప్రభావం చూపించే అన్నిరకాలైన అంశాలలోనూ జోక్యం చేసుకోవాలి. ఈ అంశాలకు సంబంధించి అనిర్దిష్టమైన లక్ష్యాలను కాకుండా, సర్వవ్యాప్తమైన, నిర్దిష్టమైన కనీస లక్ష్యాలను నిర్ణయించుకోవాలి.

ఉదాహరణకు ప్రతివారికీ అవసరమైనంత శక్తినిచ్చే ఆహారాన్ని అందజేయాలంటే ఆహార ధాన్యాల ఉత్పత్తి, సేకరణ తదితరాలను ప్రభుత్వం జయప్రదంగా అమలుచేయాలి. అందుకోసం రైతులకు ఉత్పాదకాలు, రుణాలు, గిట్టుబాటుధరలు అందజేయటం, సేకరణ యంత్రాంగాన్ని ఏర్పాటుచేయటం తదితర రూపాలలో ప్రోత్సాహకాలు కల్పించాలి. వినియోగదారులకు వారు భరించగలిగిన ధరల్లో సరుకులను సరఫరాచేయాలి. వారికి తగినంత కొనుగోలుశక్తిని కూడా కల్పించాలి. గతంతో పోల్చుకుంటే ఈమధ్యకాలంలో దేశంలో వ్యవసాయ పరిశోధనలను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా వ్యవసాయ సరుకుల వ్యాపారంలో ఉన్న బహుళజాతి సంస్థలపై ఎక్కువెక్కువగా ఆధారపడాల్సి వస్తున్నది. ఇది భవిష్యత్తులో ఎదురవబోయే ప్రమాదాన్ని గురించి హెచ్చరిస్తున్నది. ప్రణాళికా లక్ష్యాలను సాధించా లంటే దేశంలోని సామాజిక ప్రాధాన్యతలకు అనుగుణంగా ఉత్పత్తిని కొనసాగించటానికి ప్రభుత్వ నిధులతో విజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలి.

> **❝ భరతదేశంలోని ఫెడరల్ వ్యవస్థలో ఆర్థిక, సామాజికా భివృద్ధికి సంబంధించిన అనేక అంశాలు అమలుచేయాల్సిన బాధ్యత రాష్ట్రాలపై ఉంది. కాని ఈ అభివృద్ధికి కావలసిన నిధులపై ఆధిపత్యం ఎక్కువభాగం కేంద్రం చేతుల్లో ఉంది. రాష్ట్రాలు అభివృద్ధికి సంబంధించిన తమ బాధ్యతలను సక్ర మంగా నెరవేర్చటానికి అవసరమైన నిధులు పొందటానికి వీలుగా కేంద్ర-రాష్ట్ర ఆర్థిక సంబంధాలపై తక్షణమే పునరాలోచన చేయాలి. ❞**



న్యూఢిల్లీలో నీతి ఆయోగ్ సమావేశం సందర్భంగా ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని నరేంద్ర మోడి

నూతన ఆవిష్కరణలు, విజ్ఞానాభివృద్ధిలను కేవలం రాష్ట్రాలకు మాత్రమే సంబంధించిన అంశంగా చూడరాదు. రాష్ట్రాలు తమకున్న ప్రత్యేక అవసరాలపై శ్రద్ధపెట్టాల్సివున్నప్పటికీ, విజ్ఞానాభివృద్ధి దేశంయొక్క అవసరాలకూ ఉ పయోగపడుతుంది. అందువలన తప్పనిసరిగా నీతిఆయోగ్ మార్గదర్శకత్వంలో విజ్ఞానాభివృద్ధి కోసం ప్రణాళిక రూపొందించాలి.

ఈనాటి ప్రపంచంలో భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశంగా ఉన్నప్పటికీ, భౌగోళిక అంశాలు, ఇతర కారణాలరీత్యా ఈశాన్యప్రాంతం అభివృద్ధిలో వెనుకబడి ఉంది. ఈశాన్యప్రాంతం వ్యూహాత్మకంగా కీలకమైన స్థానంలో ఉంది. సంపద్వంతమైన సామాజిక, సాంస్కృతిక వారసత్వం, అపారమైన ఖనిజ వనరులు ఉన్నాయి. దురదృష్టవశాత్తు అజెండానోట్‌లోని అనుబంధం నాలుగులో ఈ ప్రాంతానికి సంబంధించిన ఏవిధమైన ప్రత్యే కమైన ప్రాజెక్టులుగానీ, చొరవల్ని గురించిగాని ప్రస్తావించలేదు.

అజెండా 4. సహకారంతో కూడిన వికేంద్రీకరణ విధానం.

భరతదేశంలోని ఫెడరల్ వ్యవస్థలో ఆర్థిక, సామాజికాభివృద్ధికి సంబంధించిన అనేక అంశాలు అమలుచేయాల్సిన బాధ్యత రాష్ట్రాలపై ఉంది. కాని ఈ అభివృద్ధికి కావలసిన నిధులపై ఆధిపత్యం ఎక్కువభాగం కేంద్రం చేతుల్లో ఉ ంది. రాష్ట్రాలు అభివృద్ధికి సంబంధించిన తమ బాధ్యతలను సక్రమంగా నెరవేర్చటానికి అవసరమైన నిధులు పొందటానికి వీలుగా కేంద్ర-రాష్ట్ర ఆర్థిక సంబంధాలపై తక్షణమే పునరాలోచన చేయాలి.

**"ఈశాన్యప్రాంతం దేశంలోని బాగా వెనుకబడిన ప్రాంతాల్లో ఒకటిగా ఉంది. భౌగోళికంగా దూరంగా ఉండటం, మౌలిక సదుపాయాలు నామమాత్రంగా ఉండటంతో ఆర్థికాభివృద్ధి నిదానంగా జరగటం, దరిద్రం, నిరుద్యోగం ఎక్కువగా ఉన్నది. ఇది ఈ ప్రాంతంలో తీవ్రవాదం పెరుగుదలకు ఒక ముఖ్య కారణంగా ఉన్నది."**

పెరిగిపోతున్న తమ ద్రవ్య అవసరాలను తీర్చుకోవటానికీ, సామాజిక, ఆర్థిక, అభివృద్ధి కార్యక్రమాలను ఎక్కువగా చేపట్టటానికి, కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న పన్ను ఆదాయంలో 50 శాతం రాష్ట్రాలకు ఇవ్వాలని రాష్ట్రాలు చాలాకాలం నుండి డిమాండ్ చేస్తున్నాయి. ఆ డిమాండ్ ఇప్పటికీ అమలు చేయాల్సేవుంది. మేం దిగువస్థాయిలో కేంద్ర ప్రభుత్వం అందించే కేంద్ర ప్రణాళికా సహాయానికి మాత్రమే పరిమితం కావలసివస్తున్నది.

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రణాళికా నిధుల్లో గణనీయమైన భాగం కేంద్ర ప్రభుతం అమలు చేస్తున్న వివిధ పథకాలకు ఆయా మంత్రిత్వశాఖల ద్వారానే అందుతు న్నాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాలు పార్లమెంటు ఆమోదించిన యం.జి.యన్.ఆర్.ఇ.జి.ఎ. లాంటి కార్యక్రమా లకు భిన్నంగా ఉంటాయి. దేశంలోని మొత్తం గ్రామీణ ప్రాంతంలోని పేదల, దరిద్రుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా తర్వాత కాలంలో యం.జి.యన్.ఆర్.ఇ.జి.ఎ.ను కుదించటానికి పూనుకున్నారు. పార్లమెంటు ఆమోదించిన ఒక పథకాన్ని తిరిగి పార్లమెంటుతో నిమిత్తం లేకుండా కేంద్ర ప్రభుత్వం తన చిత్తం వచ్చినట్లు కుదించటానికి పూనుకోవటం మనదేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే వినాశకరమైన ఉదాహరణగా నిలిచిపోతుంది.

భవిష్యత్తులో పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఖర్చుతో అమలుచేసే పథకాలుగానీ, కేంద్రం-రాష్ట్రాలు ఉమ్మడిఖర్చుతో అమలుచేసే పథకాలుగానీ తప్పనిసరిగా నీతిఆయోగ్‌లో చర్చించి ఆమోదం పొందాలి. ఆ విధంగా రాష్ట్రాల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. పార్లమెంటులో ఆమోదించిన చట్టం ద్వారా ఏర్పాటు చేయబడ్డ చట్టబద్ధమైన సంస్థ నార్త్ ఈస్టర్న్ కౌన్సిల్(యన్.ఇ.సి.) గురించి సభ్యులకు తెలుసు. యన్.ఇ.సి.ని ఏర్పాటు చేయటం అంటేనే మిగతా దేశంతో పోలిస్తే ఈశాన్యప్రాంతం వెనుకబడి ఉందన్న వాస్తవాన్ని అంగీకరించటమే అవుతుంది. అందువలన ఈ ప్రాంతానికి అదనపు నిధులు అందించటానికి తగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. ప్రాంతీయ కౌన్సిళ్ళను ఏర్పాటు చేసే సందర్భంలో నీతిఆయోగ్ యన్.ఇ.సి. యొక్కస్థాయిని గురించి పరిశీలించాలి. ఇప్పటి వరకు యన్.ఇ.సి. యొక్క పనిని గురించి పరిశీలించి, ఆ అనుభవాలను, పాఠాలను తీసుకొని ప్రాంతీయ కౌన్సిళ్ళను ఏర్పాటు చేసేట పుడు వాటిని శక్తివంతంగా వినియోగించు కోవాలి.

అజెండా 5. మౌలిక సదుపాయాలు కల్పించే ప్రాజెక్టులపై శ్రద్ధపెట్టాలి.

ఈశాన్యప్రాంతం దేశంలోని బాగా వెనుకబడిన ప్రాంతాల్లో ఒకటిగా ఉంది. భౌగోళికంగా దూరంగా ఉండటం, మౌలిక సదుపాయాలు నామమాత్రంగా ఉండటంతో ఆర్థికాభివృద్ధి నిదానంగా జరగటం, దరిద్రం, నిరుద్యోగం ఎక్కువగా ఉన్నది. ఇది ఈ ప్రాంతంలో తీవ్రవాదం పెరుగుదలకు ఒక ముఖ్య కారణంగా ఉన్నది. మరోవైపున అభివృద్ధిని ఆటంకపర్చటంలో తీవ్రవాదం ప్రధానపాత్ర పోషిస్తున్నది. ప్రభుత్వం ఇతర ప్రాంతాల్లోకన్నా ఈ ప్రాంతంలో అతితక్కువ పెట్టుబడులు పెడుతున్నది. ప్రైవేటు పెట్టుబడులు కూడా నామమాత్రంగానే వస్తు న్నాయి. గత దశాబ్దాల్లో కోల్పోయిన దేశంలోని ఇతర ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధిని ఈశాన్యప్రాంతం అందుకోవాలంటే, దేశంలోని ఇతర ప్రాంతాలకన్నా ఈ ప్రాంతంలో వేగంగా అభివృద్ధి జరగాలి.

ఈ మధ్యకాలంలో జరుగుతున్న పరిణామాలు ఈశాన్యప్రాంత అభివృద్ధికి నూతన అవకాశాలను ఆవిష్కరిస్తున్నాయి. భారత ప్రభుతం యొక్క తూర్పుకు చూడండి, తూర్పున పనిచేయండి అనే విధానం, భారత దేశం ఆగ్నేయాసియా దేశాలతో సంబంధాలు మెరుగు చేసుకొనే ప్రయత్నం, ప్రయాణ సదుపాయాలు, వాణిజ్యాన్ని అభివృద్ధి చేసుకొనే విధంగా బంగ్లాదేశ్‌తో చేసుకున్న ఒప్పందాలు సక్రమంగా అమలు జరిగినట్లైతే ఈశాన్యప్రాంతం భౌగోళికంగా వేరుగా, సుదూరంగా ఉన్నస్థితి నుండి, దేశంలో వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతంగా మార్పు చెందుతుంది. బంగ్లాదేశ్‌తోనూ, ఆగ్నేయాసియా దేశాలతోనూ ప్రయాణ, ఇతర సంబధాలను పెంపొందించే ప్రాజెక్టుల అమలుపై నీతిఆయోగ్ కేంద్రీకరించాలి. ఇది ఈ ప్రాంతంలో ఆర్థిక, సామాజికాభివృద్ధి త్వరితగతిని జరగటానికి తగిన వాతావరణాన్ని కల్పిస్తుంది.

ప్రధాని కార్యాలయం నుండి వచ్చిన లేఖపై స్పందించి రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై స్థితి, అమలుతీరుపై రిపోర్టును అందజేసింది. ప్రభుత్వాల ముఖ్యకార్యదర్శుల ఆధ్వర్యంలో ప్రాజెక్టు మానిటరింగ్ గ్రూపులను ఏర్పాటు చేయాలనే సూచనను మేము సమర్థిస్తున్నాము.

అజెండా 6. ఇతర అంశాలు.

2014 ఆగస్టు 21, 22 తేదీలలో ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో ఆరు వర్కింగ్ గ్రూపులను ఏర్పాటు చేయటం జరిగింది. మొదటిది. రోడ్లు, జలమార్గాలు, రైల్వేలు, విమానాలు, టెలికాం సంబంధాల ఏర్పాటుకు సంబంధించినది. రెండవది. ప్రాథమిక, ఉన్నతవిద్య, మానవ వనరులు, నైపుణ్యాల అభివృద్ధికి కోసం ఏర్పాటు చేశారు. మూడవది. పారిశ్రామిక, వాణిజ్య, వ్యాపారాభివృద్ధి కోసం, నాలుగవది నీటి సరఫరా, ఆరోగ్యం, పారిశుధ్యం కోసం, ఐదవది వ్యవసాయం, తోటల పెంపకం, పట్టు పరిశ్రమ, పశుసంరక్షణ, చిన్న నీటిపారుదలకు సంబంధించినది, ఆరవది మొత్తం ఈశాన్యప్రాంతంలో విద్యుత్, టూరిజం అభివృద్ధికి సంబంధించి ఏర్పాటు చేశారు. ఈశాన్యప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన ఈ రిపోర్టులను నీతిఆయోగ్ పరిశీలించాలి.

దేశాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయటంలో నీతిఆయోగ్ సానుకూలపాత్ర నిర్వహించాలని నేను భావిస్తున్నాను. దేశంయొక్క ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన అంశాలను నిర్దిష్ట కాలంలో చర్చించటం, ముఖ్యమైన అంశాలపై నిర్ణయాలు తీసుకోవటం చేస్తూ నీతిఆయోగ్ సజీవమైన సంస్థగా అభివృద్ధి చెందాలి.

**(అనువాదం. ఎ.కోటిరెడ్డి)**

# 'ప్రకృతి గతితర్కం' పరిచయం



ఫ్రెడరిక్ ఏంగెల్స్

పురాతన కాలంనాటి అద్భుతమైన స్వాభావిక తాత్విక ఊహాలు, అరబ్బుల కాలంలో అడపాదడపా చోటు చేసుకున్న మహావిష్కరణలు ఎక్కువభాగం ఎలాంటి ఫలితాలు ఇవ్వకుండానే అంతర్ధానమైపో యాయి. ప్రకృతిని ఆధునికంగా పరిశోధించి సాధించిన శాస్త్రీయమైన, క్రమబద్ధమైన పరిపూర్ణమైన శాస్త్రీయాభివృద్ధి మాత్రమే కాల పరీక్షకు నిలిచింది. ఈ ఆధునిక శాస్త్ర పరిశోధనాకాలంనుండి ఒక నూతన శకం ఆరంభమయ్యింది. ఇదంతా అతి సమీప చరిత్రయే. జర్మన్లు ఈ శకాన్ని సంస్కరణ యుగంగా పిలుచుకుంటే, ఫ్రెంచి వారు పునరుజ్జీవనశకంగా పిలుచుకున్నారు. ఇటలీవారు సంగీత, సాహిత్యాలు, కళలు, కుడ్యాల నిర్మాణంలో అద్భుత ప్రగతిసాధించిన కాలంగా పేర్కొన్నారు. పదిహేనవ శతాబ్దం ద్వితీయార్థం నుండి ఈ శకం ఆరంభ మయ్యింది. అప్పటిదాకా రాజ్యాలేలిన ఫ్యూడల్ ప్రభువులను, మహా సామ్రాజ్యాలను పట్టణ ప్రాంత వణిక్ ప్రముఖ వర్గమంతా కలిసి కూలదోసింది. ఇందులో 'జాతీయత' ప్రధాన భూమిక పోషించింది. ఆధునిక ఐరోపాలో జాతి రాజ్యాల అవతరణకు, ఆధునిక బూర్జువా వర్గ అభివృద్ధికి తోడ్పడిన ముఖ్య పరిణామం ఇది. ఒక ప్రక్కన వాణిజ్య వర్గాలు – రాజరికవర్గానికి మధ్యన యుద్ధాలు, తిరుగుబాట్లు, పోటారాలు జరుగుతూ ఉండగానే జర్మనీ రైతాంగం తిరుగుబాటు చేసి రానున్న వర్గ పోరాటాన్ని దోపిడీ వర్గాల ముందు సాక్షాత్కరింపచేసింది. రైతాంగ తిరుగుబాట్లు చరిత్రలో కొత్తకాదు గానీ జర్మనీ రైతాంగం చేతిలో ఎర్రజెండాతో, గొంతులో ఉమ్మడి యాజమాన్య హక్కు నినాదంతో తిరుగుబాటు చేసి ఆధునిక శ్రామికవర్గ శైశవ దశను రంగస్థలంమీదకు తెచ్చింది. బైజాంతియమ్ కూలిపోయిన పిదప భద్రపరచబడిన రాతప్రతులు, రోమ్ నగర శిధిల తవ్వకాలలో బయల్పడిన పురాతన విగ్రహాలు చూసి పశ్చిమ దేశాలు ప్రాన్పడిపోయాయి. మధ్యయుగాల నాటి ప్రేతాలు ఒక వెలుగు వెలగకుండానే అంతర్ధానమైపోయిన ప్రాచీన గ్రీకు చరిత్ర పశ్చిమ దేశాలకు ఒక కొత్త లోకాన్ని కళ్ళకు కట్టించింది. కలలో కూడా ఊహింప తగని రీతిలో కళలు ఇటలీలో ప్రవర్ధమాన మయ్యాయని చరిత్ర తెలుపుతున్నది. ఆ ప్రాచీన సౌందర్య సొబగులను తిరిగి ఆ దేశం ఎన్నటికీ అందుకోలేకపోయింది. ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ రాజ్యాలలో సాహిత్యం క్రొత్త పుంతలు తొక్కింది. ఆ తరువాతే ఇంగ్లీష్, స్పానిష్ సాహిత్యంలో ఆధునిక శకం ఆరంభమయ్యింది. ప్రపంచంలో అప్పటిదాకా ఉన్న భౌగోళిక సరిహద్దులు పటాపంచలైపోయాయి. మొదటి సారిగా ప్రపంచ వాణిజ్యానికి మార్గాలు ఏర్పడ్డాయి. చేతివృత్తుల స్థానంలో సరుకులను ఉత్పత్తిచేసే పరిశ్రమలు వచ్చి చేరాయి. తదనంతరకాలంలో భారీ పరిశ్రమల అభివృద్ధి కి కేంద్ర బిందువుగా నిలిచాయి. ప్రజలపై మానసిక ఆధిపత్యం ఛలాయిస్తున్నచర్చి నియంతృత్వ ఆధిపత్యం కూలిపోయింది. మెజారిటీ ప్రజానీకం ప్రొటెస్టెంట్ క్రైస్తవం వైపు మరలారు. లాటిన్ అమెరికా దేశాలు స్వేచ్ఛా ఆలోచనలకు కేంద్రంగా మారాయి. ఆ తర్వాత అరబ్బులు ఆ స్థానాన్ని ఆక్రమించుకున్నారు. ఆతర్వాత గ్రీకు తత్వశాస్త్రం విరాజిల్లింది. వీటి పునాది నుండే పద్దెనిమిదవ శతాబ్దం నాటికి భౌతికవాదం అంకురించింది. మానవాళి చరిత్రలో అద్భుతమైన అభ్యుదయ విప్లవకాలంయిది. అన్ని రంగాల్లోనూ దిగ్గజాలు ఉద్భవించారు. ఆలోచనల్లో, అన్వేషణలలో, వ్యక్తిత్వ నిర్మాణంలో ఈ దిగ్గజాలు ఎనలేని ప్రభావం చూపించారు. జ్ఞాన సముపార్జన విశ్వవ్యాప్తమైంది. ఆధునిక బూర్జువా పరిపాలనకు రూపకల్పన చేసిన వారు కూడా బూర్జువా పరిమితులు ఏమిటో అర్థం చేసుకున్నారు. దేశాంతర పర్యటనలు చెయ్యడం, కనీసం నాలుగు భాషలు మాట్లాడటం, వివిధ రంగాలలో ప్రవేశం కలిగి ఉండటం నాటి జనానికి పరిపాటిగా మారింది. లియోనార్డో డావిన్సీని గొప్ప చిత్రకారుడిగానే చూస్తుంది ఈ ప్రపంచం. కాని అతను అద్భుత గణిత మేధావి, మెకానిక్కు, ఇంజనీరు. భౌతికశాస్త్రంలోకూడా అనేక నూతన ఆవిష్కరణలకు ప్రేరణగా నిలిచాడు. అలాగే ఆల్బర్ట్ డ్యూరర్‌ను తీసుకుంటే అతను చిత్రకారుడిగా, శిల్పిగా,భవన నిర్మాణ ప్రణాళికా రూపకర్తగా, రాతి చెక్కడాల రూప కర్తగా భాసించాడు. శత్రు దుర్భేద్యమైన నిర్మాణాలకూ రూపకల్పన గావించాడు. తదనంతర కాలంలో జర్మనీలో శాస్త్రీయాభివృద్ధి అతడి ఆలోచనల ఆధారంగానే ఆధునికాభివృద్ధి వైపు పురోగమించింది. మాకియవెల్లీ గొప్ప రాజనీతిజ్ఞుడే కాదు, గొప్ప చరిత్రకారుడు, గొప్ప కవి కూడా. అంతేకాదు ఆధునిక కాలపు సైనిక వ్యూహ శాస్త్రానికి ఆద్యుడు కూడా. లూథర్ అప్పటిదాకా ఏకఛత్రంగా ఏలిన చర్చిని సంస్కరించటమేకాదు.

జర్మన్ భాషనూ సంస్కరించి, వచనంలోకి మార్చటంలో ప్రధానపాత్ర పోషించాడు. అద్భుతమైన శబ్ద లాలిత్యంతో కూడిన వచన శ్లోకాలు రచించి, పదహారవ శతాబ్దపు

> "నాటి సామాజిక విప్లవాల కాలంలోనే సామాజికశాస్త్రాలలో అద్భుతమైన విప్లవాత్మక ఆవిష్కరణలు చోటు చేసుకున్నాయి. తమ ఉనికిని కాపాడుకోవడానికి పురాతనశాస్త్రాలూ పెనుగులాడాయి. ఆనాటి ఇటలీ తత్వవేత్తలతో పాటు శాస్త్ర పరిశోధనలలో తమ ప్రాణాలు అర్పించి అమరులైన వారు ఎందరో ఉన్నారు. ఈ పరిణామ క్రమంలో గమనించాల్సిన ముఖ్యమైన మార్పు ఏమిటంటే ప్రకృతిని పరిశోధించడంలో క్యాథలిక్‌ల వలే కాకుండా ప్రొటెస్టెంట్లు ఎంతో స్వేచ్ఛ కల్పించారు."

మాకియవెల్లీగా ప్రభవించాడు. ఈ కాలపు కథా నాయకులు శ్రమ విభజనకు బందీలు కాలేదు. తదనంతర కాలంలో ఏకపక్షంగా కొనసాగిన వస్తూత్పత్తి విధానం మానవుడి సృజనాత్మక శక్తిమీద పరిమితులు విధించ సాగింది. అదలా ఉంచితే పైన చెప్పుకున్న కాలంనాటి కథా నాయకులు అనేకులంతా ఆ కాలపు ఉద్యమాలు, అసలైన పోరాటాలలో ఒక పక్షాన నిలబడి తమ కలాన్ని, గళాన్ని వినిపించారు. కత్తి పట్టి పోరాడారు. ఉద్యమాలతో మమేకం అవుతూనే జీవన మాధుర్యాన్ని అనుభవించారు. తమ సృజనాత్మక కార్యకలాపాలను కొనసాగించారు. పరిపూర్ణ మానవులుగా జీవించారు. అయితే కొద్దిమంది మేధావులు ఇందుకు మినహాయింపుగా బతికారు. ద్వితీయ, తృతీయ శ్రేణికి చెందిన ఈ రకం మేధావులు తమ చేతులు కాల్చుకోకుండా గట్టుమీద నిలబడి ఉద్బోధలతో కాలం గడిపారు.

నాటి సామాజిక విప్లవాల కాలంలోనే సామాజికశాస్త్రాలలో అద్భుతమైన విప్లవాత్మక ఆవిష్కరణలు చోటు చేసుకున్నాయి. తమ ఉనికిని కాపాడుకోవడానికి పురాతనశాస్త్రాలూ పెనుగులాడాయి. ఆనాటి ఇటలీ తత్వవేత్తలతో పాటు శాస్త్ర పరిశోధనలలో తమ ప్రాణాలు అర్పించి అమరులైన వారు ఎందరో ఉన్నారు. ఈ పరిణామ క్రమంలో గమనించాల్సిన ముఖ్యమైన మార్పు ఏమిటంటే ప్రకృతిని పరిశోధించడంలో క్యాథలిక్‌ల వలే కాకుండా ప్రొటెస్టెంట్లు ఎంతో స్వేచ్ఛ కల్పించారు. సెర్విటస్ రక్త ప్రసరణకు సంబంధించిన పరిశోధనలను ఆవిష్కరించే ప్రయత్నంలో ఉండగా అందుకుగాను అతన్ని రెండుగంటలపాటు మంటల్లోసజీవదహనం చేశారు. గియార్డనో బ్రూనోనూ సజీవ దహనం చేశారు.

అయినప్పటికీ శాస్త్రాలు విప్లవాత్మకంగా తమ స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నాయి. మరణశయ్యమీదనుండే కోపర్నికస్ ప్రతిపాదించిన గ్రహగతుల సిద్ధాంతాన్ని ప్రచురించడం ద్వారా లూథర్ చర్చి ఆధిపత్యానికి చరమగీతం పాడాడు. తద్వారా విశ్వాంతరాళగ వేషణకు నూతన మార్గాలు చూపాడు. ప్రకృతి పరిశోధనలో పెద్ద కుదుపు వచ్చిన కాలం అది. అప్పటికీ దైవదత్త సిద్ధాంతానికి, ప్రకృతి శాస్త్రాలకు మధ్యన నేను గొప్పంటే నేను గొప్పనే వాదులాటలు అడపదడపా కొనసాగుతున్నా, ప్రకృతి శాస్త్రాలు భావవాద సంకెళ్ళ నుండి ఈకాలంలోనే విముక్తిపొందాయి. అప్పటినుండి సైన్స్ అంగలు పంగలుగా అభివృద్ధి చెందింది. కాలంతోపాటు వేగంగా ఒక ధృతితో ఈ అభివృద్ధి సాగింది. మానవ మేధస్సు నిర్జీవ పదార్థం కాదని, అదొక పరమాద్భుతమైన జీవ పదార్థమని రుజువయ్యింది.

ప్రకృతిశాస్త్రాలలో తొలిదశ కృషి అంతా అప్పటిదాకా అందుబాటులో వున్న పదార్థ విజ్ఞానాన్ని శిఖరస్థాయికి తీసుకు వెళ్ళడంగా సాగింది. కొన్ని రంగాలలో కృషికి మాత్రం అప్పుడే పునాదిపడింది. యూక్లిడ్, పిటోలిమక్‌లు సౌరవ్యవస్థ గురించి చేసిన ప్రాచీన సిద్ధాంత ప్రతిపాదనలు, అరబ్బులు కనుగొన్న శూన్యాంశము, ఆల్జీబ్రా, ఆధునిక సంఖ్యాశాస్త్రం, రసాయనశాస్త్రం-ఈ విజ్ఞానం మాత్రమే అప్పటివరకు అందుబాటులో ఉంది. మధ్యయుగాలలో శాస్త్ర విజ్ఞానానికి తోడ్పాటు పెద్ద గుండుసున్నాగా మిగిలింది. ఈ నేపథ్యంలో సామాజిక శాస్త్రాలకు సంబంధించిన మౌలికాంశాలు, మెకానిక్స్, గ్రహాలు, గ్రహాంతర అన్వేషణలు ప్రధానంగా సాగాయి. దీనికి సమాంతరంగా ఉపయుక్తంగా ఉండే రీతిలో గణితశాస్త్రాన్ని అభివృద్ధిచేసే కృషి జరిగింది. న్యూటన్ గమన సూత్రాలు, లీనియస్ సిద్ధాంతం ఈ రంగంలో సాగిన విశిష్ట అన్వేషణలుగా నిలిచాయి. ఇంక గణిత పద్ధతులలో డెస్కార్టెస్ 'ఎనలిటికల్ జామెంట్రీ'ని నేపియం 'అల్గరిథమ్స్'ని, లీబ్నిజ్ (న్యూటన్ కూడా) 'ఇంటిగ్రల్ కాలిక్యూలస్'ను తోడు చేశారు. అలాగే 'మెకానిక్స్'కు సంబంధించిన ప్రధాన సూత్రాలూ అందుబాటులోకి వచ్చాయి. అంతిమంగా ఖగోళశాస్త్రం, 'కెప్లర్'సౌర వ్యవస్థలో గ్రహగతుల సిద్ధాంతం ద్వారా గ్రహ వ్యవస్థ చలనాన్ని కనుగొన్నాడు. పదార్థ, చలనాల సాధారణ సూత్రాల ద్వారా న్యూటన్ గ్రహాల చలనానికి సంబంధించిన సూత్రీకరణలను స్థిరపరిచాడు. అప్పటికింకా సామాజిక శాస్త్రాల్లో ఇతర విభాగాలు బాలారిష్టాలను అధిగమించ లేదు. ఆ శతాబ్దాంతానికి ద్రవ-వాయు రూపాలకు సంబంధించిన మెకానిక్స్‌లో కొంత పురోగతి సాధ్యపడింది. (ఇక్కడ రాత ప్రతి మార్జిన్‌లో ఏంగెల్స్ పెన్సిల్‌తో బోరిసెల్లీ-అల్ఫైన్ నదుల నియంత్రణలకు సంబంధించి అని రాసిపెట్టాడు) భౌతికశాస్త్రం కటక శాస్త్రంలో తప్ప ఏమాత్రం పురోగతి లేకుండా ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉండిపోయింది. ఖగోళశాస్త్రానికి కటక శాస్త్రం యొక్క అవసరం ఎంతైనా ఉంది కాబట్టి అందులో పురోగతి కలిగింది. అప్పటిదాకా రసాయనశాస్త్రం అంటే బంగారం తయారీగానే ఉంది. తొలిగా రసాయనశాస్త్రం ఈ పరిమితినుండి విముక్తమయ్యింది. భూగర్భ శాస్త్రానికి వచ్చేసరికి ఖనిజ శాస్త్రం పిండదశను దాటి పురోగమించలేకపోయింది. నాటికి భూభౌతికశాస్త్రం ఇంకా అంకురించనే లేదు. ఇక జీవశాస్త్రం (బయాలజీ) విషయానికి వస్తే వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, శరీర నిర్మాణశాస్త్రం, అవయవ శాస్త్రాల్లో అప్పటిదాకా అందుబాటులో వున్న విషయ సంపద విశ్లేషణలకు, పరీక్షలకు నిర్ధారణలకు పరిమితం అయ్యింది. దేశ కాలమాన పరిస్థితులు, వాతావరణ స్థితిగతులకు అనుగుణంగా ఎక్కడ ఏ రకమైన జీవజాతులకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయనే అంశం మీద అప్పటికింకా ఓనమాలు కూడా మొదలు కాలేదు. లిన్నీయస్ కృషి ఫలితంగా బోటనీ, జువాలజీలు మాత్రం పరిపూర్ణ దశకు చేరుకున్నాయి.

ఈ కాలానికి ఉన్న ఒక ప్రత్యేక లక్షణం 'ప్రకృతి స్వభావాన్ని మార్చలేం' అనే ప్రాపంచిక దృక్పథం బలంగా ఉండేది. ప్రకృతి ఏ రకంగా ఉనికిలోకి వచ్చిందనే విషయాన్ని ప్రక్కన పెట్టి, అది అంతమయ్యేదాకా ఇలానే కొనసాగుతుంది. గ్రహాలు, ఉపగ్రహాలు ఏ 'మిస్టరీ' శక్తి మూలంగా గమనంలో ఉన్నాయో గానీ అవి అనంతకాలంపాటు, లేదా అవి క్షయమైపోయేం


తవరకూ అలానే తిరుగుతూ వుంటాయి. విశ్వ గురుత్వాకర్షణ శక్తి మూలంగా ఆకాశంలోని నక్షత్రాలు స్థిరంగా, ఎక్కడివక్కడ కదలక మెదలక ఉండిపోతాయి. ఈ భూమి ఆవిర్భవించినప్పుడు ఎలా ఉందో ఇప్పటికీ, ఎప్పటికీ అలానే ఉంటుంది. ఐదు ఖండాలూ (అప్పటికి), పర్వతాలూ, నదులూ, లోయలూ, వాతావరణ పరిస్థితులూ, గడ్డీగాదం ఇవన్నీ ఒకప్పుడు ఎలా ఉన్నాయో ఇప్పుడూ అలానే ఉన్నాయి. ఒక్క మానవ కల్పిత వ్యవసాయం, మొక్కల పెంపకం మూలంగా వచ్చిన మార్పులు తప్ప జీవ, జంతు జాలం కూడా యథాతథంగా పునరుత్పత్తి జరిగినంతకాలం అలానే కొనసాగుతాయి. లీన్నియస్ పరిశోధనల ఫలితంగా సంకరం జరిగి భిన్నమైన పునరుత్పత్తి జరిగితే తప్ప అన్నీ యథాతథంగా కొనసాగుతాయి అనే భావన ప్రబలంగా ఉండేది. మానవ జాతి చరిత్ర కాలాన్నిబట్టి వివిధ దశలలో వివిధ రకాలుగా అభివృద్ధి చెందుతూ వచ్చిందన్న వాస్తవాన్ని అంగీకరిస్తూనే ప్రకృతి చరిత్ర విషయానికి వచ్చేసరికి అలాంటి మార్పులు చేర్పులకు అవకాశం లేదన్న బలమైన అభిప్రాయం పాదుకుంది. ఫలితంగా ఎంతో విప్లవాత్మకంగా పురోగమించాల్సిన శాస్త్రాభివృద్ధికి ప్రకృతిపట్ల ఈ మితవాద దృక్పథం అతిపెద్ద ఆటంకంగా పరిణమించింది.

పద్దెనిమిదవ శతాబ్దపు ప్రథమార్థం నాటికి శాస్త్రవిజ్ఞానం ప్రాచీన గ్రీకు విజ్ఞానానికన్నా ఎంతో ఉన్నతంగా ఎదిగింది. సైద్ధాంతికంగా, విషయపరంగా అప్పటిదాకా అందుబాటులో ఉన్న జ్ఞాన సంపదను లోతుగా విశ్లేషించింది. ప్రకృతిపట్ల ఉన్న ప్రాపంచిక దృక్పథానికి పుటం పెట్టింది. ఈ ప్రపంచం ఏదో ఒక సంక్షోభం నుండి ఆవిర్భవించి, అభివృద్ధి చెందింది. ఇలాగే ఉనికిలోకి వచ్చిందనేది గ్రీకు తత్త్వవేత్తల అభిప్రాయం. ప్రకృతిశాస్త్రజ్ఞుల దృష్టిలో కూడా ఈ భూమండలం, సమస్త చరాచర ప్రకృతి ఒక్క దెబ్బతో ఆవిర్భవించాయి. ఇవి ఎలాంటి మార్పులకు లోనయ్యే అవకాశం లేదనేభావం ఉండేది. అప్పటికి శాస్త్రవిజ్ఞానం కూడా భావవాద దృక్పథంలో చిక్కుకొని ఉంది. ప్రతి విషయమూ అంతిమంగా తేల్చాల్సి వచ్చేసరికి 'అది ప్రకృతికి అతీతమైన శక్తిమూలంగా అట్లా అయ్యింది' అనో, 'దాన్ని వివరించలేం' అనడమో ముక్తాయింపుగా మారింది. పదార్థానికి ఉండే ముఖ్య లక్షణం ఆకర్షణ అని న్యూటన్ తేల్చి చెప్పిన తర్వాత నుండి అలవిమాలిన ప్రశ్నలన్నింటికీ 'బాప్టిజం' ఇచ్చినట్లు-'విశ్వ

> **"పద్దెనిమిదవ శతాబ్దపు ప్రథమార్థం నాటికి శాస్త్రవిజ్ఞానం ప్రాచీన గ్రీకు విజ్ఞానానికన్నా ఎంతో ఉన్నతంగా ఎదిగింది. సైద్ధాంతికంగా, విషయపరంగా అప్పటిదాకా అందుబాటులో ఉన్న జ్ఞాన సంపదను లోతుగా విశ్లేషించింది. ప్రకృతిపట్ల ఉన్న ప్రాపంచిక దృక్పథానికి పుటం పెట్టింది. ఈ ప్రపంచం ఏదో ఒక సంక్షోభం నుండి ఆవిర్భవించి, అభివృద్ధి చెందింది. ఇలాగే ఉనికిలోకి వచ్చిందనేది గ్రీకు తత్త్వవేత్తల అభిప్రాయం."**



యూక్లిడ్



లియోనార్డో డావిన్సీ

గురుత్వాకర్షణ శక్తి' కారణం అన్న సమాధానం వినవచ్చేది. గ్రహాలకు కక్ష్యలు ఎలా ఏర్పడ్డాయి? ఈ భూమ్మీద వేనవేల జంతువులు, లక్షోపలక్షల రకాల మొక్కలు, చెట్లు ఎలా వచ్చాయి? మనిషి పుట్టుక ఎలా జరిగింది అన్న ప్రశ్నలకు విజ్ఞాన శాస్త్రం కూడా 'ఇదంతా ఆ సృష్టికర్త లీల' అని చెప్పుకొచ్చిన కాలం అది. మొదటగా కోపర్నికస్ ఈ భావవాదం వాకిళ్ళు తెరిచాడు. న్యూటన్ ఆ రెక్కలు మూసి ఒక 'అతీత శక్తి'ని ముందుకు తెచ్చాడు. ఈ చరాచర ప్రకృతి అంతా పరస్పర ఉపయోగార్థం సృష్టించబడింది. ఎలుకలని చంపి తినడానికి పిల్లులు, పిల్లుల్ని చంపి తినేదానికి కుక్కలు అంటూ ఈ సృష్టిలో ప్రతి ప్రాణిని ఏదో ఒక అవసరార్థం ఆ సృష్టికర్త సృష్టించాడని చెప్తూ ఉండే వాళ్ళు. అయితే గొప్పతనం ఏంటంటే నాటి ప్రకృతి విజ్ఞానం ఇంత పరిమితంగా ఉన్నప్పటికీ తత్త్వవేత్తలు మాత్రం స్పినోజానుండి, ఉద్దండ ఫ్రెంచి పదార్థవాదుల వరకు ఎందరో ప్రపంచం గురించి పరిపరి విధాలా వ్యాఖ్యానిస్తూ, వాటి మంచి చెడులను మాత్రం భవిష్యత్ ప్రకృతిశాస్త్రాలు నిగ్గు తేలుస్తాయని వదిలి పెట్టారు.

పద్దెనిమిదవ శతాబ్దపు పదార్థవాదులను కూడా కలిపి ఎందుకు చెప్పాననంటే పైన పేర్కొన్న దానికి మినహా వారికి శాస్త్రీయమైన ప్రకృతి పరిజ్ఞానం ఏదీ అందుబాటులో లేదు. కాంట్ తత్త్వ బోధలు నూతన శకానికి నాందిగా, ఒక రహస్యంగా నిలిచిపోయాయి. ఆ తర్వాత ఎప్పటికోగానీ వాప్లాస్ తత్త్వం రంగం మీదకి రాలేదు. ఇక్కడ మనం మర్చిపోకూడని విషయం ఏమిటంటే ఒక ప్రక్కన విజ్ఞానశాస్త్రం నిత్య నూతనంగా అభివృద్ధి చెందుతూ ఉన్నది. మరోవైపు ప్రకృతిపట్ల కాలం చెల్లిన ప్రాపంచిక దృక్పథం బలంగా వేళ్ళూనుకొని ఉన్న కాలం అది. పంతొమ్మిదవ శతాబ్దం ప్రథమార్థం వరకూ ఇదే పరిస్థితి కొనసాగింది. ఇంకా చెప్పుకోవాల్సిన విషయం ఏంటంటే స్కూళ్ళలో ఇప్పటికీ అవే పాఠాలు బోధిస్తూ ఉన్నారు.

ప్రకృతికి సంబంధించి బూజుపట్టిన ఈ భావాలను త్రోసిరాజన్నది ఒక ప్రకృతి శాస్త్రజ్ఞుడు కాదు, ఒక తత్వవేత్త. 1755లో కాంట్ రాసిన యూనివర్సల్ నాచురల్ హిస్టరీ అండ్ థియరీ ఆఫ్ హెవెన్' అన్న చిరుపొత్తంలో విస్ఫోటన సిద్ధాంతాన్ని త్రోసిపుచ్చాడు. ఈ భూమి సహా మొత్తం సౌర వ్యవస్థ క్రమానుగతంగా ఉనికిలోకి వచ్చాయి అని ప్రకటించాడు. 'భౌతికశాస్త్రమా, అధి భౌతికశాస్త్రం (మెట్ట వేదాంతం)తో జాగ్రత్త సుమా' అన్న న్యూటన్ పలుకులు గమనంలో ఉంచుకొని ఉంటే మెజారిటీ ప్రకృతి శాస్త్రజ్ఞులు

**"సామాన్యశాస్త్రంలో 1842వ సంవత్సరంలో హీల్‌బ్రాన్‌కు చెందిన 'మాయర్', మాంచెస్టర్‌కు చెందిన 'జోలీ'లు ఉష్ణశక్తి యాంత్రికశక్తిగా, యాంత్రికశక్తి ఉష్ణశక్తిగా రూపాంతరం చెందడాన్ని ఆవిష్కరించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన 'గ్రూవ్' భౌతికశక్తులు అన్నీ నిర్దిష్ట పరిస్థితులలో ఎటువంటి శక్తి నష్టపోకుండానే ఒక శక్తిరూపం నుండి మరొకశక్తి రూపానికి మారతాయన్న ఆవిష్కరణ చేశాడు."**



జోహాన్నెస్ కెప్లెర్



మాచియె విల్లి

'కాంట్' యొక్క ఒకే ఒక్క అద్భుత ఆవిష్కరణను పరిగణనలోకి తీసుకునేవాళ్ళు. లెక్కలేనంతశారీరక , మేధో(శ్రమలను, విలువైన కాలాన్ని, తప్పుడు పద్ధతులలో జరిగిన పరిశోధనలకు వెచ్చించేవారు కాదు. కాంట్ ఆవిష్కరణలతో అప్పటిదాకా స్థంభించి ఉన్న పరిశోధనలు ఊపందుకున్నాయి.

భూమి పరిణామక్రమంలో ఉనికిలోకి వచ్చినదయినందున దాని భౌగోళిక, వాతావరణ, భూగర్భ పరిస్థితులూ, ఈ భూమ్మీది మొక్కలు, ప్రాణులు కూడా ఆవిధంగానే ఉనికిలోకి వచ్చి ఉంటాయి. ఇవి సహజీవనం సాగించడానికి ఒక చరిత్ర ఉన్నట్లే కాలానుగుణమైన మార్పులూ ఉండి వుంటాయి. "ఈ దిశగా మరిన్ని పరిశోధనలు కొనసాగితే ప్రకృతి శాస్త్రం మరింత పురోగమించివుండేది. కాని తత్వశాస్త్రం నుండి ఆ మాత్రం మంచిని ఎవరు ఆశించారు గనుక? 'కాంట్' ఆవిష్కరణను చాలాకాలంపాటు ఎవరూ పట్టించుకోలేదు. కొన్నేళ్ళ తరువాత లాప్లాస్, హెర్షెల్‌లు ఇరువురూ కాంట్ ఆలోచనలను మరింత లోతుగా విశ్లేషించి, బలమైన పునాది తయారు చేశారు. క్రమంగా 'నెబ్యులార్ హైపోథిసిస్' దగ్గరకు తెచ్చారు. ఆ తరువాత కొనసాగిన అన్వేషణలు మరిన్ని విజయాల్ని తెచ్చిపెట్టాయి. స్థిర నక్షత్రాల గమనం. విశ్వాంతరాళంలో నిరోధక మాధ్యమం, విశ్వ పదార్థరాశి, రసాయన గుర్తింపు దాని... విశ్లేషణ, పాలపుంతల ఉనికి వంటి కీలక ఆవిష్కరణలు అందులో ముఖ్యమైనవి.

అయినప్పటికీ భూమి అనేక మార్పులకు గురవుతున్నట్లే ప్రకృతి కూడా పరిణామ క్రమంలో ఉనికిలోకి వచ్చిందని మెజారిటీ ప్రకృతి శాస్త్రవేత్తలు అంగీకరించారా అంటే జవాబు అనుమానాస్పదంగానే మిగిలిపోయింది. అయితే ఈ వాదనకు మరో రంగంనుండి మద్దతు లభించింది. భూగర్భశాస్త్ర విజ్ఞానం ఈ భూమి పొరలు పొరలుగా ఒకదానిమీద ఒకటిగా ఏర్పడ్డాయని ఈ పొరలలో అంతరించిపోయిన జంతువుల అస్థిపంజరాలు, గుల్లలు, అలానే చెట్ల దుంగలు, ఆకులు, పళ్ళ అవశేషాలు ఉన్నాయని వెలుగులోకి తెచ్చింది. దానితో ఇప్పుడీ భూమ్మీద ఉన్న సమస్త జీవజాలమూ ఒక చారిత్రక పరిణామ క్రమంలో ఏర్పడ్డాయని అంగీకరించాల్సి వచ్చింది. అయితే అది కూడా ఎంతో అయిష్టంగానే జరిగింది. 'రివల్యూషన్స్ ఆఫ్ ఎర్త్' పేరిట కూవియర్ ఒక సిద్ధాంతం ముందుకు తెచ్చాడు. పేరులో 'విప్లవం' తప్ప సారంలో ఈ సిద్ధాంతం పచ్చి ప్రతీఘాతుకమైనది. ప్రకృతిని ఎవరో ఒక సృష్టికర్త ఇట్లా సృష్టించాడన్న దానికి బదులుగా, ఒక్కో దశకు ఒక్కో సృష్టికర్తని జోడించి 'మానవాతీతం' అనేది ప్రకృతి పరిణామ క్రమానికి మూలం అని తేల్చి చెప్పాడు. సృష్టికర్త 'మూడ్'ని బట్టి ఈ భూమి తాపీగా దశలవారీగా రూపాంతరం చెందినదన్న వాదన ముందుకు తెచ్చాడు లీయెల్. గతంలో వాళ్ళందరికన్నా పనికిమాలిన వాదన ఇది. ప్రాణికోటి ఉనికిలోకి వచ్చి యథాతథంగా కొనసాగుతున్నాయనేది అతని ఆలోచన. కాని భూమి ఉపరితలం క్రమంగా గట్టిపడుతూ, జీవం ఆవిర్భవించే పరిస్థితులు ఏర్పడిన క్రమంలో, జీవకోటి ఆవిర్భవించింది అనేది వాస్తవం.

సంప్రదాయం అనేది క్యాథలిక్ చర్చిలోనే కాదు ప్రకృతిశాస్త్రంలోనూ బలంగా ఉండింది. చాలా ఏళ్ళపాటు లియెల్ తన సిద్ధాంతంలోని వైరుధ్యాన్ని అర్థం చేసుకోలేదు. ఇంక ఆయన శిష్యగణం గురించి చెప్పేదేముంది. ఆనాటికి సైన్స్‌మీద కూడా శ్రమ విశజన ప్రభావం పడడమే ఇందుకు కారణం.శ్రమ విభజన ఎవరికి వారిని ఆయా ప్రత్యేక రంగాలకే పరిమితం చేసింది. అయితే కొద్దిమందిలో సమగ్రత కోసం మిగిలివున్న తృష్ణను ఆశ్రమ విభజన వారిని ఏవోకొన్ని రంగాలకే పరిమితం చేయలేకపోయింది.

ఇదిలా ఉంటే భౌతికశాస్త్రంలో పెద్ద ముందడుగు సాధ్యపడింది. సామాన్యశాస్త్రంలో ముగ్గురు వ్యక్తులు 1842వ సంవత్సరంలో అలాంటి పురోగతికి కారకులయ్యారు. హీల్‌బ్రాన్‌కు చెందిన 'మాయర్', మాంచెస్టర్‌కు చెందిన 'జోలీ'లు ఉష్ణశక్తి యాంత్రికశక్తిగా, యాంత్రికశక్తి ఉష్ణశక్తిగా రూపాంతరం చెందడాన్ని ఆవిష్కరించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన 'గ్రూవ్' భౌతికశక్తులు అన్నీ – యాంత్రికశక్తి, ఉష్ణశక్తి, కాంతిశక్తి, అయస్కాంతశక్తి, విద్యుత్ శక్తి ఆ మాటకి వస్తే రసాయనశక్తి కూడా నిర్దిష్ట పరిస్థితులలో ఎటువంటి శక్తి నష్టపోకుండానే ఒక శక్తిరూపం నుండి మరొకశక్తి రూపానికి మారతాయన్న ఆవిష్కరణ చేశాడు. ప్రపంచంలో చలన పరిమాణం స్థిరంగా ఉంటుందన్న 'డెస్కారిస్' సూత్రీకరణకు అదనంగా భౌతికశక్తులు నిర్దిష్ట పరిస్థితుల్లో ఒక శక్తిరూపం నుండి మరొక శక్తి రూపానికి మారతాయని నిర్ధారించాడు. తద్వారా చలనంలో ఉన్న వివిధ పదార్థాలు నిర్దిష్టసూత్రాలకు లోబడి ఒకదానినుండి ఇంకొక రూపంలోకి మారతాయన్నది రుజువు కావడంతో ప్రకృతిని ఏమాత్రం మార్చలేం అన్న సంప్రదాయభావానికి కాలం చెల్లింది. ఖగోళశాస్త్రంలో వలె భౌతిక శాస్త్రంలో కూడా


పదార్థ చలనం ఒక్కటే మార్పులకు మూలం అన్న విషయం రుజువయ్యింది.

రసాయన శాస్త్రంలో కూడా లేవోయిజర్ ప్రత్యేకించి డాల్టన్ ప్రకృతికి సంబంధించిన పాత భావాలమీద మరో కోణం నుండి దాడి చేశారు. సేంద్రియ మిశ్రమాల తయారీకి వర్తించే సూత్రాలే సేంద్రియేతర మిశ్రమాల తయారీకీ వర్తిసాయి అని రుజువు చెయ్యడం ద్వారా సేంద్రియ – సేంద్రియేతర పదార్థాల మధ్యన ఉన్న అంతరాన్ని అధిగమించలేం అన్న కాంట్ భావన కూడా పనికిమాలినదని రుజువయింది.

> **❝ ఈ ప్రకృతి యావత్తూ, చిన్నాపెద్దా అని తేడా లేకుండా ఇసుక రేణువు నుండి సూర్యుడిదాకా, ప్రోటోజోవా (ఏకకణ జీవి) నుండి మనిషివరకూ - సమస్త పదార్థం ఉనికిలోకి వచ్చి, వృద్ధిచెంది, గతించిపోతుంటాయి.ప్రకృతి నిరంతర చలనం, నిరంతర మార్పులకు లోనవుతూ వుంటుంది అనేది గ్రీకు తత్వశాస్త్ర సారాంశం. తేడా అల్లా ఆ రోజున గ్రీకు తత్వవేత్తలు మేధో కల్పనగా లోకం ముందుకు వచ్చారు.❞**



డాల్టన్




న్యూటన్

ఇక జీవశాస్త్ర పరిశోధనలలో 18వ శతాబ్దం ద్వితీయార్థం నుండే శాస్త్రీయమైన బృందయాత్రలు, పర్యటనలు ప్రపంచంలో నలుమూలలా ఉన్న ఐరోపా వలన దేశాలన్నింటికీ సాగాయి. ఆయా ప్రాంతాల్లో నివాసం ఉండి పరిశోధనలు కావించినవారు ఎందరో శరీర శాస్త్రం, శరీర నిర్మాణశాస్త్రం, అంగ నిర్మాణ శాస్త్రాల్లో ఎంతో పురోగతి సాధించారు. మైక్రోస్కోప్‌ను శాస్త్రీయంగా వినియోగించడం, కణాన్ని గుర్తించడంతో అప్పటిదాకా అందుబాటులో ఉన్న సమాచారాన్ని తులనాత్మకంగా అధ్యయనం చెయ్యడం ఆరంభమయ్యింది... అనివార్యమైంది.

ఒక వంకన వివిధ రకాల మొక్కల, వృక్షజాతుల జీవావరణ పరిస్థితుల మీద తులనాత్మక భౌతిక భౌగోళిక అధ్యయనం కొనసాగితే మరోవంకన సమజాతి జీవుల అంగ నిర్మాణానికి సంబంధించిన వివిధ అధ్యయనాలు – అది కేవలం వయసున ఉన్న దశలోనే కాకుండా అన్ని దశలకు సంబంధించి – కొనసాగాయి. ఈ అధ్యయనాలు లోతుగా, నిర్దిష్టంగా కొనసాగిన కొలదీ ప్రకృతి నిర్మాణం మార్పులకు అతీతంగా ఉంటుందనుకున్న భావన పటాపంచలవుతూ వచ్చింది. వివిధ జాతుల మొక్కలు, జంతువులు అనివార్యంగా పరస్పర ఆధారితం అని తెలియవచ్చింది. దీనితో అప్పటివరకూ జరిగిన వర్గీకరణకు కాలం చెల్లిపోయింది. భూభౌతికశాస్త్రంలో అప్పటిదాకా ఉన్న లోపాలు ఒకటొకటిగా తొలగిపోతున్న కొలది సేంద్రియ ప్రపంచ చారిత్రక అభివృద్ధికి, వ్యక్తిగత సేంద్రియ చారిత్రక అభివృద్ధికి మధ్యన ఉన్న సమాంతర సంబంధాలు వెల్లడవుతూ వచ్చాయి. అరియాడ్నె ఆవిష్కరణలతో జీవ-జంతు కీటక శాస్త్రాల్లో మరింత లోతైన అన్వేషణలు సాధ్యపడ్డాయి. 1759లో 'కాంట్' సౌర వ్యవస్థ అసంతత్వ భావనమీద దాడిచేసిన నేపథ్యంలోనే సి.ఎఫ్. ఫూల్ఫ్ జీవజాతుల క్షీణతా సిద్ధాంతాన్ని ప్రకటించాడు. ఓకెన్, లామార్క్, బాయర్‌లు ఈ సిద్ధాంతానికి కొనసాగింపు కృషి చేశారు. అంతిమంగా వందేళ్ళ తర్వాత డార్విన్ 'పరిణామ క్రమ సిద్ధాంతం' వెలుగులోకి వచ్చింది. దాదాపుగా అదే కాలంలో ప్రోటోప్లాజమ్, కణం–ఈ రెండూ సేంద్రియ జీవానికి అట్టడుగు స్థాయి రూపాలని నిర్ధారణ అయ్యాయి. తద్వారా సేంద్రియ–సేంద్రియేతర స్వభావాల మధ్యన అప్పటిదాకా ఉన్న అగాధం కనీస స్థాయికి తగ్గుముఖం పట్టింది. ప్రకృతి, దాని లక్షణాల పట్ల ఏర్పడిన నూతన ప్రాపంచిక దృక్పథం పరిపూర్ణ స్థాయికి చేరుకుంది. ప్రకృతి స్థిరంగా ఉండిపోతుంది అనే భావన అంతమయింది. అనంతమైన విశ్వానికి ఆపాదించిన అనంతత్వం( క్షయాకానకం) సరికాదు అని కూడా తెలియవచ్చింది. ప్రకృతి సమస్తం చలనశీలమైనదని, నిరంతరం మార్పులకు లోనవుతూ వుంటుందని స్పష్టమైంది.

ఆ రకంగా మనం గ్రీకు తత్వశాస్త్ర ఆద్యుల ప్రాపంచిక దృక్పథం దగ్గరకి తిరిగి వచ్చాం. ఈ ప్రకృతి యావత్తూ, చిన్నా పెద్దా అని తేడా లేకుండా ఇసుక రేణువు నుండి సూర్యుడిదాకా, ప్రోటోజోవా (ఏకకణ జీవి) నుండి మనిషివరకూ – సమస్త పదార్థం ఉనికిలోకి వచ్చి, వృద్ధిచెంది, గతించిపో తుంటాయి.ప్రకృతి నిరంతర చలనం, నిరంతర మార్పులకు లోనవుతూ వుంటుంది అనేది గ్రీకు తత్వశాస్త్ర సారాంశం. తేడా అల్లా ఆ రోజున గ్రీకు తత్వవేత్తలు మేధోకల్పనగా లోకం ముందుకు వచ్చింది. మన నిర్ధారణలు శాస్త్రీయ ప్రాతిపదికన పరిశోధన చేసి నిర్దిష్టంగా, స్పష్టంగా సూత్రీకరించాం. ఈ చక్రపాత వయనాన్ని అనుభవవాద రుజువులతో పరిశీలించదలిస్తే అక్కడక్కడా చిన్న చిన్న లోటుపాట్లు లేవని కాదు, అయితే ఇప్పటిదాకా నిర్దిష్టంగా రుజువు కాబడిన విషయ పరిజ్ఞానంతో పోలిస్తే అవి అంత పరిగణనలోకి తీసుకొనే అంశాలు కాదు. రానున్న కాలంలో ఇవన్నీ ఒకటొకటిగా పరిష్కారం అవుతాయని మనం ఆశించవచ్చు. అదయ్యే పనేనా అని ఎవరన్నా సందేహించ వచ్చు. ఖగోళశాస్త్రం, రసాయనశాస్త్రం, భూవిజ్ఞానశాస్త్రం వంటి శాస్త్రీయ పరిజ్ఞానం వందేళ్ళక్రితం ఊహింపశక్యం కాని విషయాలేగా, యాభై ఏళ్ళక్రితం దాకా శరీర శాస్త్రం, అంగ నిర్మాణ శాస్త్రం ఊహింపశక్యం కాని విషయాలేగా, నలభై

**"అభివృద్ధి చెందిన పారిశ్రామిక దేశాల్లో ప్రకృతి శక్తులను చెరబట్టి మానవాళి అవసరాల పేరిట అలవిమాలిన ఉత్పత్తిని చేపట్టారు. ఒకప్పుడు వందమంది పెద్దవాళ్ళు కలిసి చేసే ఉత్పత్తిని ఒక పిల్లవాడితో చేయిస్తున్నారు. దీని ఫలితం ఏమిటి? పనిభారం పెరిగింది. ప్రజల కష్టాలు కడగండ్లు పెరిగాయి. ప్రతి పదేళ్ళకు ఒకసారి భారీ సంక్షోభాలు వస్తున్నాయి."**


లిన్నెయస్


కాంట్

ఏళ్ళ క్రితం దాకా కణ నిర్మాణాన్ని కనుగొంటారని ఎవరన్నా ఊహించి ఉంటారా?– ఇవీ అలానే పరిష్కారం అవుతాయి.

× × ×

అంతులేనన్ని సౌర గ్రహాలు, మన భూమండలం అంతర్భాగంగా ఉన్న సౌర వ్యవస్థ ఇవన్నీ పాలపుంత. ఇవన్నీ వాటి గమనవేగం కారణాన సంకోచించి చల్లబడి, మెరిసే ఘనీభవించిన వాయురూప పదార్థాలుగా అవతరించడం వెనుక గమన సూత్రాలు ఇమిడి ఉన్నాయని వెల్లడయిన తర్వాత, నక్షత్ర గమనం మీద వందల ఏళ్ళపాటు మనలో ఉన్న పొరబాటు భావాలు పటాపంచలయిపోయాయి. నూతన అవగాహన నూతన ఆలోచనలను తోడు చేసింది. అయితే అన్ని రంగాల్లో ఇది ఏకరీతిన జరగలేదు.

ఖగోళశాస్త్రానికి నానాటికీ కృష్ణబిలాల ఉనికిని తప్పనిసరిగా గుర్తించాల్సిన అగత్యం ఏర్పడింది. కృష్ణబిలాలు అంటే ప్రకృతిలో ఇమిడి వున్న గ్రహాంతర పదార్థం మాత్రమే కాదు అవి ఆరిపోయిన సూర్యగ్రహాల మూలంగా ఏర్పడినవి (మాడ్లియర్), మరో ప్రక్కన వాయురూప పాలపుంతల్లో కొన్ని 'ప్లాచ్'లు మన సౌర వ్యవస్థలోనే ఇంకా పూర్తిగా ఏర్పడని సూర్యులని (సెచీ) ఆవిష్కరించబడడంతో ఇతర(నెబ్యూలాల)నక్షత్రమండలాల ఉనికిని కొట్టిపారెయ్యలేని పరిస్థితి ఏర్పడింది. సాపేక్షంగా ఇవి ఏమేరకు అభివృద్ధి చెంది ఉన్నాయనేది 'స్పెక్టోస్కోప్'తో మాత్రమే నిర్ధారించగలం.

పాలపుంత పదార్థరాశి క్రమంగా సౌరవ్యవస్థగా ఎలా అభివృద్ధి చెందినదీ ఎంతో వివరణాత్మకంగా ఆవిష్కరించాడు లాప్లాస్. ఇప్పటిదాకా దీన్ని మించిన వివరణ రాలేదు. తర్వాత తర్వాత జరిగిన పరిశోధనలు కూడా లాప్లాస్ ఆవిష్కరణలనే మరింత ఖచ్చితత్వంతో బలపరిచాయి.

సూర్యుడు, గ్రహాలు, ఉపగ్రహాలు అని అంతరిక్షంలో మూడు రకాలుగా ఏర్పడడానికి చలనంలో ఉన్న ఆ పదార్థరాశి కలిగి ఉన్న ఉష్ణశక్తి కారణం. ఉష్ణశక్తిని నిర్దిష్ట పరిస్థితులలో విద్యుత్, అయస్కాంత శక్తులుగా మార్చే వీలున్నప్పుడు సూర్యుడు ఎంతటి తీవ్ర ఉష్ణోగ్రత కలిగి ఉన్నప్పటికీ అందులో మూలకాల రసాయన మిశ్రమాల చర్యలను కొట్టిపారెయ్యలేము. ఉష్ణానికి – గురుత్వాకర్షణకు మధ్య ఉండే ఘర్షణ మూలంగా సూర్యుడిలో యాంత్రిక చలనం కలుగుతుందని కనిపెట్టారు మరిన్ని పరిశోధనలలో మరిన్ని విషయాలు బయటపడే అవకాశం ఉంది. పరిమాణంలో చిన్నవిగా ఉండే పదార్థాలు పెద్దవాటికన్నా త్వరగా చల్లబడతాయి. అయితే రెండు సందర్భాలలో పదార్థ కేంద్రం అన్నింటికన్నా ఆఖర్న చల్లబడుతుంది.

ఏ పదార్థరాశి అయినా క్రమంగా చల్లబడేటప్పుడు భౌతిక, అంతర్గత కదలికలో మార్పులు ఒకదానినుండి మరొకదానికి రూపాంతరం చెందుతూ ఒక దశలో రసాయన మార్పులకు పరిస్థితులు పరిపక్వమై ఆ పదార్థరాశిలో రకరకాల రసాయనిక సంయోగ వియోగాలు చోటు చేసుకుంటాయి. తగ్గుతున్న ఉష్ణోగ్రతలతోపాటుగా ఈ రసాయన సంయోగాలు అందలి మూలకాలతోపాటు, మూలక సంయోగాలను కూడా ప్రభావితం చేసి రసాయన సమ్మేళనాల ఏర్పాటుకు దారితీస్తాయి. క్రమానుగతంగా కొనసాగే ఈ మార్పుల మూలంగా వాయురూపంలో ఉన్న పదార్థం ముందుగా ద్రవరూపంలోకి, తరువాత ఘన పదార్థరూపంలోకి మారుతుంది. తద్వారా నూతన పరిస్థితులు ఆవిర్భవిస్తాయి.

అట్లా ఒక గ్రహ పదార్థం గట్టి గుల్లగా తయారయినాక దాని ఉపరితలం మీద నీరు నిల్వ ఉండటం పెరుగుతూ ఉంటుంది. ఆ గ్రహ పదార్థ కేంద్రం నుండి వెలువడే ఉష్ణోగ్రతలతో పోలిస్తే దాని ఉపరితలం అంతర్గత ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టేకొలది (వీటి) ఆవిర్భావం పెరుగుతా వస్తుంది. ఆ రకంగా దాని వాతావరణంలో వచ్చే మార్పులు భౌగోళిక మార్పులుగా అవతరిస్తాయి.

అంతిమంగా ఉపరితలంమీద ఉష్ణోగ్రత గణనీయమైన ప్రదేశం మేరకు సరిసమానంగా ఉంటే ప్రోటీన్లు జీవం పోసుకొనే అవకాశాలు ఏర్పడతాయి. ఇతరత్రా రసాయన పరిస్థితులు కూడా అనుకూలిస్తే జీవం ఉన్న ప్రోటోప్లాజమ్ అవతరిస్తుంది. అనుకూల పరిస్థితులు ఏమిటనేవి మనకు తెలియకపోవచ్చు. ఆ మాటకి వస్తే ప్రోటీన్ల రసాయన ఫార్ములానే మనకు ఇంతరకూ తెలియదు. ప్రొటీన్లలో ఉండే వివిధ రసాయనాలు ఏమిటో కూడా పూర్తి సమాచారం లేదు. అయితే ఒక దశాబ్దం క్రితమే నిర్మాణ రహిత ఈ ప్రొటీన్‌ల మూలంగానే అరుగుదల, విసర్జన, కదలిక, కుంచించుకుపోవడం, ప్రతిస్పందన, ప్రత్యుత్పత్తి వంటి క్రియలన్నింటికీ కీలకం అని కనుగొన్నారు.

అనుకూల పరిస్థితులు ఏర్పడడానికి, ఈ

ఆకార రహిత ప్రోటీన్ మొదటగా కణాన్ని ఉత్పత్తి చెయ్యడానికి, ఒక న్యూక్లియర్, ఒక కణపొర ఏర్పడడానికి కొన్ని వేల సంవత్సరాలు పట్టి ఉండొచ్చు. అయితే ఈ కణజాలం ఆవిర్భావంతో ఆర్గానిక్ ప్రపంచం రూపురేఖలే మారిపోయాయి. అసంఖ్యాకమైన సెల్యూలార్, నాన్-సెల్యూలార్ జీవులనేకం ఆవిర్భవించాయి. ఈ జీవులను వృక్షజాతి, జంతుజాతిగా వర్గీకరించారు.

మనిషి అవతరణ కూడా ఇలానే జరిగింది. ఏక కణం నుండి సంక్లిష్ట అంగ నిర్మాణం దాకా మానవజాతి అవతరణ ఒక చారిత్రక క్రమంలో జరిగినదే. చతుష్పాద జంతువులా నాలుగు కాళ్ళ నడక నుండి రెండు కాళ్ళు, రెండు చేతులుగా వైవిధ్యం సంతరించుకోవడానికి కొన్ని వేల సంవత్సరాలు పట్టింది. నిటారుగా నడవడానికి మరికొన్ని వేల ఏళ్ళు పట్టింది. కోతినుండి మానవరూపంలోకి పరిణామ క్రమం తరువాత మాటనేర్వడం, ఆ తరువాత మెదడు అభివృద్ధి చెంది ఆలోచించగలగడంతో మానవ పరిణామక్రమం పరిపూర్ణమయ్యింది. వానరుడికి నరుడికి మధ్యన పూడ్చలేని అగాధం ఏర్పడిపోయింది.

చేతిని పనిముట్టులా వాడుకోవడం మానవ కార్యకలాపాల్లో ప్రత్యేకతగా నిలిచింది. తద్వారా మానవుడికి ప్రకృతికి మధ్యన ఉత్పత్తి సంబంధం ఏర్పడింది. జంతుజాలానికి చేతులు ఉన్నాయి. వాటినీ ప్రకృతినుండి తమ ఆహార సముపార్జనకు వాడుకుంటాయి. అంతవరకే వాటి పరిమితి. కాని మానవుడి విషయంలో అలా కాదు. ప్రకృతిమీద తనదైన ముద్రవేశాడు. మొక్కలని, జంతుజాలాన్ని ఒకచోట నుండి మరొకచోటుకి మార్చగలగడం, తన ఆవాస ప్రాంత వాతావరణాన్ని తనకి అనువుగా మార్చుకోవడం ద్వారా నెమ్మది నెమ్మదిగా ప్రకృతిమీద పట్టు సాధించసాగాడు. మానవుడు ఇదంతా కేవలం తన చేతులతో సాధించాడు. ఆ తరువాత అంచెలంచెలుగా చేతులతో పాటు మెదడు అభివృద్ధి కావడంతో ఆ చైతన్యాన్ని ఉపయోగ పెట్టుకొని పరిస్థితులను విశ్లేషించి ఆచరణలో ఉపయోగపడతాయనుకొనే కార్యకలాపాలు చేపట్టసాగాడు. ప్రకృతి నియమాలకు సంబంధించి జ్ఞానాన్వేషణకు పూనుకున్నాడు. ప్రకృతి సూత్రాలను ఒకటొకటిగా అర్థం చేసుకోవడం ద్వారా ప్రకృతిమీద నానాటికీ పట్టు పెంచుకోసాగాడు. చేతులను పనిముట్టుగా వినియోగించడంతో పాటు సమాంతరంగా మెదడుకు పదునుపెట్టడం ద్వారా మానవాళి అవసరాలను తీర్చుకోవడం కోసం ప్రకృతిని ఎక్కువగా వినియోగించుకోవటం సాధ్యపడింది.

> "సారవ్యవస్థ జీవచరిత్ర అంతటితో అంతరించిపోయి 'చావు'ను చవిచూస్తుందా? ఆ తర్వాత ఏమిటి? ఈ అనంత విశ్వంలో సూర్యగ్రహ కళేబరం అంతం లేకుండా పరిభ్రమిస్తుంటుందా? వైవిధ్యభరితమైన వివిధ ప్రాకృతిక శక్తులు ఒకే ఒక చలన రూపాన్ని 'ఆకర్షణ'ని సంతరించుకుంటాయా?"

మానవజాతి 'చరిత్ర'లోకి మనం అలా అడుగుపెట్టాం. జంతుజాలానికి ఒక చరిత్ర ఉంది. వాటి పుట్టుక, పరిణామక్రమం ఇవన్నీ వాటితో ప్రమేయం లేకుండా సాగిన చరిత్ర వాటిది. కాని వానరుడి నుండి నరుడిగా పరిణామం చెందిన అనంతరం మానవుడు చైతన్యపూర్వకంగా తన చరిత్రను తానే నిర్మించుకున్నాడు. మానవజాతి చరిత్రలో అదృశ్యశక్తుల ప్రమేయంగాని, అదాటు పరిణామాల ప్రమేయంగాని నామావశిష్టంగా మారింది. మానవజాతి నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా చరిత్ర ప్రభవించింది. అయితే ఇవే ప్రమాణాలను మానవజాతి చరిత్రకు అన్వయించి చూసుకుంటే మానవ మేధస్సు ఈ నాటికి ఎంత అభివృద్ధి చెందిందో, ఎంతటి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకున్నదో వాటికీ వాస్తవాలకు మధ్యన అంతులేని వ్యత్యాసం ఉండడం మనం గమనించవచ్చు. దీనికి కారణం అనియంత్రిత శక్తుల ఆధిపత్య ప్రభావాలే అని వేరుగా చెప్పనక్కరలేదు. ఇది ఇంతకన్నా భిన్నంగా ఉండకపోవడం సహజమైన విషయమే. ఎందుకంటే వానరుడు నరుడుగా అవతరించడానికి ఒక పాదార్థిక పునాది ఉంది. అసంఖ్యాకమైన కార్యకలాపాలకు ఈ పాదార్థిక లక్షణాలే పునాదిగా నిలిచాయి. మానవాళి తన అవసరాలకోసం చేపట్టిన ఉత్పత్తి - సామాజిక ఉత్పత్తి - కార్యకలాపాలు అన్నీ అనియంత్రిత శక్తుల అవాంఛిత ప్రభావాలతో అంతర్గతంగా ఘర్షణపడి, కొన్ని మినహాయింపులతో విజయం సాధించినవే తప్ప ఎక్కువ సందర్భాలలో వైఫల్యం చెందినవే.

అభివృద్ధి చెందిన పారిశ్రామిక దేశాల్లో ప్రకృతి శక్తులను చెరబట్టి మానవాళి అవసరాల పేరిట అలవిమాలిన ఉత్పత్తిని చేపట్టారు. ఒకప్పుడు వందమంది పెద్దవాళ్ళు కలిసి చేసే ఉత్పత్తిని ఒక పిల్లవాడితో చేయిస్తున్నారు. దీని ఫలితం ఏమిటి? పనిభారం పెరిగింది. ప్రజల కష్టాలు కడగండ్లు పెరిగాయి. ప్రతి పదేళ్ళకు ఒకసారి భారీ సంక్షోభాలు వస్తున్నాయి. స్వేచ్ఛాపోటీ, మనుగడ కోసం పోరాటం అన్న పదాలను అభివృద్ధి చెందిన దేశాల ఆర్థికవేత్తలు అత్యున్నత చారిత్రక విజయాలుగా కీర్తిస్తున్నారు. కాని అలాంటి జంతు లక్షణాలను గురించి డార్విన్ చెప్పిన వాస్తవాన్ని విస్మరిస్తున్నారు. మానవాళిమీద, ముఖ్యంగా తన దేశ జనులమీద తాను రాసిన క్రూర పరిహాసం ఎటువంటి ప్రభావం చూపుతుందో బహుశా డార్విన్‌కి తెలిసి ఉండదు. చైతన్యయుతమైన, నిర్మాణాత్మకమైన సామాజిక ఉత్పత్తి మాత్రమే... ఎక్కడయితే ఉత్పత్తి, పంపిణీ ప్రణాళికాబద్ధంగా సాగుతాయో - మానవాళిని జంతు ప్రపంచం నుండి వేరు పరుస్తుంది. ఇది కేవలం సామాజికపరమైన అంశమే కాదు.( దైహికపరమైన) అంశం కూడా. చారిత్రక పరిణామ క్రమం మాత్రమే అలాంటి సమాజాన్ని అనివార్యం చేస్తుంది. రోజు రోజుకీ ఆ సమాజ ఆవిర్భావాన్ని మరింత దగ్గర చేస్తుంది. అలాంటి సమాజం సాకారం అయిన రోజున చరిత్ర ఒక నూతన శకంలోకి ప్రవేశిస్తుంది. సకల మానవాళి, మానవాళి సకల కార్యకలాపాలూ, ముఖ్యంగా విజ్ఞానాభివృద్ధి ఫలాలు - మనుపెన్నడూ లేనంత స్థాయిలో అభివృద్ధి చెందుతాయి.( గతం మొత్తాన్ని విస్తుపోయేలా



మార్టిన్ లూథర్

> **"మరయితే అంతటి వేడిమి ఏమైపోయినట్టు? విశ్వాంత రాళాన్ని వెచ్చచేసే ప్రయత్నంలో ఆవిరయి పోయిందా? ప్రాక్టికల్ గానే అంతటి ఉష్ణం అదృశ్యమైపోయిందా? కేవలం సైద్ధాంతి కంగా మాత్రమే ఉనికిలో ఉందా? చలనానికి నాశనం ఉండదనే సూత్రం ప్రకారం పై సందేహాలకు అసలు తావు ఉండకూడదు. భారీ శకలాలు ఒకదానితో ఒకటి ఢీకొని పతనమవుతూ యాంత్రికచలనం ఉష్ణంగా మారి విశ్వంలోకి వికిరణం చెందు తుంది."**

చేస్తుంది.)

సృష్టిలో ప్రతిదీ లయం కావల్సిందే. లక్షల ఏళ్ళు గడవనీ, వందల వేల తరాలు జన్మించి మరణించనీ, ప్రపంచమంతటికీ వేడిమిని పంచుతున్న సూర్యుడిలో ఉష్ణోగ్రతలు తగ్గి ధృవప్రాంతాల్లో మంచును కరిగించడంలో విఫలమవుతాయి. మానవజాతి భూమధ్యరేఖ సమీపంలోకి కిక్కిరిసి చేరిపోతారు. అప్పటికీ బతకడానికి తగినంత వేడిమి పొందలేకపోతారు. క్రమేపీ ఈ భూమ్మీద జీవజాలం తన ఉనికిని కోల్పోతుంది. జీవం అంతరించిపోతుంది. ఈ భూమి కూడా చలికి బిగుసుకుపోయిన మరో చంద్రగ్రహంలా మారుతుంది. చీకటి కుహరంలోకి జారిపోయి, సంకుచిత కక్ష్యలో తిరుగాడుతూ అప్పటికే అవశేషప్రాయంగా మారిన సూర్యగ్రహంలోకి కూలిపోతుంది. ఇంతకుముందు ఉన్న గ్రహాలకు పట్టిన దుస్థితి ఇదే. మిగిలిన గ్రహాలకూ పట్టబోయే దురవస్థా అదే. తన వేడిమితో సౌరవ్యవస్థ మనుగడకు ప్రాణవాయువుగా నిలిచిన సూర్యగ్రహం చప్పున చల్లారిపోతే జరగబోయే వినాశనం ఇది. అయినప్పటికీ ఈ గ్రహాలు విశ్వాంతరాళంలో మృతకక్ష్యలో తిరుగాడుతూనే ఉంటాయి. మన సౌరవ్యవస్థకు పట్టిన గతే ఈ విశ్వాంతరాళంలో ఉన్న మిగిలిన గ్రహ వ్యవస్థలకూ పడుతుంది. మన భూమిమీదకి ఇప్పటికీ తన కాంతిని ప్రసరింపచెయ్యలేనంత సుదూర తీరాల్లో ఉన్న గ్రహాల వెలుగు రేపు ఎప్పుడైనా ఈ భూమిని తాకినా దానిని ఆస్వాదించే మానవ నేత్రం మిగిలి ఉండదు.

సౌరవ్యవస్థ జీవచరిత్ర అంతటితో అంతరించిపోయి 'చావు'ను చవిచూస్తుందా? ఆ తర్వాత ఏమిటి? ఈ అనంత విశ్వంలో సూర్యగ్రహ కళేబరం అంతం లేకుండా పరిభ్రమిస్తుంటుందా? వైవిధ్యభరితమైన వివిధ ప్రాకృతిక శక్తులు ఒకే ఒక చలన రూపాన్ని 'ఆకర్షణ'ని సంతరించుకుంటాయా?

లేక సెక్చీ ప్రశ్నించినట్లు "ప్రకృతిలోని ఈ శక్తులు మృతప్రాయమైన వ్యవస్థను తిరిగి మెరిసే పాలపుంతలాంటి తన యధాతథస్థితికి రూపాంతరం చెందుతాయా, నూతన జీవానికి తిరిగి ప్రాణం పోస్తాయా?" ఏం జరగనున్నదో మనకి తెలియదు.

అఫ్‌కోర్స్, మనకు తెలియదు అన్నామంటే మనకు రెండు రెళ్ళు నాలుగని, పదార్థ ఆకర్షణ శక్తి దూరానికి అనుగుణంగా పెరుగుతూ తరుగుతూ వస్తుందని తెలిసినంత పక్కాగా తెలియదని కాదు. ప్రకృతి శాస్త్రం సిద్ధాంతపరంగా సాధ్యమైన మేరకు ప్రకృతితో సామరస్య సహ జీవన ప్రాపంచిక దృక్పథాన్ని కలుగచేస్తుంది. ఆలోచనలేని శుద్ధ అనుభవవాదులు కూడా దీన్ని అంగీకరిస్తారు. మనం మన పరిజ్ఞాన లోపాన్ని అధిగమించాలంటే మనకు తెలియని విషయాల గురించి తెలుసుకోవాలనేఆసక్తి, నిరంతర ధ్యాస మనలో ఉండాలి. పదార్థ చలనాన్ని నాశనం కావించలేమనే తత్వశాస్త్ర సూత్రాన్ని ఆధునిక విజ్ఞానశాస్త్రం (సైన్స్) అందిపుచ్చుకోవాలి. ఈ సూత్రాన్ని వదిలిపెడితే విజ్ఞానశాస్త్రం అనేదే మన జాలదు. పదార్థ చలనాన్ని కేవలం యాంత్రిక చలనంగానో, ఒక చోటు నుండి మరొక చోటుకు మారడం అనే సామాన్య అర్థంలోనో చూడకూడదు. పదార్థ చలనం అంటే ఉష్ణ, కాంతి, విద్యుత్ అయస్కాంతాల తలతన్యత, అంతర్గత చలనం రసాయన సంయోగం, వియోగం, జీవం, అన్నింటికీ మించి అది ఒక చైతన్యం. అనంతకాలంలో పదార్థ ఉనికి ఒకే ఒక రూపంలో ఉంటుంది. పదార్థ అనంతత్వంతో పోలిస్తే ఈ అనంతకాలం అతి స్వల్పమైన కాలం. అయితే ఈ పదార్థం చలనం ద్వారా వైవిధ్యత సంతరించుకుంటుంది. చలనం పదార్థ లక్షణాన్నే మార్చివేస్తుంది. ఏతావాతా పదార్థమనేది జీవరహితమైనది. చలనం అనేది జవజీవమైనది అని మనం అర్థం చేసుకోవచ్చు. చలనాన్ని నాశనం చెయ్యలేమని పరిమాణాత్మకంగానే కాదు, గుణాత్మకంగా కూడా మనం అర్థం చేసుకోవచ్చు. యాంత్రిక చలనం ఒక ప్రదేశంనుండి మరొక ప్రదేశానికి మారడమే అయినప్పటికీ నిర్దిష్ట అనుకూల పరిస్థితులలో అది ఉష్ణంగా, విద్యుత్‌గా, రసాయన చర్యగా, జీవంగా మారుతుంది. కాని చలనం తనంతతానుగా ఈ నిర్దిష్ట అనుకూల పరిస్థితులను సృష్టించలేదు. అలాంటిదానినే జడంగా మారిన చలనం అంటాం. రూపాంతరం చెందే శక్తిని కోల్పోయిన చలనానికి తిరిగి ఆ సామర్థ్యాన్ని అందించాలంటే 'శక్తి'ని సంతరిస్తే సరిపోదు. దానికి 'డైనమిక్స్' జత చెయ్యాలి. అలా చెయ్యాలంటే పాక్షికంగా దాన్ని ధ్వంసం చెయ్యాలి. అయితే ఈ రెండు ఊహింపనలవి కానివి.

అయితే ఒకటి మాత్రం తథ్యం. విశ్వాంతరాళంలో మనం ఉన్న ఈ భూగోళం ఏదో ఒక స్థాయి చలనంలో వేడెక్కింది. తద్వారా మనం చూస్తున్న 'సౌర వ్యవస్థ' ఆవిర్భవించింది. అది ఏ స్థాయి చలనమో ఇప్పటికీ అంతుబట్టలేదు. మనం చూస్తున్న పాలపుంతలో హీనపక్షంగా 20 లక్షల నక్షత్రాలు వున్నాయి. ఇవన్నీ కూడా ఏదో ఒక నాటికి అంతరించిపోతాయి.

మరి తరువాత ఏం జరుగుతుంది? ఫాదర్ సెక్చీ అంచనా వేసినట్లుగా మన సౌర వ్యవస్థ నుండే మరో నూతన సౌరవ్యవస్థ ఆవిర్భవించటానికి తగిన ముడి సరుకు దొరుకుతుందా? ఏమని సమాధానం చెప్పగలం. అయితే భావవాదులు భావించినట్లు ఆ సృష్టికర్తే పునఃసృష్టి చేస్తాడని ఓ దణ్ణం పెట్టి సరిపెట్టుకోవాలి. లేదంటే భౌతికవాద దృక్పథం ప్రకారం పదార్థ చలనం మూలంగా మరలా సౌరవ్యవస్థ, ఈ విశ్వం ఏర్పడతాయని నిర్ణయానికి రావడమా. మొదటి సూత్రం ప్రకారం చిటికెలోనో, ఏడు రోజుల్లోనో ఈ సృష్టి జరిగిపోవాలి. కాని రెండవ సూత్రం ప్రకారం అలాంటి సృష్టి జరగడానికి కొన్ని లక్షల సంవత్సరాలు పట్టొచ్చు. పరిస్థితులు కలిసివచ్చే అవకాశం ఉంటేనే అదైనా జరుగుతుంది.

శాస్త్రవేత్తలు అలాంటి అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. అంతరిక్షంలో భారీ శకలాలు ఒకదానిమీద మరొకటి కూలిపోతాయని, అలా భారీ శకలాలు ఒకదానినొకటి ఢీకొట్టే సమయంలో వెలువడే ఉష్ణోగ్రతల మూలంగా కొత్తగా నక్షత్రాలు

(మిగతా 29వ పేజీలో)

మతోన్మాదం

# ఘర్ వాపసీ కార్యక్రమం నిజస్వరూపం

**సుభాషిణీ ఆలి**



రచయిత ఐద్వా జాతీయ నాయకురాలు

'ఘర్' అనే హిందీ మాటకు ఇల్లు అని అర్థం. ఇల్లు అంటే అందరికీ ఇష్టమే కదా! ఇల్లు అనగానే ఎప్పుడూ మనకు ఆహ్వానం పలికేదిగాను, మనకు చోటు ఇచ్చేదిగాను, మన స్నేహితులను, బంధువులను స్వీకరించేదిగాను మనం భావిస్తాము. మన ఇంటి తలుపులు మనకోసం ఎప్పుడూ తెరిచే ఉంటాయి. మన వాళ్ళు ఎంతమంది వచ్చినా మనింట్లో చోటు ఉంటుంది. అతిథులకు కూడా చోటు ఉంటుంది. 'ఘర్ వాపసీ' అంటే సొంత ఇంటికి తిరిగి రావడం అని అర్థం. దూర ప్రాంతాలకు వెళ్ళి ఎంతోకాలం తర్వాత మన వాళ్ళు తిరిగి ఇంటికి వస్తుంటే ఎంతో ఆనందం కదా! ఇతర మతస్తులను హిందూ మతంలోకి మార్చటానికి సంఘ పరివార్ శక్తులు నడుం కట్టాయి. ఈ కార్యక్రమానికి 'ఘర్ వాపసీ' అని పేరు పెట్టారు. అంటే మీరంతా 'ఇంటికి తిరిగి రండి' అని ఆహ్వానం పలకడం. చూడ్డానికి ఈ ఆహ్వానం ఎంతో ప్రేమగా పిలిచినట్లు ఉంటుంది. కాని వాస్తవం వేరుగా ఉంది.

భారతీయులలో అత్యధికభాగం (82 %) హిందువులు. మిగిలిన 18 శాతంలో ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, నాస్తికులు ఇంకా ఇతరులు ఉన్నారు. మన దేశంలో ఎట్టి పరిస్థితులలోనూ హిందువులు మైనారిటీగా మారే అవకాశం లేదు. అయినప్పటికీ సంఘ పరివార్ శక్తులు దేశంలో ఇతర మతస్తుల సంఖ్య పెరిగి, హిందువులు మైనారిటీగా మారిపోయే ప్రమాదం ఉన్నదని ప్రచారం చేస్తున్నాయి.

మన దేశంలో ఈనాడు ముస్లింలుగాను, క్రైస్తవులుగాను జీవిస్తున్న ప్రజలలో ఎక్కువమంది పూర్వీకులు గతంలో హిందూమతం నుండి బయటకు వెళ్ళిన మాట నిజమే. ఇలా ఇతర మతాలను స్వీకరించే ప్రక్రియ అనేక శతాబ్దాల పాటు సాగింది. దేశంలోని విభిన్న ప్రాంతాలలో వివిధ కారణాల వల్ల మత మార్పిడి జరిగింది. అయితే ఈ మత మార్పిడులన్నీ ముస్లిం పాలకులు లేదా క్రైస్తవ పాలకులు బలవంతంగా చేసినవే అనడం సరికాదు. అలా బలవంతపు మత మార్పిడులు చేసినట్లయితే మనదేశంలో ఇతర మతస్తుల సంఖ్య ఇప్పటికంటే చాలా ఎక్కువగా ఉండేది. ఇతర మతాలను స్వీకరించడంలో ప్రలోభాల పాత్ర కొంత ఉంది. పాలకులకు దగ్గరవ్వాలనే కోరిక మరో కారణం. ఇప్పుడు ప్రధానమైన కారణం ఏమిటో చూద్దాం. మతం మారిన వారిలో ఎక్కువమంది అంటరాని కులాలకు, వెనుకబడిన కులాలకు చెందిన వారే. వారు ముస్లిములుగా మారినా, క్రైస్తవులుగా మారినా చిరకాలంగా తామెదుర్కొంటున్న కుల వివక్ష నుండి విముక్తి కోసం పడిన ఆరాటమే కారణం. ఈ విషయాన్ని స్వామివివేకానంద, మహాత్మాగాంధీ అంగీకరించారు. వీరిరువురూ మత మార్పిడుల గురించి కలత చెందారు. వారొకవైపు వర్ణ వ్యవస్థను ఆమోదించారు. మరోవైపు అగ్రవర్ణాల దౌర్జన్యాన్ని నిరసించారు. దౌర్జన్య రహిత మతంగా హిందూ మతాన్ని సంస్కరించవచ్చని వారు కలలుకన్నారు.

ఇతర మతాలు స్వీకరించిన వారిని తిరిగి హిందువులుగా మార్చడానికి స్వాతంత్ర్యానికి ముందుకాలంలో కొన్ని ప్రయత్నాలు జరిగాయి. అయితే గొప్ప ఫలితాలనేమీ సాధించలేదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత షెడ్యూల్డ్ కులాల ప్రజలకు ప్రత్యేకమైన పరిస్థితి ఎదురైంది. తాము ఇతర మతస్తులుగా గుర్తించబడితే షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్లు వదులుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. అందువల్ల జనాభా లెక్కలలో ఎక్కువ మంది హిందువులుగానే ప్రకటించుకున్నారు.

ప్రస్తుతం మన దేశంలో హిందువుల సంఖ్య తగ్గే ప్రమాదం ఏమాత్రం లేదు. దేశం ముస్లిం పాలనలో లేదు. క్రైస్తవుల పాలనలోనూ లేదు. షెడ్యూల్డ్ కులాలవారికి హిందూ మతాన్ని వదిలేస్తే రిజర్వేషన్లు పోతాయనే భయం ఉంది. అందువల్ల హిందువులు మెజారిటీగా ఉండే పరిస్థితి చెక్కు చెదరకుండా ఉంటుంది. మర యితే "తిరిగి హిందూమతంలోకి రండి" అని సంఘ పరివార్ శక్తులు ఎందుకు పిలుపునిస్తున్నాయి?

**అనుమాన విషబీజాలను నాటుతున్నారు**

"తిరిగి ఇంటికి రండి" అనే పిలుపు ప్రేమతో కూడిన ఆహ్వానం కాదు. భయాందోళనలు కలిగించే హెచ్చరిక. సంఘ పరివారపు లక్ష్యం స్పష్టం. ముస్లిం, క్రైస్తవ ప్రజలను పరాయి వాళ్ళుగా చిత్రించాలి. శత్రువులుగా చూపించాలి. వీరిపట్ల హిందువులలో అనుమానం, ద్వేషం రాజుకోవాలి. ఇదీ వారికి కావలసింది.

ముస్లిములు, క్రైస్తవులు, తిరిగి హిందూ మతంలో చేరడం ద్వారా సొంత గూటికి రావాలనే పిలుపులో వారు సొంత ఇంటిని వదలి పరాయి పంచన చేరారనే అర్థం ధ్వనిస్తున్నది.

"వారు వేరే మతాన్ని తీసుకొని మన మతానికి ద్రోహం చేశారు. మన జాతి హిందూ జాతి. మన మతం హిందూ మతం. మన దేశంలోని ఇతర మతస్తులు పరాయివాళ్ళు. మన వాళ్ళు కాదు. వాళ్ళని వేరుగా చూడాల్సిందే" ఈ భావనని హిందువులలో లోతుగా నాటాలి. ఇదే సంఘ పరివార్ శక్తుల అసలు ఉద్దేశ్యం. అంతేగాని, ఇతర మతాలను స్వీకరించిన భారతీయులందరినీ హిందూ మతంలోకి తీసుకు రావాలనే ఆలోచనగాని, అలాంటి భ్రమలుగాని వారికి లేవు.

'ఘర్ వాపసీ' అనే కార్యక్రమం తేనెలో ముంచిన విషపు గుళికని ఇటీవల వారు దేశంలో అక్కడక్కడా ఆదరాబాదరాగా చేసిన కార్యక్రమాల తీరుచూస్తే అర్థమౌతుంది. మధ్యప్రదేశ్‌లో ఒక డజను కుటుంబాలను క్రైస్తవంలోంచి హిందూ మతంలోకి మార్పించారు. ఆ మార్పు ఎన్నో రోజులు నిలవలేదు. ఆగ్రాలో 70 పేద బెంగాలీ ముస్లిములకు రేషన్ కార్డులు, ఇళ్ళు ఇప్పిస్తామని హిందూ మతాన్ని అంటగట్టారు. వాళ్ళంతా హిందూమతంలో కొనసాగటానికి ఇష్టపడటం లేదు. తాజాగా కేరళలో క్రైస్తవులను హిందువులుగా మార్చే ప్రక్రియ చేపట్టారు. వాతావరణాన్ని కలుషితం చేసే ఈ చెత్త పనుల్ని అడ్డుకోవడానికి అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం ఏ చర్యా తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు ఉండిపోయింది.

> **"ఇప్పటికే మైనారిటీల పట్ల ద్వేషాన్ని రగిల్చే ప్రయత్నాలు ఫలితాలనిచ్చాయి. ప్రజల్లో చీలికలేర్పడ్డాయి. ఇప్పుడీ 'ఘర్ వాపసీ' కార్యక్రమం ద్వేషాన్ని, చీలికలను మరింత పెంచ డానికి ఉపయోగపడుతుంది. "ఇతర మతాలను స్వీకరిం చడం దేశద్రోహం. తిరిగి హిందూ మతంలోకి వస్తే దేశభక్తి" ఇదే సంఘ పరివార్ మంత్రం."**



ఆగ్రాలో విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు పేద ముస్లింలతో నిర్వహిస్తున్న ఘర్ వాప్సి కార్యక్రమం

ఈ కార్యక్రమాలు చాలా గందరగోళాన్ని సృష్టించాయి. ముస్లిములు, క్రైస్తవులలో భయాందోళనలను కలిగిస్తున్నాయి. దీనికితోడు వారి మత సంస్థల నాయకులు కూడా భయాన్ని పెంచే పనే చేస్తున్నారు. అది వారి అవసరం. మరలా దీని ప్రతి కంపనలు మెజారిటీ మతం వారిలో చొరబడుతున్నాయి.

ఇప్పటికే మైనారిటీల పట్ల ద్వేషాన్ని రగిల్చే ప్రయత్నాలు ఫలితాలనిచ్చాయి. ప్రజల్లో చీలికలేర్పడ్డాయి. ఇప్పుడీ 'ఘర్ వాపసీ' కార్యక్రమం ద్వేషాన్ని, చీలికలను మరింత పెంచడానికి ఉపయోగపడుతుంది. "ఇతర మతాలను స్వీకరించడం దేశద్రోహం. తిరిగి హిందూ మతంలోకి వస్తే దేశభక్తి" ఇదే సంఘ పరివార్ మంత్రం.

ఇతర మతాల్లోకి వెళ్ళిన భారతీయులను "తిరిగి ఇంటికి రండి" అని సంఘ పరివారం ఆహ్వానిస్తున్నది. ఈ ఇంటి స్వభావం ఏమిటి? తిరిగొచ్చిన ముస్లిములకు, క్రైస్తవులకు ఈ ఇంట్లో ఎలాంటి స్థానం ఉంటుంది? యోగి ఆదిత్యనాథ్ లాంటి సంఘ పరివార్ ప్రముఖులు ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పారు. వారు చెప్పిందేమిటి? "తిరిగి వచ్చిన వారికి వారి పూర్వీకుల స్థానమే ఉంటుంది. అవే కులాల్లో ఇమిడిపోవాలి." ఏ స్థానాన్ని భరించలేక వారి పూర్వీకులు బయటకు వెళ్ళారో అదే స్థానానికి వారు తిరిగి రావాలి. అదీ ఇంటికి తిరిగి రావడమంటే అర్థం!

తరతరాలుగా కులవ్యవస్థ కబంధ హస్తాల్లో నలిగిపోయిన నిమ్న కులాల ప్రజల బాధను అర్థం చేసుకోవాలంటే బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పిన విషయాలను అర్థం చేసు కోవాలి.

**అసమానతలతో కూడిన కుల వ్యవస్థ**

అంబేద్కర్ 1935లోనే ఇలా ప్రకటించారు. "నేను హిందూ మతంలో పుట్టడం నా ఇష్ట ప్రకారం జరిగింది కాదు. హిందూమతంలో కొనసాగటం మాత్రం నాకిష్టం లేదు" హిందూమతాన్ని వదిలేయాలనే నిర్ణయాన్ని ప్రకటిస్తూ ఆయన చేసిన ప్రసంగంలో ఇలా అన్నారు:

"మతం మారడం అనేది చిన్న పిల్లలాట కాదు. అది జీవితానికి సంబంధించిన సమస్య. మత మార్పిడిలో మతం ఎంపిక ఒక అంశమైతే, సామాజిక పరిస్థితి మరో అంశం. మత మార్పిడిలో భౌతిక కోణం, ఆధ్యాత్మిక కోణం రెండూ ఉంటాయి. నేనెందుకు మతం మారాలనుకుంటున్నానో తెలియజేయాలంటే చరిత్రలోకి వెళ్ళాలి. అస్పృశ్యత అనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. ఇది వ్యక్తుల మధ్య తగాదా కాదు. అస్పృశ్యత అనేది ఒక వర్గ సంఘర్షణ. సవర్ణ హిందువులకు, అంటరాని వారికి మధ్య ఘర్షణ. ఒక వర్గం మరొక వర్గంపై సాగించిన దౌర్జన్యం, ఆధిపత్యం. ఈ వర్గ పోరాటంతో సామాజిక స్థాయికి సంబంధం ఉంది. వర్ణ వ్యవస్థ ఏ కులం ఎక్కడ ఉండాలో చెబుతుంది. అందరూ సమానం కాదని చెబుతుంది. సమాన స్థాయిని కోరుకుంటే అణచివేతతో సమాధానం చెబుతుంది.

అందరం సమానం కదా! అంటే పై వర్ణాలవారికి కోపం వస్తుంది. మీతో మేము సమానం అంటే వీరిని అవమానించినట్లే! అంటరానితనం తాత్కాలికమైన పరిస్థితి కాదు. శాశ్వత స్థితి. హిందువులకు, అంటరానివారికి మధ్య ఘర్షణ నిరంతరమైనది.. శాశ్వతమైనది. మారేందుకు ఎలాంటి అవకాశమూ లేదు. 'ఈరోజు నీ స్థానం సమాజంలో అట్టడుగున ఉన్నది. ఎప్పటికీ నీ స్థానం అదే! ఇక ఘర్షణకు అంతమేది? ఈ పోరాటంలో బతికి బట్టకట్టే దెలా? ఇక్కడ మనకు రెండు విషయాలు స్పష్టమౌతున్నాయి. ఒకటి – దౌర్జన్యాన్ని ఎదుర్కోవాలంటే నీకు బలం కావాలి. రెండు – నీవు చాలా బలహీనంగా ఉన్నావు. ఈ పరిస్థితిలో నీకు బయటినుండి శక్తి రావాలి. ఇదెలా సాధ్యం? నీవు మరొక సమూహానికి దగ్గరవ్వాలి. మరొక మతంలో చేరాలి. అప్పుడే నీకు బయటినుండి శక్తి వస్తుంది. ఇలా బయటి నుండి శక్తిని పొందకపోతే నీవు, నీ వారసులూ ఈ నికృష్ట జీవితంలో మగ్గిపోవలసిందే. మతం మారాల్సిన అవసరాన్ని భౌతిక అవసరాల దృష్టితో చూశాము. ఆధ్యాత్మికపరంగా ఆలోచించినా మతం మారాల్సిన అవసరం కనిపిస్తున్నదని నేను భావిస్తున్నాను. హిందూ సమాజంలో వ్యక్తి ప్రధానం కాదు. ఇక్కడ వర్ణం ప్రధానం. ఒక వ్యక్తి మరొక వ్యక్తితో ఎలా ప్రవర్తించాలో హిందూ మతం చెప్పదు. వ్యక్తిని గౌరవించని మతాన్ని నేను అంగీకరించలేను"

ఆనాడు అంబేద్కర్ చెప్పిన విషయాన్ని మనం మళ్ళీ గుర్తు చేసుకోవలసిన అవసరం ఇప్పుడు వచ్చింది. హిందూత్వ వాదుల ప్రచార పటాటోపంలోని డొల్లతనాన్ని అర్థంచేసుకో వాలంటే అంబేద్కర్ భావాలను పరిశీలించాల్సిందే.

"హిందూ మతమే మనందరి ఇల్లు. మనింటికి తిరిగి రండి" అని భారతీయ ముస్లింలను, క్రైస్తవులను పిలుస్తున్నారు. నిజానికి ఇల్లు అంటే అందరూ సమానం, అందరూ కలిసి ఉంటారు, కలిసి తింటారు. కాని మనింట్లో అందరూ సమానం కాదు. కొందరు తిని పారేస్తే మిగిలినవారు తింటారు. ఇలాంటి ఇంట్లోకి రమ్మని సంఘ పరివార్ పిలుస్తోంది. రాకపోతే జాగ్రత్త అనే బెదిరింపు కూడా ఉంది.

హిందువులు కానివాళ్ళని పరాయివాళ్ళగాను, దేశద్రోహులుగాను ముద్రవేయడమే 'ఘర్ వాపసీ' కార్యక్రమం యొక్క నిజ స్వరూపం.

**(అనువాదం. డాక్టర్ పి.విజయకుమార్)**

అధ్యయనం

# ఏజెన్సీ గిరిజనులపై ప్రపంచీకరణ ప్రభావాలు



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కమిటీ సభ్యులు

వై. సిద్ధయ్య

ప్రపంచీకరణ అంటే... ?

అభివృద్ధి... సంపదల సృష్టి... పేదరికాన్ని పారదోలటం... అసమానతలు చెరిపేయటం... 1991 తర్వాత మన పాలకులు ఆవిష్కరించిన పంచవన్నెల చిత్రం...

ప్రపంచీకరణ విధానాల అమలు అట్టడుగు వర్గాల ఉద్ధరణకే అని నమ్మబలుకుతున్నారు. డిష్ యాంటెన్నాలు, టెలివిజన్లు, సెల్ టవర్లు, సెల్‌ఫోన్లు, వంట గ్యాస్ బండలు, సిమెంట్ రోడ్లు, సంపన్నుల విలాసవంతమైన కార్లే అభివృద్ధికి చిహ్నాలుగా చూపుతున్నారు. ఇదే నిజమా?

ముఖ్యంగా నాగరిక సమాజానికి దూరంగా తరతరాలుగా అడవులు కొండల్లో తల దాచుకుంటున్న ఏజెన్సీ గిరిజనులు ఆ కాలంలో సాధించిన ప్రగతి ఏమిటి? వాస్తవాలు తెలుసుకోవాలని, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ అధ్యయనాల సంస్థ (అపార్డ్) నిర్ణయించాయి. గిరిజనుల జీవన పరిస్థితులు, భూమి పంపిణీ, వ్యవసాయ పద్ధతులు, వృత్తులు, ఆహార భద్రత, విద్య, వైద్యం, ఉపాధి కల్పన, ఐటిడిఎ, జిసిసి వంటి ప్రభుత్వ ఏజెన్సీలు, గిరిజన చట్టాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అందుకు రాజ్యం ఇస్తున్న అండదండలు తదితర అధ్యయన అంశాలను ఎంచుకున్నాము. విశాఖ జిల్లా పాడేరు ఐటిడిఎ పరిధిలోని గుర్రగరువు రెవిన్యూ గ్రామాన్ని అధ్యయనానికి తీసుకున్నాము. 2013-14లో 12 మంది వలంటీర్లతో అక్కడ సర్వే నిర్వహించాము. సర్వే సమాచారం సంక్షిప్తంగా ఈ క్రింది విధంగా ఉంది.

### గుర్రగరువు - భౌగోళిక పరిస్థితి

విశాఖజిల్లా, పాడేరు మండలం, మోదేపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని మూడు రెవిన్యూ గ్రామాలలో గుర్రగరువు ఒకటి. పాడేరు నుండి 10 కిలోమీటర్లు తారురోడ్డుపై ఆర్టీసి బస్‌లో ప్రయాణించి "మాదుకొండమ్మ వారి పాదాల సెంటర్" చేరాలి. అక్కడి నుండి కాలినడకన మూడు కిలోమీటర్ల దూరం నడిచి గుర్రగరువు చేరవచ్చు. ఈ గ్రామస్తులందరూ ఆదిమ తెగలకు (పి.టి.జి) చెందిన గిరిజనులు. కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ అంచనాల ప్రకారం దేశంలో 700 షెడ్యూల్డు తెగలు ఉన్నాయి. వారిలో 75 తెగలు మరింత పురాతన సాంకేతిక స్థాయిలో ఉన్నాయి. ఆర్థికంగా, విద్యాపరంగా బాగా వెనకబడి ఉన్నాయి. ఈ తెగలనే ప్రిమిటివ్ ట్రైబల్ గ్రూప్స్ (పిటిజి)గా పిలుస్తారు. పాడేరు ప్రాంతంలోని ఈ తెగకు భాష కివి. దానికి లిపి లేదు. గ్రామంలో గిరిజనేతరులు లేరు. ఈమధ్య కాలంలో ఈ గ్రామం నుండి ఎవరూ ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళలేదు. ఇతర ప్రాంతాల నుండి వలస వచ్చి స్థిరపడలేదు.

మాల్తీ పాలికి, బొన్నీ పాలికి, కాండీ రామన్న, పాలికిలక్ తదితర గిరిజన తెగలు ఒరిస్సానుండి వచ్చారు. అడవి, సారవంతమైన భూమి, నీరు తదితర కనీస సౌకర్యాలున్న ప్రాంతం కోసం వెతికి, ఇక్కడ స్థిరపడి పోయారు. అల్లూరి సీతారామరాజు ఈ ప్రాంతంలో పోరాటాలు మొదలు పెట్టక ముందే ఈ గ్రామం ఏర్పడింది. సుక్రన్న, జిల్లా కుర్రా వంటివారు ఘాట్ రోడ్డు నిర్మాణ పనులలో వెట్టిచాకిరీ చేశారు. తెల్లదొరల దురాగతాలకు వ్యతిరేకంగా అల్లూరి సీతారామరాజు పితూరిలో తమ పూర్వీకులు పాల్గొన్నట్లు గ్రామస్తులు వివరించారు. ఈ రెవెన్యూ గ్రామ పరిధిలో 110 ఎకరాలు పట్టాభూమి, పోడు వ్యవసాయం చేస్తున్న భూమి 375 ఎకరాలు ఉంది. గ్రామంలో 300 మంది జనాభా, 204 మంది ఓటర్లు ఉన్నారు. 59 కుటుంబాలకు గానూ 58 కుటుంబాలను సర్వే చేశాము. వీరందరూ ప్రాథమిక గిరిజన తెగలకు చెందినవారే. వీరిలో రెండు కుటుంబాలు క్రైస్తవ మతస్తులు. మిగిలినవారు హిందువులు. స్త్రీ, పురుషుల సంఖ్య 150, 150 చొప్పున సమానంగా ఉంది.

### పోడు భూమి పంపిణీకి మంగళం

50 కుటుంబాలకు స్వంత భూమి ఉంది. ఎనిమిది మందికి పోడుభూమి మాత్రమే ఉంది. ఎకరం లోపు రెండు కుటుంబాలకు, ఎకరం నుండి రెండున్నర ఎకరాల వరకు కలగిన కుటుంబాలు ఐదు ఉన్నాయి. 2.50 ఎకరాల నుండి 5 ఎకరాల వరకు భూమి కలిగిన కుటుంబాలు ఇరవై ఉండగా 5 నుండి 10 ఎకరాల వరకు భూమి కలిగిన కుటుంబాలు మరో 20 ఉన్నాయి. 10 నుండి 20 ఎకరాల వరకు భూమి కలిగిన కుటుంబాలు 5 ఉన్నాయి. ఒక్క కుటుంబానికి మాత్రం 20 ఎకరాలకు పైగా భూములున్నాయి. కొండవాలులోని అడవులను నరికి, 375 ఎకరాలలో పోడు వ్యవసాయం చేస్తున్నారు. ఎత్తయిన కొండలమధ్య లోయల సానువుల్లో-ఏటవాలుగా ఉన్న చిన్న భూఖండాలను వరుసలుగా చదును చేస్తారు. ఇక్కడ వరి పండిస్తారు. ఎత్తయిన అడవిచెట్ల క్రింద వాతావరణం, భూమి కాఫీపంటకు అనువుగా ఉంది. ఐటిడిఎ ఆధ్వర్యంలో చాలాకాలం నుండి కాఫీ పంట ఎస్టేట్‌లను అభివృద్ధిచేస్తున్నారు. యన్.టి. రామారావు ముఖ్యమంత్రిగా ఉండగా మన్యంలోని గిరిజనులకు ఆ కాఫీ ఎస్టేట్‌లలో కుటుంబానికి రెండు ఎకరాల చొప్పున పట్టాలు ఇచ్చారు. అటవీహక్కుల చట్టం-2005 ప్రకారం ప్రతి గిరిజన కుటుంబానికి 10 ఎకరాల చొప్పున పోడుభూమికి పట్టాలు ఇవ్వాలి. గత కొంతకాలంగా ఈ చట్టం అమలు కావటం లేదు. 15 కుటుంబాలు సాగు చేసుకుంటున్న పోడు భూమికి పట్టాల కోసం దరఖాస్తు పెట్టి చాలాకాలంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. పట్టాలు లేకుండా బ్యాంకు

**❝ పంటల ననుసరించే ఆహారపు అలవాట్లు కూడా ఉన్నాయి. ఎక్కువమందికి వారు పండించిన వరి ధాన్యం తమ కుటుంబ అవసరాలకే చాలటం లేదు. ఉదయం రాగిముద్ద, అంబలి, స్థోమత గలవారు వరి అన్నం తింటారు. సాధారణంగా పచ్చిపుసులు, అప్పుడప్పుడు తాము పండించి అమ్ముకోగా మిగిలిన బీన్స్ ,కందిపప్పుతో పలుచటి చారు, పంటల సమయంలో పొలంలో పండిన ఆకుకూరలు చేసుకొంటారు.❞**

రుణాలు అందడం లేదు.

2004లో పర్దిగడ్డ లోయలో, రుద్ర కొండవాగుమీద చెక్‌డ్యాం నిర్మాణం జరిగింది. అన్నికాలాలలో ఈ వాగులో నీరు పారుతుంది. వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తుంది. వర్షం లేకున్నా కొండలలోని నీటి బుగ్గలనుండి ఊటనీరు వాగులోకి నిరంతరం చేరుతుంటుంది. ఈ డ్యాం నుండి కాలువల ద్వారా వేరువేరు వాలు ప్రాంతాల్లో ఉన్న భూఖండాలకు నీటిపారుదల సౌకర్యం ఉంది. ఇదే నీటిని పశువులు పక్షులతో పాటు మనుషులు తాగుతారు. ఇతర అవసరాలకు వాడుకుంటారు. ఇంత సజీవ నీటివనరువున్నా ఆ గ్రామంలో ఒక పంట వరి మాత్రమే పండిస్తారు. రెండవ పంటవేయరు. మొదటి పంట పూర్తయిన తర్వాత గ్రామస్తులంతా పశువులను స్వేచ్ఛగా వదిలేస్తారు. కాబట్టి పంటకు రక్షణ ఉండదని చెప్పారు. రెండవ పంటగా మైదాన ప్రాంతంల్లో వలే ఆరుతడి పంటలుగా వేసే మినుము,పెసర వంటి అపరాలు, పెద్దమొత్తంలో కూరగాయలు పండించే అవకాశం ఉంది. ఈ రెవెన్యూ గ్రామంలో ఇలాంటి పల్లపు భూమి చాలా పరిమితంగా (110ఎకరాలు) మాత్రమే ఉంది. గతంలో అటవీ ఉత్పత్తుల సేకరణపై ఎక్కువగా ఆధారపడేవారు. ఇటీవలి కాలంలో ఫారెస్టు డిపార్ట్‌మెంట్ పదే పదే ఆటంకాలు కలిగిస్తు న్నందున గిరిజనులు అటవీ ఉత్పత్తుల సేకరణకు పెద్దగా ఆసక్తి చూపటం లేదు.

**పురాతన పనిముట్లు**
**కుంటుపడిన వ్యవసాయం**

పాలకులు ఘనంగా ప్రకటించుకొనే 'హరితవిప్లవం' జాడలు ఇక్కడ కన్పించవు. ఆధునిక వ్యవసాయ పరికరాలు, యంత్రాలు, హైబ్రీడ్ విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగుమందులు, సూక్ష్మ పోషకాలు (మైక్రో న్యూట్రియంట్స్) వగైరాలు వీరి దరిచేరలేదు. పాతకాలపు పనిముట్లతోనే వ్యవసాయం చేస్తున్నారు. చిన్న చిన్న భూ ఖండాలలో పవర్ టిల్లర్స్ వినియోగించవచ్చు. కానీ ఎద్దులు వినియోగించి కొయ్యనాగలితోనే దున్నకం చేస్తున్నారు. అదీ సాధ్యం కానివారు పొడవాటి కట్టెకు బిగించిన పారనే భూమిని తవ్వటం, తిరగవేయటం, చదును చేయడం వంటి పనులన్నింటికీ వాడతారు. వ్యవసాయ పనులకు కుటుంబ శారీరక శ్రమే ప్రధానం. రైతులు వ్యవసాయ భూములకు తమ ఇంట్లో తయారయిన పశువుల ఎరువునే ప్రధానంగా వాడుతున్నారు. కాఫీ, రాజ్‌మా బీన్స్ వంటి వాణిజ్యపంటలకు రసాయన ఎరువులు స్వల్పంగా వాడుతున్నారు. ముతకధాన్యాల పంటకు ఏ ఎరువూ వాడరు. పంటలకు పురుగుపట్టినా, తెగుళ్ళు వచ్చినా పురుగు మందులు వాడరు. మూలికలను నీటితో కలిపి పంటపై చల్లుతారు. వరి పొలంలో అగరు బత్తీలు వెలిగిస్తారు. ఈ చిట్కా పరిష్కారాలు పురుగుమందులకు, సూక్ష్మ పోషకాలకు ప్రత్యామ్నాయం కాదు. అందుకే ఫలసాయం చాలా స్వల్పంగా ఉంది. "మా తండ్రుల కాలంలో (20 – 25 సంవత్సరాల క్రితం) ఎకరానికి 8 – 10 బస్తాలు వడ్లు పండేవి. ఇప్పుడు దిగుబడి ఐదు, ఆరు బస్తాలకు పడిపోయింది" అని చెప్పారు. వర్షాధార సాంప్రదాయ పంటలు రాగులు 1 క్వింటా, కందులు 50 కేజీలు, సజ్జ 30 కేజీలు ఎకరాకు దిగుబడి మరీ తక్కువగా ఉన్నట్లు మర్రి చిన్నయ్య చెప్పాడు. వరి, కాఫీ, బీన్స్, పసుపు వంటి వాణిజ్య పంటలు రాకముందు అటవీ ఉత్పత్తుల సేకరణపై ఎక్కువగా ఆధారపడేవారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతుల గురించి ప్రశ్నించగా ఈ విషయాలు మాకు తెలియచేప్పేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా లేరని బదులిచ్చారు.

అతివృష్టి, అనావృష్టి, తెగుళ్ళను తట్టుకొని ఎక్కువ దిగుబడినిచ్చే పలురకాల హైబ్రీడ్ వంగడాలు వీరు వినియోగించలేకపోతున్నారు. 'మార్కెట్‌లో వాటి రేటు చాలా ఎక్కువగా ఉంది. మేం అంత డబ్బు ఖర్చు పెట్టలేం. హైబ్రీడ్ విత్తనాలు వాడితే రసాయన ఎరువులు వాడాలి. అంత శక్తి మాకులేదని' రైతు పాలికి శ్రీను చెప్పాడు. రసాయనిక ఎరువులు వాడితే భూసారం తగ్గిపోతుందని ఇక్కడి రైతుల నమ్మకం. భూమిపట్టా ఉంటేనే జిసిసి లేదా పాడేరులోని వాణిజ్య బ్యాంకులు వ్యవసాయ రుణాలు ఇస్తాయి. డ్వాక్రాగ్రూపుల పొదుపు ద్వారా కొందరు కొంత రుణం పొందుతున్నారు. మిగతా వారు ఎక్కువమంది పాడేరులోని షావుకార్ల వద్ద అప్పులు చేస్తున్నారు. పండిన పంటను కూడా వారు చెప్పిన రేటుకు షావుకార్లకే అమ్మాలి. పంటలపై మిగులు ఆదాయం లేదు. స్థూలంగా చూసినపుడు ప్రభుత్వ, సహకారా పరపతి సౌకర్యాలు ఈ గూడెం దరిదాపుల్లోకి చేరలేదు.

**తరిగి పోతున్న ఆహార లభ్యత**

పంటల ననుసరించే ఆహారపు అలవాట్లు కూడా ఉన్నాయి. ఎక్కువమందికి తాము పండించిన వరి ధాన్యం తమ కుటుంబ అవసరాలకే చాలటం లేదు. ఉదయం రాగిముద్ద, అంబలి, స్థోమత గలవారు వరి అన్నం తింటారు. సాధారణంగా పచ్చిపుసులు, అపుడపుడు తాము పండించి అమ్ముకోగా మిగిలిన బీన్స్ ,కందిపప్పుతో పలుచటి చారు, పంటల సమయంలో పొలంలో పండిన ఆకుకూరలు చేసుకొంటారు. ఇంటిపెరడులో గుమ్మడికాయలు ఎక్కువగా పండిస్తారు. సంతలో


## 'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి.

మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**
'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక,
ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

అమ్ముడుపోగా మిగిలినవి ఇంట్లో వాడుకుంటారు. ఆవులు, మేకలు, కోళ్ళు ఎక్కువమంది పెంచుతున్నారు. పాడిపశువుల పాలను పూర్తిగా ఆవుదూడలు,మేకపిల్లలకే వదిలేస్తున్నారు. పాలు, మజ్జిగ, పెరుగు వాడే అలవాటు వీరికి లేదు. నెలలో ఐదు నుండి పదిరోజులు రోజులు కేవలం ఎర్రకారం పొడినే కూరగా వాడుకుంటున్నారు. ఏప్రిల్, మే మాసాలు తప్ప మిగిలిన కాలమంతా పొలంలో కష్టించి పనిచేస్తారు. మహిళలు పొలం పనితో పాటు ఇంటిపని, పిల్లలపోషణ, వంటి పనులలో తలమునకలౌతున్నారు. ఆహారం చాలక తరచూ రక్తహీనతకు గురౌతున్నారు. ఈప్రాంతంలోని మనుషుల్లో పుష్టిగా ఉండేవారు అరుదుగా ఉన్నారు. ఆడ, మగ ఎక్కువమంది పొగ తాగుతారు. నాటుసారా, జీలుగ కల్లు, బ్రాండెడ్ లిక్కర్ తాగటం ఉంది. ఇవి వారి జీవనప్రమాణాలను హరించి వేస్తున్నాయి. గతంలో గెడ్డ (వాగు) నీరు, తరువాత నుయ్యి (బావి) నీరు తాగేవారు. ఐదు సంవత్సరాల క్రితం కొవెల్ ఫౌండేషన్ సంస్థ (ఎన్‌జివో) త్రాగునీటి సదుపాయం కల్పించి కుళాయి ఏర్పాటు చేసింది. అది కూడా పాడైపోయింది. దీన్ని బాగు చేయించాల్సిన ఐటిడిఏ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించటంతో మరల నుయ్యిని ఏర్పాటుచేసుకొని నీరు తాగుతున్నారు. కొన్ని సందర్భాలలో గెడ్డనీరు త్రాగుతారు. పలు రకాల బ్యాక్టీరియా సూక్ష్మజీవులతో కూడి వుండే ఈ నీటిని తాగినవారికి మలేరియా, విషజ్వరాలు కాటేస్తున్నాయి. ఈ నీటిలోని కాలుష్యాన్ని శుద్ధిచేసేందుకు ప్రభుత్వం ఎలాంటి సహకారం అందించటం లేదు. అంత్యోదయకార్డులు ఉన్న కుటుంబాలకు బియ్యం 35 కిలోలు, చక్కెర అరకిలో, కిరోసిన్ రెండులీటర్లు ఇస్తారు. సంతలో నల్లబజారులో రేషన్‌బియ్యాన్నే కిలో 17,18 రూపాయలకు కొంటున్నారు. ఈ నల్లబజారును అరికట్టే వారు లేరు. కలుషిత నీటి ద్వారా పలు వ్యాధులు ప్రబలుతున్నాయి. రేషన్ కార్డుల కోసం 18 కుటుంబాలు సంవత్సరాల తరబడి పడిగాపులు కాస్తున్నారు. వచ్చే రేషన్ బియ్యం నెలలో సగం రోజులు కూడా చాలటంలేదు.

**కమ్ముకొస్తున్న రోగాలు**
**బక్కచిక్కిన ప్రజావైద్యం**

ఆరోగ్య సేవలు మొత్తం ఏజన్సీ ప్రాంతంలోనే దారుణంగా ఉన్నాయి. ఈగ్రామం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో మినములూరులో ఉంది. అక్కడికి బస్, ఆటో సౌకర్యం లేదు. రోగిని నడిపించుకు వెళ్ళాలి. గర్భవతులను ప్రసవం కోసం తీసుకెళ్ళాలంటే 104, 108 వాహనాలకి ఫోన్ చేయాలి. ఆసమయంలో ఖాళీగా ఉంటే వాహనం వస్తుంది. లేకుంటే ఆటోలు జీపుల కోసం ఎదురుచూడాలి. ఆలస్యం అయితే చావేగతి. పిహెచ్‌సిలో కమ్యూనిటీ హెల్త్ వర్కరు (సిడబ్ల్యుసి), ఏయన్‌యమ్ అందరూ ఒకే రకం మందులు ఇస్తారు. అందువల్ల కొత్త రకం మందులు కావాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రతిజంట ఎక్కువ సంఖ్యలో పిల్లల్ని కంటారు. కుటుంబనియంత్రణ పాటించరు. కొన్ని కుటుంబాలలో ఐదుగురు పిల్లల వరకు ఉన్నారు. గతంలో ఎక్కువ మంది మంత్రాలు, పూజలపై ఆధారపడేవారు. ఇవుడు వైద్యం చేయించుకోవడం పెరిగింది. అనారోగ్యంతో మంచంపట్టినవారు పనులు కోల్పోయి ఆర్థికంగా చితికిపోతున్నారు. పాలిక కేశవరావు 2012లో వారి అన్నగారమ్మాయిని ప్రసవం కోసం విశాఖ కెజిహెచ్‌కి తీసుకెళ్ళాడు. ఆరోగ్యశ్రీ కార్డు చూపినా సిబ్బంది పట్టించుకోలేదు. బిడ్డచనిపోయింది. ఎక్కడా అవకాశంలేక సముద్రం ఒడ్డున బిడ్డశవాన్ని పాతిపెట్టారు.

> **❝ ఈ గ్రామంలో 10 సంవత్సరాల క్రితం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఏర్పడింది. ఒకటి నుండి ఐదవ తరగతి వరకు బోధిస్తారు. ఇద్దరు టీచర్స్ ఉన్నారు. అయితే వీరు గుర్రగరువులో కాపురం ఉండటం లేదు. బయటి నుండే వస్తున్నారు. ప్రస్తుతం స్కూలులో 44 మంది పిల్లలు ఉన్నారు. పాఠశాలకు రెండు కిలో మీటర్ల దూరంలో నివాసము టున్న కొన్ని కుటుంబాల పిల్లలు గుట్టలు, తుప్పలు దాటుకుని పలు ప్రయాసలు పడి చదువుకోసం వస్తున్నారు. ❞**




ఏజెన్సీలో ప్రతి చోటా కనిపించేట్లే గుర్రగరువులో కూడా ప్రాథమిక సదుపాయాలు అధ్వాన్నంగా ఉన్నాయి. గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఇది

గ్రామంలో కురుపులు, రక్తహీనత, దగ్గు, జ్వరం వంటి సాధారణవ్యాధులు, మెదడు మలేరియా , (సెరిబ్రల్ మలేరియా) డయేరియా, విషజ్వరాలు వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తున్నాయి. కొర్రా భాస్కరరావు డయేరియా సోకి, సకాలంలో సరైన వైద్యం అందక వ్యాధిసోకిన 24 గంటల్లోనే మరణించాడు. 2013 దీపావళి నాడు గర్భవతిగా ఉన్న మఠ్రి జీవితను ఆటోలో రాత్రి 9 గంటలకు పాడేరు ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. అర్ధరాత్రి రెండు గంటలకు ఫిట్స్ వచ్చాయి. అక్కడ డాక్టర్లు లేరు. నర్సులున్నారు. వారు కెజిహెచ్‌కి (విశాఖ) తీసుకెళ్ళమన్నారు. మరునాడు ఉదయం 6గంటలకు కెజిహెచ్‌కి తీసుకెళ్ళారు. అక్కడ ఆపరేషన్ చేసి చనిపోయినబిడ్డను తీశారు. మరునాడు తల్లి కూడా చనిపోయింది. పాడేరు ప్రాంతీయ ఆసుపత్రిలో డాక్టర్లు ఉండి సరైన వైద్యంచేస్తే తల్లీబిడ్డ ఇద్దరూ బతికేవారని గ్రామపంచాయితీ వార్డుమెంబరు సూరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. వేరొకరికి చీము గడ్డ వచ్చింది. పాడేరులోని రాఘవేంద్ర హాస్పిటల్‌లో వైద్యం చేయించుకొని, ఐదువేల రూపాయల బిల్లు కట్టి బయట పడ్డారు.

**"గిరిజన పండుగలు క్యాలెండరు పద్ధతిలో ఉండవు. ఇక్కడ సంక్రాంతి పండుగను పుష్య మాసం పండుగగా జరుపుకుంటారు. పాడేరులో విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి) ఆధ్వర్యంలో ప్రతిసంవత్సరం 'వనవాసీ కళ్యాణాశ్రమం' పేర గిరిజన ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇటుక (ఇంతుల) పండుగ. దీన్ని 'హీరేయి' అంటారు."**

### అందని, అతకని విద్య

ఈ గ్రామంలో 10 సంవత్సరాల క్రితం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఏర్పడింది. 12 మంది పాఠశాలలో చేరలేదు. ఒకటి నుండి ఐదవ తరగతి వరకు బోధిస్తారు. ఇద్దరు టీచర్స్ ఉన్నారు. అయితే వీరు గుర్రగరువులో కాపురం ఉండటం లేదు. బయటి నుండే వస్తున్నారు. ప్రస్తుతం స్కూలులో 44 మంది పిల్లలు ఉన్నారు. పాఠశాలకు రెండు కిలో మీటర్ల దూరంలో నివాసముంటున్న కొన్ని కుటుంబాల పిల్లలు గుట్టలు, తుప్పలు దాటుకుని పలు ప్రయాసలు పడి చదువుకోసం వస్తున్నారు. చదువుతున్న వారిలో 11 మంది గత సంవత్సరం పాఠశాలలో చదవటం (డ్రాప్ అయ్యారు) మానివేశారు. కొందరు 4వ తరగతి పూర్తయ్యాక పాడేరు ఆశ్రమపాఠశాలలో ఐదవ తరగతిలో చేరారు. ఈ పాఠశాల ప్రాంగణం లోనే అంగన్‌వాడి కేంద్రం ఉంది. ఈ కేంద్రంలో మూడు సంవత్సరాలు దాటిన పిల్లలు ఏడుగురికి 'బాలబడి' పుస్తకంలో శిక్షణ ఇస్తారు. గతంలో ప్రతి రెవెన్యూ గ్రామంలో అనుబంధ పాఠశాల (శాటిలైట్ స్కూల్) ఉండేది. అదే తెగకు చెందిన విద్యావంతులైన యువతీ యువకులను విద్యావాలంటీర్లుగా నియమించే వారు. వారి తెగభాష 'కువీ' నుండి తెలుగు భాషను నేర్పేందుకు 'పరివర్తనా' సంస్థలు గా ఈ అనుబంధ పాఠశాలలు ఉపయోగపడేవి. ఇక్కడ శిక్షణ పొందిన పిల్లలు ప్రాథమిక పాఠశాలలో మూడవ తరగతిలో చేరేవారు. ఆర్థిక కారణాలు చూపి 2012 నుండి ఈ స్కూల్స్‌ను ప్రభుత్వం మూసివేసింది. అక్కడ చదువు చెప్పే విద్యావలంటీర్లకు ఉపాధిపోయింది. ఈ గ్రామానికి 5 కిమీ దూరం లోని మినుములూరులో హైస్కూలు వుంది. గ్రామ పాఠశాలలో 44 మంది చదువుతున్నారు. బడిలో చేరాల్సిన వయసు గల పిల్లలు 12 మంది బడిలో చేరలేదు. గ్రామ జనాభాలో 6 నుండి 10 తరగతులు చదివినవారు 62 మంది ఇంటర్ 16, పీజీ ఒక్కరు, బీఎడ్ ముగ్గురు, ఇంజనీరింగ్ ఒక్కరు. మొత్తం అక్షరాస్యులు 150 మంది, పురుషులు 100, స్త్రీలు 50 మంది ఉన్నారు.

### ఉపాధికి నోచని చదువులు
### అడుగంటిన రిజర్వేషన్స్

188 మందికి వ్యవసాయమే ప్రధాన జీవనోపాధి. వీరిలో 147 మందికి వ్యవసాయకూలీ పని రెండో ఉపాధిగా ఉంది. 55 మంది చదువుకుంటున్నారు. 27 మంది చదువుకుని నిరుద్యోగులుగా ఉన్నారు. గ్రామంలో78 జాబ్‌కార్డులున్నాయి. ఉపాధి హామీ పథకం ద్వారా 70 నుండి 100 రోజుల పని కల్పిస్తున్నారు. వారికి 100 నుండి 120 రూపాయల కూలి వస్తున్నది. ఐటిడిఎ కాఫీ తోటల్లో కలుపు తీయటం, పండ్లు ఏరటం తదితర పనులు చేసే 14 మంది కాజువల్ కార్మికులున్నారు. ఇటీవలనే వీరి వేతనం రు. 164 నుండి రు. 188కి పెరిగింది. ఎస్టేట్‌లో పనిలేనపుడు వ్యవసాయ పనులకు వెళుతుంటారు. చదువుకున్న యువత కూడా వ్యవసాయపు పనులకు వెళ్తున్నారు. ఒకరు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తుండగా ఇద్దరు వ్యవసాయ పనులు లేని సమయంలో భవన నిర్మాణ కార్మికులుగా పని చేస్తున్నారు. పాలంకి కాంతమ్మ, మర్రి సౌజన్య అంగన్‌వాడీ టీచర్‌గా, పాలంకి అనూష బాలబడి టీచర్‌గా, పని చేస్తుండగా మర్రి ఆంబ్రే ప్రధానంగా పశుపోషణపై ఆధారపడి కుటుంబం వెళ్లదీస్తున్నారు. పాలంకి రమేష్ కాఫీ ఎస్టేట్‌లో కార్మికుడిగా పని చేస్తున్నారు. ఇతనికి 100 రోజుల పాటు పని దొరుకుతుంది. "డీఎస్సీ ప్రకటించినా మెరిట్‌పోరులో మేం నెగ్గలేం" అంటూ నిరాశను వ్యక్తం చేశారు బీఎడ్ నిరుద్యోగి మర్రి నాగేశ్వరరావు.

సాంప్రదాయ విద్య తప్ప నైపుణ్యం నేర్పే వృత్తి విద్యాకోర్సుల గురించిన ఆలోచన లేదు. దాంతో స్వయంఉపాధి పథకాల ద్వారా లబ్ది పొందటానికి కూడా వీరు అనర్హులుగా మిగిలిపోతున్నారు. ఎంత చదివినా చివరకు వ్యవసాయం పని తప్పదన్న అభిప్రాయం కలగలటంతో తల్లి తండ్రులు పిల్లల చదువుల పట్ల ఆసక్తి కనపర్చటం లేదు. రిజర్వేషన్ హక్కులు పేపరుకే పరిమితం అయ్యాయి. చదువుకున్న వారు ప్రత్యామ్నాయ ఉపాధి వెతుక్కోవచ్చు కదా అని ప్రశ్నించగా "గతంలో మాలో ఇద్దరు నర్సీపట్నంలో కాంట్రాక్టరు వద్ద పని లో చేరారు. జీతం తక్కువ. ఖర్చులెక్కువ. అక్కడి వాతావరణం మా వాళ్లకు గిట్టలేదు. అందుకే వెనక్కు వచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలు మాకు రావు. ఈ ప్రకృతి, ఈ సమాజం వదిలి బయటకెళ్తే బతకలేమ"ని పలువురు నిర్వేదం వ్యక్తం చేశారు. "వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అవలంబించవచ్చు కదా?" అన్న ప్రశ్నకు మాకు ఆ పద్ధతులు ఎవరూ నేర్పలేదు. ప్రభుత్వం సహకారం కూడా మాకు లేదు అని బదులిచ్చారు. ఇది వారి నిస్సహాతకు, ప్రభుత్వ నిర్లక్ష్యానికి చిహ్నం. తగిన శిక్షణ, మార్గదర్శనం, పరపతి సౌకర్యం కల్పిస్తే అటవీ ఉత్పత్తుల ఆధారంగానే స్థానిక యువతకు పలు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని మా అధ్యయనంలో తేలింది. చదువుకున్న యువత గ్రామం వదలి బయటికెళ్లి ఉపాధులకు సిద్ధం కాలేదని, అందరూ ఆ చిన్న మడిచెక్కల్లోనే వ్యవసాయం చేస్తామంటున్నారు. మరి ఈ సమస్యకు పరిష్కారమేంటి?

### మసిబారిన గిరిజన సంస్కృతి
### భారమైన వైదిక ఆచారాలు

గిరిజన పండుగలు క్యాలెండరు పద్ధతిలో ఉండవు. ఇక్కడ సంక్రాంతి పండుగను పుష్య మాసం పండుగగా జరుపుకుంటారు. పాడేరులో విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి) ఆధ్వర్యంలో ప్రతిసంవత్సరం 'వనవాసీ కళ్యాణాశ్రమం' పేర గిరిజన ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇటుక (ఇంతుల) పండుగ. దీన్ని 'హీరేయి' అంటారు. వేసవిలో వ్యవసాయ పనులన్నీ పూర్తవుతాయి. పంటలు అమ్మకం జరిగి చేతికి డబ్బులొస్తాయి. వేసవిలో రెండు నెలల ఖాళీ సమయంలో ఇష్టమైన మాంసాహారంతో తింటూ విశ్రాంతి తీసుకోవటం ఆనవాయితీగా వస్తున్నది. ఈ కాలంలో వ్యవసాయ పనులు చేయకూడదని తెగపెద్దలు ప్రకటిస్తారు. ఒక ఇంట్లో ఆడపిల్ల పుడితే ఊరంతా పెద్ద పండుగలా జరుపుకుంటారు. గ్రామంలో చందాలు వేసుకుంటారు. ప్రతి పండుగలో గ్రామంలో దొరికే జీలుగ కల్లు

> **"ఐటిడిఏ, గిరిజన క్రెడిట్ కోపరేటివ్ సొసైటి (జిసిసి) గిరిజన ఉత్పత్తులను కొనుగోలు చేయటం తగ్గింది. ఆ బాధ్యత ప్రైవేట్ శక్తులకు వదిలేశారు. విశాఖ మన్యంలో పండే నాణ్యమైన కాఫీగింజలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. ప్రస్తుతం వ్యాపారులు రైతులనుండి కిలో 100 రూపాయలకు కొని, బెంగళూరులో 250 రూపాయలకు అమ్ముకుంటున్నారు."**

తాగేవారు. అదే కల్లును ఇప్పుడు వ్యాపార సరుకుగా అమ్ముతున్నారు. జోల్డా పండుగనాడు గ్రామంలో అడవిమొక్కలు పాతుతారు. పంటలు వచ్చాక కల్లం పండుగ (సీతలపండుగ) జరుపుకుంటారు. భూమిలో విత్తనాలు చల్లే సమయంలో విత్తనాల పండుగ చేసుకుంటారు. సాంప్రదాయకంగా పరస్పరం సహకరించుకునే సంస్కృతి క్రమంగా తగ్గుముఖం పడుతోంది.

కులాంతర వివాహాలు జరుగుతున్నాయి. పాలికి శ్రీను కోదు తెగకు చెందినవాడు. జి.కె.వీధి, దొరకొండవాసి, బగత తెగకు చెందిన కాంతమ్మతో ఇటీవల వివాహం జరిగింది. బగత గిరిజనుల్లో అగ్రవర్గం. కోదు అట్టడుగు తెగ. వీరిద్దరికీ చదువుకునేటప్పుడు పరిచయమయింది. స్నేహం ప్రేమగా మారింది. ఆమె తన తల్లితో చెప్పి శ్రీనుతో లేచి వచ్చింది. ఈ అమ్మాయిని తమ తెగలో కలుపుకోవాలి. అందుకు ఎద్దునుకోసి గ్రామస్థులకు విందుచేశారు. ఒకే కంచంలో అమ్మాయితో కలిసి గ్రామ పెద్దలు భోజనం చేశారు. రూపాయిబిళ్ల అమ్మాయినాలుకకు అంటించి ఆమెచే ప్రతిజ్ఞ చేయించారు. గతంలో పెళ్ళిళ్ళు, పండుగలలో ధింసా నృత్యం చేసేవారు. ఇప్పుడు సినిమాలకు పాడేరు వెళుతున్నారు. టివిలలో సినిమాలు, సీరియల్స్‌కి అలవాటు పడ్డారు. కోవెల్ ఫౌండేషన్ సంస్థ నీటికుళాయిలు, గ్రామంలో పొగరాని పొయ్యిలు, పైపులు అందించారు. అపుడపుడు మెడికల్ క్యాంపులు నిర్వహిస్తుంటారు. బయటి సమాజంతో పోలిస్తే ఇక్కడి గిరిజన స్త్రీలు ఎక్కువ స్వేచ్ఛగా ఉన్నారు. కుటుంబ ఆర్థిక నిర్వహణలో భాగస్వాములుగా ఉంటారు. భర్త చనిపోయిన స్త్రీ తిరిగి వివాహం చేసుకోవచ్చు. తనబిడ్డలలో సహా కొత్తకుటుంబం వారిని స్వీకరిస్తుంది. బహుభార్యత్వం కొనసాగుతున్నది. కుల వివక్ష ఉంది. వాల్మీకి కులస్తులు మధ్యాహ్నభోజనం వండితే బుగత తెగ పిల్లలు తినరు. గ్రామంలో విఆర్ఓగా వాల్మీకి కులస్తుడు ఉంటే అతనివద్ద బుగతలు కులం సర్టిఫికెట్ కూడా తీసుకోరు.

**కొండకోనల్లోకి బ్రాండెడ్ సరుకులు**
**పెరిగిన వినిమయతత్వం**

ఆదివాసీ ప్రజలు అడవిబిడ్డలు. వారిని అడవి నుంచి తోలేసేందుకు పాలకులు తొందరపెడుతున్నారు. ఆదివాసీల వద్దకే ఆధునిక నాగరికతను, సౌకర్యాలను తరలించాలి. సాంప్రదాయకంగా వాడుకొనే సరుకులు, స్థానిక ఉత్పత్తుల స్థానంలో బ్రాండెడ్, రెడీమేడ్ ప్యాక్డ్ వస్తువులతో సంతలు,



మంచినీళ్ల కోసం మహిళలు విన్యాసాలు చేయాల్సిందే

షాపులు నిండి ఉంటున్నాయి. అడవిలో దొరికే వేప, ఉత్తరేణి పుల్లల స్థానంలో కోల్‌గేట్ టూత్‌పేస్ట్, శీకాయ, కుంకుళ్లు, వాడచెట్టు కాయలు పోయి సంతూర్, సింథాల్, సుప్రియ తదితర బ్రాండు సబ్బులు, మీరా, కార్తీక షాంపూలు వగైరా వచ్చాయి. గతంలో బట్టలుతికేందుకు బూడిద కలిపిన వేడి నీళ్ల స్థానంలో సన్‌ఫ్లవర్, సర్ఫ్‌ఎక్సెల్, ఎక్టా, ఊర్వశి, కెయిన్‌డ్రాప్, డిటర్జెంట్ సబ్బులు రంగ ప్రవేశం చెశాయి. గుట్కా, సారా, బ్రాందీలు కమ్మేశాయి. 31 మందికి సెల్‌ఫోన్‌లు ఉన్నాయి. 48 ఇళ్ళకు విద్యుత్ కనెక్షన్ ఉంది. 26 కుటుంబాలకు టి.వి.లు ఉన్నాయి. కొత్త ఫంక్షన్లు వచ్చాయి. వివాహాలు ఖర్చులు పెరిగాయి. మనిషి ద్వారా పెళ్ళి కబుర్లు పంపుకునే స్థానంలో ఖరీదైన వెడ్డింగ్ కార్డులు వేయిస్తున్నారు, పందిరి, ఆకులతో పచ్చతోరణాల స్థానంలో టెంట్లు, సీరియల్ లైటింగ్ వచ్చాయి. పాడేరు నుండి వంట వారిని పిలిపించి వంటలు చేయిస్తున్నారు. టేబుల్ భోజనాలకు బాగా ఖర్చు పెడుతున్నారు. అతిథులకు, బ్రాండెడ్ బట్టలకు కొందరు 50 వేల రూపాయలకు మించి ఖర్చు చేస్తున్నారు. ఆడపిల్లలకు కట్నం 2 లక్షలు దాటింది.

**కార్పొరేట్ శక్తుల**
**కీలుబొమ్మ ఐటీడీఏ**

గిరిజన ప్రాంతాల్లో ప్రజల అభివృద్ధికి, మిగిలిన సమాజంలో వారిని అంతర్భాగం చేసే ఉద్దేశ్యంతో ఏర్పడిన సంస్థ సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ. ఆరంభం నుండీ గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని దళారుల ప్రయోజనాలు కాపాడే సంస్థగా మారింది. లేదా ఆదివాసీ హక్కుల హరించే సాధనంగా మారింది. ప్రత్యేకించి ఉదారవాద విధానాలు అమలు మొదలైన తర్వాత ఐటిడిఎ వ్యవస్థాపక లక్ష్యాలు కొండెక్కాయి. నిధులు నిండుకున్నాయి. ఉన్న కొద్దిపాటి నిధులు అవినీతిపరుల చేబుల్లో చేరుతున్నాయి. మైనర్ అటవీ ఉత్పత్తుల వాణిజ్యాన్ని అభివృద్ధి చేయటం ద్వారా గిరిజనులకు జీవనోపాధి కల్పించాల్సిన ఈ సంస్థ ఉన్న కొద్దిపాటి జీవనోపాధిని కాలరాస్తోంది. గుర్రగరువు ఆదివాసీ ప్రజల

**"అటవీహక్కుల చట్టం ప్రకారం ప్రతిగిరిజన కుటుంబానికి 10 ఎకరాల వరకు అటవీభూమికి పట్టా ఇవ్వవచ్చు. ఈ గ్రామంలో చాలాకాలంగా పోడుభూమిలో వ్యవసాయం చేస్తున్న 15 మందికి ఒక్క ఎకరానికి కూడా పట్టా ఇవ్వలేదు. దీనితో భూమి అభివృద్ధికి బ్యాంకుల నుండి రుణం పొందేందుకు అవకాశం లేకుండా పోయింది."**

సహకారబ్యాంకులో భూమితాకట్టు పెట్టుకొని 18 శాతం వడ్డీకి రుణం ఇస్తారు. పోడుభూమి చేస్తున్నా పట్టా లేకుంటే ప్రభుత్వ సంస్థలో రుణం ఇవ్వరు.

పాడేరులో వాణిజ్యబ్యాంకు, జిసిసి, డ్వాక్రాగ్రూపుల నుండి అప్పులు చేస్తున్నారు. గ్రామంలో బంధుమిత్రుల నుండి వడ్డీలేని అప్పులు తీసుకుంటారు. పాడేరు, నర్సీపట్నంలో షాహుకార్ల నుండి రెండు, మూడు రూపాయల వడ్డీకి అప్పుతెస్తారు.

విషయంలో ఐటిడిఏ పాత్ర ఇందుకు భిన్నంగా లేదు. ఈ గ్రామంలో అడవిచెట్లకింద, కొండసానువుల్లో, వర్షాధార పంటగా 1990 నుండి కాఫీ పంటను సాగు చేస్తున్నారు. ఇటీవల బీన్స్, మిరియాలు, పసుపు, అల్లం వంటి వాణిజ్యపంటలు తోడయ్యాయి. అవి కొంతమేరకు వారి కుటుంబ ఆదాయాలను పెంచాయి. వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలకు పూర్తిగా మార్కెట్‌పై ఆధార పడవలసి వస్తున్నది. అటవీఉత్పత్తుల కొనుగోళ్ల ద్వారా ఆదివాసీ ప్రజల ఆదాయం పెంపొందించాల్సిన ఐటిడిఎ చింతపండు వంటి ముఖ్యమైన ఉత్పత్తుల విషయంలో పెద్దఎత్తున అవకతవకలకు పాల్పడతున్న వైనం ఈ సర్వేలో వెల్లడైంది.

ఐటిడిఏ, గిరిజన క్రెడిట్ కోపరేటివ్ సొసైటి (జిసిసి) గిరిజన ఉత్పత్తులను కొనుగోలు చేయటం తగ్గింది. ఆ బాధ్యత ప్రైవేట్ శక్తులకు వదిలేశారు. విశాఖ మన్యంలో పండే నాణ్యమైన కాఫీగింజలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. ప్రస్తుతం వ్యాపారులు రైతులనుండి కిలో 100 రూపాయలకు కొని, బెంగళూరులో 250 రూపాయలకు అమ్ముకుంటున్నారు. వ్యాపారులంతా కూటమిగా ఏర్పడి గిరిజన రైతాంగం నోట్లో మన్నుకొడుతున్నారు. పాడేరులోని జిసిసి 2012–2013 లో ఏడుకోట్ల రూపాయలు ఖర్చుచేసి, ఒరిస్సాలోని ప్రైవేటు వ్యాపారుల నుండి నాణ్యతలేని చింతపండు కిలో 18 రూపాయలకు కొన్నారు. తర్వాత దాని ధర కిలో 12 రూపాయలకు పడిపోయింది. ఇంత భారీమొత్తంలో చింత పండు కొనుగోలుకు నిధులు వినియోగించి, మిగిలిన అటవీ ఉత్పత్తులు కొనకుండా చేతులెత్తేశారు.

గిరిజనుల వ్యవసాయోత్పత్తులకు కనీస గిట్టుబాటు ధర కల్పించాల్సిన ఐటిడిఎ, గిరిజన సహకార సంస్థలు వ్యాపారుల కొమ్ము కాయటంతో గిరిజనులు నామమాత్రపు ధరలకే తమ ఉత్పత్తులు అప్పులిచ్చిన షావుకార్లకు అమ్ముకోవాల్సి వస్తోంది. ఇక్కడ ప్రధానమైన



గిరిజనుల్లో కూడా టివీ ఎంతగా చొచ్చుకుపోయిందో తెలిపే చిత్రమిది

వాణిజ్య పంట కాఫీ. కిలో కాఫీ గింజలు 2013లో రు. 110 ఉంటే 2014 నాటికి రు. 65కి పడిపోయింది. మిరియాల ధర కిలో రు. 360 నుండి రు. 300కి పడిపోయింది. వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరలు పెరగనీయకుండా అడ్డుకుంటున్నారని స్థానికులు చెప్పారు. అదే గ్రామంలో ఎరువులు డీఏపీ బస్తా రు.500 నుండి రు.1200 లకు, యూరియా బస్తా రు.350 నుండి రు.400 కు పెరిగాయి.

### అప్పుల్లో గిరిజన ప్రజ

గ్రామంలోని మూడు నాలుగు కుటుంబాలు తప్ప అందరూ అప్పుల ఊబిలో ఉన్నారు. పావలావడ్డీ ఈగ్రామంలో అమలు కావటంలేదు. పాలకి చంటి కాఫీపంటకోసం 2,10,000 రూపాయలు వాణిజ్యబ్యాంకులో అప్పుచేశాడు. కోన సన్యాసిరావు 26,000 రూపాయలు, మర్రి చిన్నయ్య 16,500 రూపాయలు షాహుకారు వద్దనుండి అప్పు తీసుకున్నారు. పాలికి శ్రీను పిల్లల చదువుకోసం 16,000 రూపాయలు డ్వాక్రా గ్రూపు నుండి అప్పు చేశాడు. కొర్రా మహేశ్వరరావు ఇల్లు కట్టుకోవటానికి, కాఫీతోట తాకట్టుపెట్టి 30,000 రూపాయలు అప్పుతెచ్చాడు. పాడేరు పండినపంటలను ఈషాహుకార్లకే అమ్మటం,వారు కాటాలలో మోసాలు చేయటం, రైతులు వారిచ్చిన ధర పుచ్చుకోవటం, ఆనవాయితీగా మారింది. గ్రామంలో ఐదు డ్వాక్రా గ్రూపులున్నాయి. ప్రతికుటుంబం నుండి డ్వాక్రాగ్రూపులలో సభ్యులుగా ఉన్నారు. డ్వాక్రా గ్రూపుల ద్వారా అప్పు తీసుకొని నెలనెలా క్రమం తప్పకుండా చెల్లింపులు చేస్తున్నారు. గ్రూపుల ఏర్పాటు, నిర్వహణ, చర్చల ప్రక్రియ వారిలో ప్రజాతంత్ర పద్ధతిని పెంచుతున్నది. భూమిలేని వ్యవసాయ కార్మికులు ఐదుగురు ఉన్నారు. గ్రామంలో ఇటీవలే కూలిరేట్లు 50 నుండి 60 రూపాయలకు పెరిగాయి. ఐటిడిఏ కాఫీ ఎస్టేట్‌లో రోజుకూలి 165 రూపాయలు. అదే పనికి గ్రామంలో 60 రూపాయలు మాత్రమే ఇస్తారు.

### పోలీస్ నిఘా – నిర్బంధ నీడలు

అటవీహక్కుల చట్టం ప్రకారం ప్రతిగిరిజన కుటుంబానికి 10 ఎకరాల వరకు అటవీభూమికి పట్టా ఇవ్వవచ్చు. ఈగ్రామంలో చాలాకాలంగా పోడుభూమిలో వ్యవసాయం చేస్తున్న 15 మందికి ఒక్క ఎకరానికి కూడా పట్టా ఇవ్వలేదు. దీనితో భూమి అభివృద్ధికి

బ్యాంకుల నుండి రుణం పొందేందుకు అవకాశం లేకుండా పోయింది. ముఖ్యంగా బాక్సయిట్ నిక్షేపాలు కార్పొరేట్ సంస్థలకు మైనింగ్ కోసం లీజులకిచ్చే క్రమంలో గిరిజనుల పోడు భూమికి పట్టాలివ్వడాన్ని ప్రభుత్వం ఆపేసింది. పాడేరులో యూనిఫారంలో ఉన్న పలురకాల పారామిలిటరీ దళాలు తుపాకులు పట్టుకొని బస్టాండ్లు, సంతలు, ప్రభుత్వ కార్యాలయాలు, జనంచేరే ప్రతిచోట మోహరించి ఉండటం అక్కడి శాంతిభద్రతల దుస్థితికి అద్దంపడుతున్నది. ఉగ్రవాదులకు సహకరిస్తున్నారని పోలీసులు అమాయకులైన గిరిజనులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు. పోలీసులకు సమాచారం అందిస్తున్నారంటూ ఇన్‌ఫార్మర్లనే పేరుపెట్టి నగ్జల్స్, ఉగ్రవాదులు కాల్చి చంపుతున్నారు. గిరిజనులు అడకత్తెరలో పోకచెక్కలా అభద్రతా భావంతో బిక్కుబిక్కుమంటూ బతుకులీడుస్తున్నారు.

ఒకవైపు బాక్సయిట్ తవ్వకానికి గుంటకాడనక్కల్లా సమయంకోసం వేచిచూస్తున్న కార్పొరేట్ సంస్థల ఏజంట్లు, కాంట్రాక్టర్లు, షావుకార్లు, వడ్డీవ్యాపారులు, వారితో కుమ్మక్కయిన పాలకపార్టీల నేతలు, అవినీతి ఉన్నతాధికారుల బృందం ఏజన్సీని తమ ఇష్టారాజ్యంగా దోపిడీచేస్తున్నారు. వారిఆస్తులు కొండల్లాగా పెరుగుతున్నాయి. ఏజన్సీలో వీరు చెప్పిందే వేదం. చేసిందే శాసనం. మార్గదర్శకత్వం, సంఘీభావం కోసం ఎదురుచూస్తున్న గిరిజనులకు పలు సంఘాలు, సంస్థలు, శక్తులు మద్దత్తు తెలుపుతూ వారి మధ్యకు వెళుతున్నాయి. వాటిలో తెగల మధ్య విద్వేషాలను పెంచే శక్తులు, మతోన్మాదం, తీవ్రవాదం వంటివాటిని పెంచిపోషించే శక్తులు ఉంటున్నాయి. ఈశక్తులను అదుపుచేయడం పేర ప్రజల ఐక్యతను, వారి ప్రతిఘటనాశక్తిని విచ్ఛిన్నం చేయటం కోసం శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో ప్రభుత్వం పారామిలిటరీ బలగాలను మోహరిస్తున్నది. ఈ ప్రాంతంలో వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల అభివృద్ధి ద్వారానే గిరిజనుల ఆర్థిక, రాజకీయ, ప్రజాస్వామిక హక్కులను రక్షించటం సాధ్యం అవుతుంది.

**"పాడేరులో యూనిఫారంలో ఉన్న పలురకాల పారామిలిటరీ దళాలు తుపాకులు పట్టుకొని బస్టాండ్లు, సంతలు, ప్రభుత్వ కార్యాలయాలు, జనంచేరే ప్రతిచోట మోహరించి ఉండటం అక్కడి శాంతిభద్రతల దుస్థితికి అద్దం పడుతున్నది. ఉగ్రవాదులకు సహకరిస్తున్నారని పోలీసులు అమాయకులైన గిరిజనులపై అక్రమ కేసులు బనాయి స్తున్నారు. పోలీసులకు సమాచారం అందిస్తున్నారంటూ ఇన్‌ఫార్మర్లనే పేరుపెట్టి నగ్జల్స్, ఉగ్రవాదులు కాల్చి చంపుతున్నారు."**

# 'ప్రకృతి గతితర్కం' పరిచయం

(20వ పేజీ తరువాయి)

ఆవిర్భవించవచ్చు. మరికొన్ని మరింత వెలుగు సంతరించుకోవచ్చు అని ఖగోళ శాస్త్రజ్ఞులు లెక్కలు కట్టి చెబుతున్నారు. మన గ్రహాలు ఈ సూర్యుడి చుట్టూ తిరుగుతున్నట్లే, సూర్యగ్రహం కూడా మనకు కనబడే విశ్వంలో తిరుగుతున్నది. ఈ విశ్వం అంతా అంతరిక్షంలోని ఇతర విశ్వాలతో సమాంతర ఆకర్షణ శక్తితో తిరుగుతూ ఉంటుందని, ఇవన్నీ పరస్పర ఆకర్షణతో అంతరిక్షంలో గిరికీలు కొడుతున్నాయని తేల్చి చెబుతున్నారు. అంతరిక్షంలో అన్నిచోట్ల ఉష్ణోగ్రతలు ఒకేస్థాయిలో లేవని ఇప్పటికే చాలామంది చెబుతున్నారు. చివరిగా మనం తేల్చుకోవాల్సింది ఏమిటంటే ఏదో స్వల్ప మినహాయింపులు మినహా ఈ విశ్వంలో ఉన్న అసంఖ్యాకమైన సూర్యుల వేడిమి అంతరిక్షంలోకి అదృశ్యమైపోయినా అంతరిక్ష ఉష్ణోగ్రతను ఒక సెంటీగ్రేడు డిగ్రీలో లక్షవవంతు కూడా పెంచలేదు.

మరయితే అంతటి వేడిమి ఏమైపోయినట్టు? విశ్వాంతరాళాన్ని వెచ్చచేసే ప్రయత్నంలో ఆవిరయి పోయిందా? ప్రాక్టికల్‌గానే అంతటి ఉష్ణం అదృశ్యమైపోయిందా? కేవలం సైద్ధాంతికంగా మాత్రమే ఉనికిలో ఉందా? చలనానికి నాశనం ఉండదనే సూత్రం ప్రకారం పై సందేహాలకు అసలు తావు ఉండకూడదు. భారీ శకలాలు ఒకదానితో ఒకటి ఢీకొని పతనమవుతూ యాంత్రిక చలనం ఉష్ణంగా మారి విశ్వంలోకి వికిరణం చెందుతుంది. పదార్థశక్తి అవిచ్ఛిన్నమైనది అయినట్లే చలనంకూడా అవిభాజ్యమైనది. కాబట్టి మనం ఏం భావించవచ్చు అంటే – విశ్వంలోకి వికిరణం చెందిన ఉష్ణోగ్రత మరో (పదార్థ) చలన రూపం తీసుకోవచ్చు. అలా చలన రూపంలో నిల్వ ఉన్న ఉష్ణం చల్లారిన సూర్య గ్రహాల్లో తిరిగి వేడిమిని పుట్టించవచ్చు. ఈ అంశాన్ని భవిష్యత్ పరిశోధనలు శాస్త్రీయంగా నిగ్గు తేల్చాల్సివుంది.

ఈ అనంత విశ్వంలో అనేకానేక ప్రపంచాలు ఉన్నాయనే అంచనా ప్రకారం ఈ ప్రపంచం నాశనమైనా తిరిగి పునరుద్భవిస్తూనే ఉంటుంది. ఇది అనంతకాలం పాటు కొనసాగుతూనే ఉంటుంది అంటాడు జె.డబ్ల్యు.డ్రేపర్. పదార్థ చలనం అనేది వర్తులం రూపంలో అనంతంగా కొనసాగుతుంటుంది. ఈ వర్తులం ఒక కక్ష్యలో పరిభ్రమణం కావించడానికి ఎన్ని కాంతి సంవత్సరాలు పడుతుంది అనేది ఇప్పటికయితే సరైన అంచనా లేదు. ఈ వర్తులకాలంలో ఒక దశలో అత్యున్నతస్థాయి అభివృద్ధి కారణంగా సేంద్రియ జీవం ఏర్పడి జీవం పట్ల, ప్రకృతి పట్ల చైతన్యాన్ని సంతరించుకుంది. సూర్యుడు, నక్షత్ర ధూళి (నెబ్యూలా), ఏకకణజీవి, బహుకణ జీవి. రసాయన సంయోగ వియోగాలు అన్నీ... ఏదీ అనంతమైనది కాదు, కానీ అనంతంగా మార్పులకు లోనవుతూనే ఉంటాయి. పదార్థం అనేది చలన సూత్రాల ప్రకారం చలిస్తుంది. మార్పుకు లోనవుతుంటుంది. ఒక సౌర వ్యవస్థలో అదీ ఒకే ఒక్క గ్రహం మీద సేంద్రియ జీవాభివృద్ధికి తగిన పరిస్థితులు ఉన్నాయి. అనేక జీవాలు పుట్టి గిట్టే క్రమంలో మానవుడి మెదడు అభివృద్ధి చెందింది. ఈ మొత్తం పరిణామ క్రమం అంతా చివరికి అంతమై తీరుతుంది. కాని పదార్థం మాత్రం మిగులుతుంది. పదార్థం అనేక రూపాల్లోకి మార్పులు చెందినా దాని లక్షణాలు మాత్రం కోల్పోదు. అందుకే ఈ భూమి అంతరించిపోయినా, ఆలోచనా జ్ఞానం కలిగిన మానవజాతి అంతరించిపోయినా తిరిగి ఎప్పుడో ఒకప్పుడు ఇదే పరిణామ క్రమం పునరావృతం కాక మానదు.

**(అనువాదం : సత్యరంజన్)**

అంతర్జాతీయం

# పశ్చిమాసియాలో తీవ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న అమెరికా



రచయిత పశ్చిమాసియా పరిణామాల విశ్లేషకుడు. అంతర్జాతీయ రాజకీయ పరిణామాలపై అనేక పుస్తకాలు రాశారు

విజయ ప్రసాద్

ఇరాక్‌పై అమెరికా సాగించిన చట్టవిరుద్ధమైన యుద్ధపు వినాశకరమైన ఫలితాలు ఇస్లామిక్ స్టేట్ రూపంలో లిబియా, సిరియా, ఎమెన్‌లలో కనిపిస్తున్నాయి. యుద్ధాన్ని అంతం చేయటం, ఈ ప్రాంతంలోని దేశాల మధ్య శాంతి ఒప్పందాలు మాత్రమే ఇస్లామిక్ స్టేట్ పెరుగుదలను నిరోధించగలుగుతాయి.

సిరియా రాజధాని డమాస్కస్‌లోగాని, లిబియా రాజధాని ట్రిపోలీలోగానీ, ఎమెన్ రాజధాని సనాలోగానీ అమెరికా రాయబార కార్యాలయాలు ఉండే స్థితి లేదు. అమెరికా ప్రభుత్వం తీవ్రవాదంపై చేస్తున్న యుద్ధం పరిణామాలను ప్రధానంగా ఈ మూడు దేశాలు అనుభవిస్తున్నాయి. పది సంవత్సరాల క్రితం తీవ్రవాదంపై యుద్ధం ఈ ప్రాంతంలో విజయం సాధించినట్లే అనిపించింది. 'పోరాడుతున్న శతృవులను' జైళ్ళలో నిర్బంధించటంలోనూ, వారిని చిత్రహింసలు పెట్టటంలోనూ లిబియా, సిరియాలు రెండూ పశ్చిమదేశాలతో కలిసి చురుకైన పాత్రను నిర్వహించాయి. ట్రిపోలీలోని అబుసలీమ్ జైలు, డమాస్కస్‌లోని ఫార్ ఫలాస్టిన్ జైలు ఈ ఖైదీలలో అనేకమందికి స్వంత ఇళ్ళలాగా మారిపోయాయి. అరేబియన్ ద్వీపకల్పంలో ఎమెన్ ఆల్‌ఖైదాకు కేంద్రం కావటంతో ఈ మధ్యకాలంలో కొంత ఆందోళనకు కారణమైంది. పోలీసులు వెంటాడటం, సైనికదాడులనూ కలిపి జరపటం ద్వారా 2002 నాటికి ఆల్‌ఖైదాను ఈ ప్రాంతంలో దాదాపుగా తుడిచిపెట్టారు.

2003లో అమెరికా ఇరాక్‌పై దురాక్రమణ చేసింది. ఇరాక్‌పై దురాక్రమణకు పాల్పడవద్దని ప్రజలు చేసిన వత్తిడిని అమెరికా అధ్యక్షుడు జార్జి వాకర్‌బుష్ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇటువంటి దాడులు ఈ ప్రాంతంలో అస్థిరతను పెంచుతాయని ఐక్యరాజ్యసమితి అనేకసార్లు చేసిన హెచ్చరికలు చెవిటివాని ముందు శంఖం ఊదిన చందమైనాయి. 2002లో అమెరికా ఉపాధ్యక్షుడు డిక్‌చెనీ సద్దాం హుస్సేన్ నాయకత్వంలోని బాత్‌పార్టీకి (జిహాద్) పవిత్రయుద్ధం ప్రకటించిన గ్రూపులతో సంబంధాలున్నాయనే తప్పుడు ప్రచారాన్ని ప్రారంభించాడు. అమెరికా సద్దాం హుస్సేన్‌ను అధికారం నుండి కూలద్రోసినట్లయితే ఈ ప్రాంతంలోని పవిత్రయుద్ధం ప్రకటించిన గ్రూపులు తమ జిహాద్ వ్యూహం గురించి పునరాలోచనలో పడతాయని విదేశీయుద్ధాల్లో పాల్గొని వచ్చిన అమెరికా సైనికులకు డిక్‌చెని చెప్పాడు. ఈ ప్రాంతంలో ఉన్న అభ్యుదయ వాదులంతా ఈ ప్రకటనను స్వాగతించారు. అమెరికా ఇరాక్‌పై దురాక్రమణకు పాల్పడి ఆదేశాన్ని ఆక్రమించిన తర్వాత ఇందుకు పూర్తి భిన్నంగా జరిగింది. అమెరికా ఇరాక్‌ను ఆక్రమించటం ఈ ప్రాంతంలో నిస్తబ్దంగా ఉన్న జిహాదీ గ్రూపులకు బహిరంగంగా కార్యకలాపాలు నిర్వహించే అవకాశం కల్పించింది. ఏక పార్టీ పాలన ఉన్న దేశాలన్నింటిలోనూ పాలకులు, జిహాదీ గ్రూపులు అభ్యుదయకర మార్పులన్నింటిని వ్యతిరేకించారు. తమ పాలనను కూలద్రోయటానికి అమెరికా ప్రోత్సాహంతో ఇవి జరుగుతున్నాయని వారు భావించారు. ఎమెన్‌లోని జైళ్ళు ఆల్‌ఖైదాకు పునర్జన్మనివ్వగా, ఇరాక్‌లోని యుద్ధక్షేత్రాలు వారికి పోరాట అనుభవాలను నేర్పాయి. ఈ అనుభవాలతో వారు ఎమెన్‌కు తిరిగి వచ్చారు.

గతంలో చెచెన్యా నుండి ఆఫ్ఘనిస్థాన్ వరకు పవిత్రయుద్ధాల్లో పాల్గొన్న లిబియా, సిరియాలలోని తీవ్రవాదులు ఇరాక్‌లోకి వచ్చారు. కంబాటింగ్ టెర్రరిజం సెంటర్ ఎట్ వెస్ట్ పాయింట్ సంస్థ "ఆల్‌ఖైదాస్ ఫారిన్ ఫైటర్స్ ఇన్ ఇరాక్" అంశంపై 2007లో నిర్వహించిన అధ్యయనంలో ఇరాక్‌లో పోరాటంలో పాల్గొంటున్న విదేశీయులలో ఎక్కువ మంది సౌదిఅరేబియా, లిబియా, సిరియా, ఎమెన్‌ల నుండి వచ్చారని స్పష్టమైంది. 2011 నాటికి ఈ జిహాదీ గ్రూపులలోని వారు వారి స్వదేశాలకు తిరిగి వెళ్ళారు. ఆల్‌ఖైదాలోని ముఖ్యమైన నాయకులు మెఘ్రబ్, లిబియాలో అన్సర్ ఆల్‌షరియా, అరేబియన్ ద్వీపకల్పంలో ఆల్‌ఖైదా, సిరియాలోని జబ్బాత్ ఆల్ నుస్రా తదితర సంస్థలను ఏర్పాటు చేశారు. ఆఫ్ఘనిస్థాన్‌లో జిహాదీ గ్రూపులు సాగించిన పవిత్రయుద్ధం ఇంతకు ముందు తరానికి అనుభవాన్ని, పేరుప్రతిష్ఠలను సంపాదించిపెట్టగా, కొత్తగా ఈ గ్రూపులలోకి వచ్చినవారికి ఇరాక్ పోరాటం రాజకీయ అనుభవాన్నిచ్చింది. వారికి వివిధ సంస్థలతో సంబంధాలు ఏర్పడ్డాయి.

### ఐక్యరాజ్యసమితి అంచనా

అమెరికా ఇరాక్‌పై దాడిచేసి, దురాక్రమణ చేయటం వలననే ఇస్లామిక్ స్టేట్ (ఐయస్) ఉనికిలోకి వచ్చిందని ఐక్యరాజ్యసమితిలోని అనుభవజ్ఞులైన అధికారులు గతకొంతకాలం నుండి చెపుతున్నారు. కోఫీ అన్నన్ ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శిగా ఉన్నపుడు పశ్చిమదేశాలపై ఆయన చేసిన విమర్శలను గురించి పెద్దగా తెలియనప్పటికీ ఇరాక్‌పై యుద్ధం అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకమైనదని ఆయన చెప్పాడు. 2003లో దురాక్రమణకు సన్నాహాలు జరుగుతున్నపుడు ఈ విషయాన్ని బహిరంగంగా చెప్పకుండా 2004 సెప్టెంబరు వరకు వేచిచూశాడు. ఇరాక్‌పై యుద్ధానికి సన్నాహాలు జరుగుతున్న సమయంలో ఆ యుద్ధంతో సన్నిహిత సంబంధాలు, ఆ తర్వాత ప్రారంభించిన మానవతావాద సహాయ

కార్యక్రమాలు ఐక్యరాజ్యసమితిలో ఇబ్బందికర పరిస్థితిని కల్పించాయి. పశ్చిమదేశాలతో సన్నిహిత సంబంధాలు పశ్చిమాసియాలో ఉన్న ఐక్యరాజ్యసమితి అధికారులందరికీ ఆందోళన కలిగించాయి. ఈ యుద్ధం యొక్క దురాక్రమణ స్వభావాన్ని గురించి కోఫీఅన్నన్ బహిరంగంగా ఎక్కువగా చెప్పలేదు. 2003 ఆగస్ట్‌లో ఇరాక్‌లో జరిగిన ట్రక్‌బాంబు ప్రమాదంలో ఇరాక్‌లోని కోఫీఅన్నన్ ప్రత్యేక ప్రతినిధి సెర్గియోవీరా డి మెల్లో మరణించాడు. ఈ బాంబు పేలుడును జోర్డానియన్ తీవ్రవాద నాయకుడైన అబుముసావీ అల్ జర్ఖావి నాయకత్వంలోని ఆల్‌ఖైదా ఇరాకీ విభాగం నిర్వహించింది. ఈ దెబ్బ నుండి కోలుకోవటానికి ఐక్యరాజ్యసమితికి దీర్ఘకాలం పట్టింది. సంవత్సరం తర్వాత అన్నన్ ఈ యుద్ధం ఐక్యరాజ్యసమితి నిబంధనలకు అనుగుణంగా జరగటం లేదని, ఇది చట్టవ్యతిరేకమైనదని బిబిసికి చెప్పాడు.

ఈ సంవత్సరం ఫిబ్రవరి ప్రారంభంలో అన్నన్ తన విమర్శను మరింత తీవ్రం చేశాడు. ఇరాక్‌పై దురాక్రమణ చేయాలనే దురదృష్టకరమైన నిర్ణయం, దురాక్రమణ ప్రారంభమైన తర్వాత తీసుకున్న నిర్ణయాలతో మరింత తీవ్రమైన ఫలితాలకు దారితీసింది. "ఇతర అంశాలతోపాటు రక్షణదళాలను మొత్తంగా రద్దుచేయాలనే నిర్ణయం వందలు, వేలసంఖ్యలో సుశిక్షితులైన సైనికులు, పోలీసులలో నిరాశానిస్పృహలను నింపి వీధులలోకి నెట్టింది. ఆతర్వాత ఏర్పడిన అనిశ్చిత పరిస్థితి సున్నీ తీవ్రవాద గ్రూపుల అభివృద్ధికి దోహదం చేసింది. ప్రస్తుతం వారంతా ఇస్లామిక్ స్టేట్ ముద్ర ఉన్న సంస్థల చుట్టూ సమీకృతం అయ్యారు."

కోఫీఅన్నన్ తర్వాత ఐక్యరాజ్యసమితి సీనియర్ దౌత్యవేత్త లక్దర్ బ్రహిమి సిరియాకు ఐక్యరాజ్యసమితి, అరబ్‌లీగ్‌ల ప్రతినిధిగా పనిచేస్తున్నాడు. గతంలో ఆఫ్ఘనిస్థాన్, లెబనాన్‌లలో పోరాటంలో పాల్గొంటున్న ప్రత్యర్థి గ్రూపులను దూరంగా ఉంచాలని అగ్రదేశాలు ప్రయత్నం చేస్తుంటే ఆయన జోక్యం చేసుకొని, వారిని ఒకచోటికి తీసుకురావటానికి ప్రయత్నం చేశాడు. ఆయన తన స్వదేశమైన ఆల్జీరియాలోని ఫిక్రాలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ "ఇస్లామిక్ స్టేట్ ఉనికిలోకి రావటానికి అమెరికా నాయకత్వంలో ఇరాక్‌పై జరిగిన దురాక్రమణే కారణమనటంలో ఎటువంటి సందేహం లేదు. ఇరాక్‌పై జరిగిన దాడిని ఏవిధంగానూ సమర్ధించలేం. ఆదాడియొక్క దుష్ఫలితాలను అందరం అనుభవిస్తున్నాం" అనిచెప్పాడు.

**"సిరియాలో శాంతికి అతితక్కువ అవకాశాలు కనిపిస్తున్నాయి. సిరియాకు ఐక్యరాజ్యసమితి ప్రతినిధిగా వచ్చిన స్టఫాన్ డి మిస్తురా శత్రుబలగాల ముట్టడిలో ఉన్న అలెప్పోలో పోరాటంలో పాల్గొంటున్న గ్రూపుల మధ్య తాత్కాలిక రాజీకోసం ప్రయత్నిస్తుండగా, ఆయన చుట్టూ ఉన్న బలగాలే పోరాటాన్ని కొనసాగిస్తున్నాయి."**



అమెరికా మద్దతుతో సిరియాలో ఐఎస్ఐఎస్ తీవ్రవాదుల బాంబుదాడి

### అదేదారిలో ముందుకు పోతున్నారు

ఈ దురాక్రమణ పరిణామాలు అత్యంత దారుణంగా ఉన్నాయి. ఎమెన్‌లో అంతర్యుద్ధం జరుగుతున్న పరిస్థితి ఉంది. ఫిబ్రవరిలో హౌథి తిరుగుబాటుదారులు ఉత్తరప్రాంతంలోని తమ స్థావరాల నుండి రాజధానిలోకి వచ్చి ప్రభుత్వాన్ని కూలద్రోశారు. అధ్యక్షుడు అలీ అబ్దుల్లా సలేహ్ 2004లో టెర్రరిజంపై యుద్ధాన్ని తన వ్యతిరేకులపై సాగించాలని నిర్ణయించే వరకు గిరిజన తెగకు చెందిన ఈ తిరుగుబాటుదారులు ప్రభుత్వంతో సన్నిహిత సంబంధాలనే కొనసాగించారు. సలేహ్ ప్రభుత్వం హౌథిల నాయకుడ్ని చంపటంతో ఎమెన్ ఉత్తరప్రాంతంలో మరో యుద్ధరంగం ప్రారంభమైంది. ఇది తూర్పుప్రాంతంలోని ఎడారిప్రాంత పట్టణాలైన జార్, అల్ హసన్‌లలో ఆల్‌ఖైదా పెరుగుదలకు అవకాశం కల్పించింది. హౌథిలు ఆల్‌ఖైదాను వ్యతిరేకిస్తారు. అయినప్పటికీ సలేహ్ అమెరికా అందజేసిన ఆయుధాలను వారికి వ్యతిరేకంగా వినియోగించాడు. కొద్దిపాటి అసూయలు, ప్రాంతీయ రాజకీయ ఘర్షణలు ఎమెన్‌ను తీవ్ర అస్థిర పరిస్థితులలోకి నెట్టాయి.

సిరియాలో శాంతికి అతితక్కువ అవకాశాలు కనిపిస్తున్నాయి. సిరియాకు ఐక్యరాజ్యసమితి ప్రతినిధిగా వచ్చిన స్టఫాన్ డి మిస్తురా శత్రుబలగాల ముట్టడిలో ఉన్న అలెప్పోలో పోరాటంలో పాల్గొంటున్న గ్రూపుల మధ్య తాత్కాలిక రాజీకోసం ప్రయత్నిస్తుండగా, ఆయన చుట్టూ ఉన్న బలగాలే పోరాటాన్ని కొనసాగిస్తున్నాయి. ఇస్లామిక్ స్టేట్ బలగాలను ఎదుర్కోవటం కోసం ఈ సంవత్సరం 5000ల మంది సిరియా తిరుగుబాటుదారులకు టర్కీ, లేక పర్షియన్ గల్ఫ్ దేశాలలో శిక్షణ ఇస్తామని అమెరికా, టర్కీలు ప్రకటించాయి. ఈ తిరుగుబాటుదారులు సిరియా ప్రభుత్వ బలగాలతో కూడా పోరాడటానికి అధికారం ఇస్తామని సూచనలు చేస్తున్నారు. ఒట్టోమన్ సామ్రాజ్య స్థాపకుని పూర్వీకుడైన సులేమాన్ షా సమాధిని తరలించుకు వెళ్ళటానికి ఫిబ్రవరి 21న టర్కీ సైన్యాలు సిరియాలోకి ప్రవేశించాయి. మరోవైపున సిరియా ప్రభుత్వ సైన్యాలు అలెప్పో ముట్టడిని కొనసాగిస్తూనే,

**"లిబియా అంతటా ఇస్లామిక్ స్టేట్ బలంగా నిలదొక్కుకొనే ప్రయత్నాలలో ఉంది. లిబియాలోని జిహాదీ సంస్థలు ఆఫ్ఘనిస్థాన్, చెచెన్యా, ఇరాక్, ఈ మధ్యకాలంలో సిరియాలో పోరాటాల్లో పాల్గొన్న అనుభవజ్ఞులైన పోరాటయోధులతోపాటు విదేశీ పోరాటయోధులను, అన్సర్ అల్ షరియా గ్రూపులో చేరి నిరాశానిస్పృహల్లో ఉన్న ఇస్లామిస్టులను, మౌమ్మార్ గడాఫీ కాలంలోని పోలీసులను, సైనికులను తమ గ్రూపులలో చేర్చుకొంటున్నారు."**

టర్కీకి సరఫరా మార్గాలను మూసివేయటానికి దాడులు చేస్తున్నాయి. ఆల్‌ఖైదా అనుబంధ సంస్థ అయిన జబాత్ అల్ నుస్రా కొద్దిరోజుల క్రితం ఆక్రమించుకున్న హ్రేటన్, రిట్యాన్ పట్టణాలను తిరిగి ఆక్రమించుకోవటానికి చేస్తున్న దాడుల్లో సాధారణ పౌరులు మరణిస్తున్నారు. జబాత్ అల్ నుస్రా, దాని మాతృసంస్థ అయిన ఇస్లామిక్ స్టేట్ మధ్య సంబంధాలను గురించి నిర్దిష్టంగా చెప్పగల పరిస్థితి లేదు. ఒకప్రాంతంలో ఆ రెండూ పరస్పరం పోరాడుకొంటుండగా, మరోప్రాంతంలో అత్యంత సన్నిహితంగా ఉంటున్నాయి.

లిబియా అంతటా ఇస్లామిక్ స్టేట్ బలంగా నిలదొక్కుకొనే ప్రయత్నాలలో ఉంది. లిబియాలోని జిహాదీ సంస్థలు ఆఫ్ఘనిస్థాన్, చెచెన్యా, ఇరాక్, ఈ మధ్యకాలంలో సిరియాలో పోరాటాల్లో పాల్గొన్న అనుభవజ్ఞులైన పోరాటయోధులతోపాటు విదేశీ పోరాటయోధులను, అన్సర్ అల్ షరియా గ్రూపులో చేరి నిరాశానిస్పృహల్లో ఉన్న ఇస్లామిస్టులను, మౌమ్మార్ గడాఫీ కాలంలోని పోలీసులను, సైనికులను తమ గ్రూపులలో చేర్చుకొంటున్నారు. దీర్ఘకాలం నుండి లిబియాలోని ఇస్లామిస్ట్ సంస్థలకు బలాన్ని సమకూర్చుతున్న తూర్పుప్రాంతంలోని డెర్నా పట్టణం వలెనే గడాఫీ స్వస్థలం సిర్తే పట్టణం కూడా వారి చేతుల్లోనే ఉన్నది. లిబియాలో అధికారంలో ఉన్న రెండు ప్రభుత్వాలు, ముస్లీం బ్రదర్‌హుడ్ మద్దత్తుతో ట్రిపోలీలో అధికారంలో ఉన్న ప్రభుత్వం, పశ్చిమదేశాల మద్దత్తుతో టోబ్రుక్‌లో అధికారంలో ఉన్న ప్రభుత్వం ఇస్లామిక్ స్టేట్‌కు వ్యతిరేకంగా ఉన్నాయి. గతంలో లిబియన్ ఇస్లామిక్ ఫైటింగ్ గ్రూప్‌లో అమీర్‌గా ఉన్న అబ్దుల్ హాకీం బెల్హాజ్ లిబియాలోని ప్రభుత్వంలో కీలకస్థానంలో ఉండటం ఆందోళన కలిగించే అంశం. ఇస్లామిక్ స్టేట్ మరీ దూకుడుగా వ్యవహరిస్తున్నదని ఆయన భావిస్తున్నాడు.

ఇరాక్ యుద్ధం యొక్క దుష్పరిణామాలపై పశ్చిమదేశాలు ఏవిధంగా స్పందిస్తున్నాయి? యుద్ధాన్ని కొనసాగించటంపైనే వారు ఆసక్తిని చూయిస్తున్నారు. ఇరాక్, సిరియాలలో యుద్ధాలు కొనసాగుతున్నాయి. వాటిని మరింత తీవ్రం చేయటానికి ప్రణాళికలు రూపొంది స్తున్నారు. లిబియాలో నాటో మరోసారి జోక్యం చేసుకుంటుందని ఇటలీ, ఫ్రెంచి అధికారులు బహిరంగంగా ప్రకటిస్తున్నారు. ఈజిప్టు చేస్తున్న బాంబుదాడులు, సైన్యాన్ని దించవచ్చుననే అంచనాతో అమెరికా మరింత సంతోషంగా ఉంది. ఎమెన్‌లో డ్రోన్ దాడులు కొనసాగుతున్నాయి. హౌథి నాయకత్వంలోని ప్రభుత్వానికి వ్యతిరేకంగా బెదిరింపులు పెరుగుతున్నాయి. యుద్ధ బెదిరింపులు ఈ ప్రాంతంలోని ఇస్లామిక్ స్టేట్, ఇతర జిహాదీ గ్రూపుల వెన్ను విరుస్తాయా? లక్దర్ బ్రహిమి ఇదిసాధ్యం కాదని చెపుతున్నాడు. "ఆకాశం నుండి బాంబులను కురిపించటం ద్వారా ఇస్లామిక్ స్టేట్‌ను ఓడించలేమని, ఇరాక్, సిరియా, లిబియాలలో రాజకీయ క్రమాన్ని ప్రారంభించటంద్వారానే వారిని ఓడించ గలమని" లక్దర్ బ్రహిమి ఆల్జీరియాలో చెప్పాడు.

### రాజకీయ పరిష్కార క్రమం

"రాజకీయ పరిష్కార క్రమం"అని బ్రహిమి చెప్పినదాని అర్థమేమిటి? బ్రహిమి అమాయకుడు కాదు. 1975-90 మధ్య జరిగిన లెబనాన్ అంతర్యుద్ధాన్ని నిలుపు చేసిన టెయిఫ్ ఒప్పందాన్ని కుదర్చటంలో ఆయన సహకారం ఉంది. స్థానికంగా విరోధులైన ఈజిప్టు, ఇరాన్, సౌదీఅరేబియా, టర్కీలు సిరియా సమస్యను పరిష్కరించే కూటమి(కాంటాక్ట్ గ్రూపు) గా అభివృద్ధి చెందటానికి పశ్చిమదేశాలు, రష్యా తగిన అవకాశం ఇస్తాయని తాము భావిస్తున్నట్లు బ్రహిమి బృందంలోని సభ్యుడొకరు 2012లో నాతో చెప్పాడు. పశ్చిమాసియాలో సౌదీ అరేబియా, ఇరాన్‌ల మధ్య ప్రధాన శతృత్వం ఉంది. వాస్తవానికి వారి శతృత్వమే ఇరాక్, సిరియా, లెబనాన్‌లలో ఘర్షణలను పెంచటంలో ప్రధానపాత్ర పోషించింది.

ఉత్తర ఆఫ్రికాలోని ప్రధాన ప్రాంతీయ శతృత్వానికి కేంద్రం గల్ఫ్‌లో ఉంది. గల్ఫ్ దేశాలైన కటార్, సౌదీఅరేబియాలు శతృవులుగా ఉన్నాయి. ఈ ప్రాంతీయ శతృత్వాలను తగ్గిస్తే, రాజకీయ పరిష్కారానికి అవసరమైన అవకాశాలు ముందుకొస్తాయి. సిరియాలో పరిస్థితి ప్రతిష్ఠంభన దశకు చేరిందని బ్రహిమి బృందానికి 2012 నాటికే అర్థమైంది. బషర్ అల్ అసద్ ప్రభుత్వానికి పూర్తి ఆధిపత్యం ఉన్న పాత సిరియాను తిరిగి ఏర్పాటు చేయటం సాధ్యం కాదు. అసద్ ప్రభుత్వాన్ని తొలగించటం కూడా సాధ్యం కాదు. విశాల దృక్పథంతో ఆలోచించాలి. బలప్రయోగం ద్వారా ప్రాంతీయంగానూ, దేశాలలోనూ మార్పులు తేవాలనే ఆశలు నేరవేరవని గ్రహించాలి. సిరియా సమస్య పరిష్కార కూటమిపై ఆశలున్నాయి. కాని ఆ గ్రూపు అభివృద్ధి కావటాన్ని అంగీకరించటం లేదు.

రెండు సంవత్సరాల తర్వాత, వేల సంఖ్యలో ప్రజలు మరణించిన తర్వాత, ఇస్లామిక్ స్టేట్ ఈ ప్రాంతంలో ప్రధానశక్తిగా ఎదిగిన తర్వాత, రాజకీయ పరిష్కారానికి ప్రాతిపదికగా సిరియా సమస్య పరిష్కార కూటమి ఏర్పాటు లాంటి ఆలోచనలు తిరిగి ముందుకు వస్తున్నాయి.

ఈ ప్రాంతంలో పశ్చిమదేశాలకు ఒకప్పుడు ఉన్న పలుకుబడి ఇపుడు లేదు. ఈ ప్రాంతంలోని సమస్యలను పరిష్కరించటానికి తగిన అవగాహన కూడా వారికి లేదు. వారి ఆలోచనలు ప్రతికూల ఫలితాలను ఇస్తున్నాయి. అస్థిరత్వాన్ని అంతం చేయాలంటే ఈ ప్రాంతంలో శాంతిని సాధించాలి. ఇందుకు అరబ్ ప్రపంచంలో ఉన్న ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణాన్ని సడలింపచేయాలి. ఈ ప్రాంతంలోని ప్రధాన దేశాల మధ్య బలమైన ఐక్యతా సంబంధాలు ఏర్పడితే ఇస్లామిక్ స్టేట్ లాంటి సంస్థలు నిధులు, ఆయుధాలు సేకరించటం, విస్తృత ప్రాంతాలను తమ అదుపులో ఉంచుకోవటం కష్టమౌతుంది. ఇస్లామిక్ స్టేట్ పెరుగుదలకు యుద్ధమే ఇంధనంలా ఉపయోగపడుతున్నది. ఈ ప్రాంతంలో అరాచకాన్ని అంతం చేయటం అందుకు వ్యతిరేక ఫలితాన్ని ఇస్తుంది.

**(అనువాదం. ఎ.కోటిరెడ్డి)**

# కమ్యూనిస్టులు, అభ్యుదయ శక్తులు తీవ్ర కృషిద్వారా మార్పు సాధించాలి

**సందేహాలు సమాధానాలు**



**- బి.వి.రాఘవులు**

**కామ్రేడ్ బివి రాఘవులుగారికి, సిపిఎం తెలంగాణా మహాసభ సందర్భంగా హైదరాబాద్‌లో బ్రహ్మాండమైన సభ జరిగింది. లక్షల సంఖ్యలో జనం హాజరైనారు. ఎక్కడ చూసినా జనమే అనిపించారు. మాలాంటి వారికి ఎంతో స్ఫూర్తినిచ్చింది. కానీ ఎన్నికలొచ్చేసరికి కమ్యూనిస్టుపార్టీలకు ఈ ప్రజలే ఎందుకు ఓట్లు వేయరు. వీరంతా ఓట్లు వేస్తే కొన్ని నియోజకవర్గాల్లోనైనా పార్టీ గెలిచేది కదా?**

**- సిహెచ్. జి. రాజేంద్ర ప్రసాద్,**
ఓం నగర్, నాగర్ కర్నూల్,
మెహబూబ్ నగర్ జిల్లా

హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణా రాష్ట్ర మార్క్సిస్టు పార్టీ మహాసభ సందర్భంగా పెద్ద ర్యాలీ, బహిరంగ సభ స్ఫూర్తిదాయకంగా జరిగాయి. నూతన రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొనే కొత్త సవాళ్ళను గుర్తించడంలో, పరిష్కరించ డంలో కమ్యూనిస్టుల, వామపక్షాల పాత్రపై ప్రజలు పెట్టుకున్న ఆశలకు ఇవి అద్దం పట్టాయి. ప్రజల ఆకాంక్షలకనుగుణంగానే పార్టీ మహాసభలు రాష్ట్ర సమగ్రాభివృద్ధికీ, సామాజిక న్యాయానికీ, రైతాంగ, కార్మిక, వృత్తిదార్ల సంక్షేమానికీ ప్రత్యామ్నాయ మార్గనిర్దేశం చేస్తూ నిర్ణయాలు చేసాయి. రాబోయే కాలంలో ఈ నిర్ణయాలను అమలుజరిపేందుకు పార్టీ యంత్రాంగం యావత్తు సన్నద్ధమవుతున్నది. భవిష్యత్తులో తప్పకుండా తెలంగాణా రాష్ట్రంలో పార్టీ బలమైన సంస్థగా, పోరాటాలకు చోదక శక్తిగా ఆవిర్భవిస్తుంది.

పార్టీ ప్రతిష్టకూ, పార్టీపట్ల ప్రజల అభిమానానికీ, ఎన్నికల్లో పార్టీకి వచ్చే ఓట్లకు అంతరం ఈ మధ్యకాలంలో ఎక్కువవు తున్నదనేది వాస్తవం. కృషికి, ప్రజాభిమానానికి తగినట్లుగా ఓట్లు రానందువలన కమ్యూనిస్టు శ్రేయోభిలాషుల్లో, వామపక్ష అభిమానుల్లో కొంత నిరాశ కూడా కలుగుతున్నది. కమ్యూనిస్టులకు, వామపక్షాలకు తగిన మోతాదులో ఓట్లు రాకపోవడానికి కమ్యూనిస్టులు ప్రజాసేవలో, అంకిత భావంలో లోపం చేస్తుండడంవలన కాదు. గత మూడు దశాబ్దాల్లో, ముఖ్యంగా సరళీకరణ విధానాల ప్రవేశం తరువాత దేశంలో బూర్జువా ప్రజాస్వామిక ఎన్నికల తీరులోనే తీవ్రమైన, హానికరమైన మార్పులొచ్చాయి. అన్నింటి మాదిరిగానే ఓటుకూడా సరుకుగా మారిపోయింది. రాజకీయాలుకూడా లాభసాటి వ్యాపారంగా తయారయ్యాయి. పదుల వందల కోట్లు ఖర్చు పెట్టడానికి అభ్యర్థులు వెనకాడటం లేదు. ప్రజా ప్రతినిధులుగా ఉంటే ఖర్చు పెట్టిందానికన్నా ఇంకా ఎక్కువ ప్రజాధనాన్ని లూటీ చేసుకొనే అవకాశాలు ఉండడమే దీనికి కారణం. గత రెండున్నర దశాబ్దాల కాలంలో కార్పోరేట్ మీడియా, ప్రచార యంత్రాంగం భారీగా విస్తరించింది. ఇవి ప్రజల మనోభావాలను ప్రభావితం చేస్తున్నాయి. కమ్యూనిస్టులు, వామపక్షాలు, అభ్యుదయ శక్తులపట్ల అపోహలు సృష్టించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. ప్రజల్లో రాజకీయాల పట్ల విముఖతను, వ్యక్తిగత సంపాదనే సర్వస్వమన్న భావాన్ని, మూఢవిశ్వాసాలపట్ల ఆసక్తిని వ్యాప్తి చేసింది. పైన పేర్కొన్న ప్రతికూల మార్పులన్నీ కమ్యూనిస్టులు ఎన్నికల్లో బూర్జువా పార్టీలతో పోటీపడడాన్ని కష్టతరం చేసింది. బూర్జువా పార్లమెంటరీ వ్యవస్థ స్వభావరీత్యానే బూర్జువా పార్టీలకు అనుకూలంగా ఉన్నప్పటికీ, గతంలో ఆ వ్యవస్థలో జోక్యం చేసుకొనేందుకు, ప్రవేశించేందుకు కొన్ని అవకాశాలు ఉండేవి. ఇప్పుడు ఆ అవకాశాలు క్రమేణా తగ్గిపోయాయి. అయితే దీనర్థం బూర్జువా పార్లమెంటరీ రాజకీయాలను వదిలేయాలని కాదు. ప్రజలు ఆ వ్యవస్థలో పాల్గొంటున్నంతకాలం, వాటిపై భ్రమలు కలిగి ఉన్నంత కాలం కమ్యూనిస్టులు ఒపిగ్గా ఈ రంగంలో కూడా పనిచేయాల్సిందే. అయితే ఎన్నికల వ్యవస్థపై కార్పోరేట్ శక్తుల పట్టును దెబ్బతీసేందుకు అవసరమైన పోరాటాలు చేయాలి. ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే ఎన్నికల సంస్కరణలకోసం పోరాడాలి. పార్లమెంటరీ రంగం బయట జరిగే ఉద్యమాలు, పోరాటాల ద్వారానే కమ్యూనిస్టులు పార్లమెంటరీ రంగాన్నికూడా ప్రభావితం చేయగలుగుతారు. అందుకే అటువంటి పోరాటాలను రాబోయే కాలంలో ఉధృతం చేయాలి. పార్టీ 21వ అఖిలభారత మహాసభకూడా అన్ని తరగతులలో పోరాటాలను, ఉద్యమాలను దేశవ్యాపితంగా ఉధృతం చేయాలని పిలుపునివ్వబోతున్నది. వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యతను అభివృద్ధి చేయాలని కోరుతున్నది. ఇందుకనుగుణంగా రాబోయే కాలంలో పార్టీ, ప్రజాసంఘాలు చేసే కృషి ప్రజలను రాజకీయంగా చైతన్యం చేస్తుందనడంలో సందేహం లేదు. దీనికి తోడు ప్రపంచంలోనూ, మనదేశంలోనూ, మన రాష్ట్రాల్లోనూ సరళీకరణ విధానాల మూలంగా ఆర్థికాభివృద్ధి మందగించింది. పాలకవర్గాలు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆర్థిక అభివృద్ధిని మెరుగుచేయడంలో ఇప్పటివరకు సఫలం కాలేదు. ఇప్పటివరకు సరళీకరణ విధానాలపట్ల భ్రమలున్న ప్రజల్లోకూడా అసంతృప్తి పెరుగు తున్నది. ఈ పరిస్థితికూడా రాబోయే కాలంలో ఉద్యమాలకు, తద్వారా ప్రజా చైతన్యం పెరగడానికి తోడ్పడుతుంది. అయితే ఈ మార్పు దానంతటదే రాదు. కమ్యూనిస్టులు, అభ్యుదయ శక్తులు తమ కృషిద్వారా మార్పును సాధించాలి.

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తు న్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చిం చాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి

మీ లేఖలు అందాల్సిన చిరునామా!
**ఎడిటర్,**
'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక
ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

అందుకు అందరం పూనుకుంటే తప్పకుండా కమ్యూనిస్టు పార్టీల ప్రజా పునాది బలపడుతుంది.

**ఎడిటర్‌గారికి, మార్క్సిస్టు ఫిబ్రవరి సంచికలో పార్టీ నిర్మాణం గురించి కా॥ ఎస్. వీరయ్యగారు రాసిన వ్యాసం 'కమ్యూనిస్టు పార్టీలో నాయకత్వ ఎన్నిక విధానాన్ని నిర్మొహమాటంగా (జరగాల్సిన విధానాన్ని) వివరించారు. అలా జరిగితే కార్యకర్తలకు స్ఫూర్తిదాయకంగా కూడా వుంటుంది. కానీ ఏ సందర్భంలో కూడా 'ఎన్నిక' జరగడం లేదు కదా? 'ఎంపిక' మాత్రమే (అన్ని స్థాయిల్లో కూడా) జరుగుతోంది. ముందే నిర్ణయించుకొని ప్రతిపాదించటం జరుగుతోంది. అది తప్పు అని తెలిసి, పార్టీ అభివృద్ధికి నష్టం అని తెలిసి నాయకత్వం ఎందుకు తప్పు చేస్తోంది? దీనికి తోడు రాష్ట్ర నాయకత్వం కూడా తప్పుచేసిన నాయకుల గురించి, కార్యకర్తల ముందుగానీ, మహాసభల్లోగానీ చెప్పకుండా గోప్యంగా ఉంచటం, అబద్ధాలు చెప్పటం జరుగుతోంది? ఎందుకని? అలా చేయటం వలన నాయకత్వంపైనా, పార్టీపైనా కార్యకర్తలకు విశ్వాసం పోతుంది గదా? పార్టీ బలహీనపడుతుంది గదా? కా॥ వీరయ్యగారు చెప్పినట్లుగా మహాసభల్లో నిర్మొహమాటంగా సమీక్షలు జరుగుపుతున్నారా? అందుకు అవకాశం కల్పించటం లేదు గదా? వ్యాసాలకు మాత్రమే మనం పరిమితమౌ తున్నామా? ఆచరణలో భిన్నంగా వ్యవహరిస్తున్నాం గదా?**

**- దొప్పలపూడి రమేష్‌బాబు,**

పాలపర్రు,

గుంటూరు జిల్లా.

కమ్యూనిస్టు పార్టీ నాయకత్వ ఎన్నికల విధానాన్ని కా॥ వీరయ్య తన వ్యాసంలో వివరించారు. పార్టీ నాయకత్వం ఆయా స్థాయిల మహాసభల్లో ఎన్నికవుతుందని చెప్పడంపై మీరు వ్యక్తం చేసిన సందేహానికి తావులేదు. ఏ సందర్భంలోకూడా ఎన్నిక జరగడంలేదు అని మీరు రాసిందికూడా యధార్థం కాదు. ప్రస్తుతం జరుగుతున్న మహాసభల సందర్భంలోకూడా కొన్ని చోట్ల ఎన్నికలు జరిగాయి. కొన్ని చోట్ల మహాసభ ముందు ప్రతిపాదించిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నిక జరిగితేనే ప్రజాస్వామ్యం, ఎన్నిక జరగకపోతే ఎంపిక అనుకోవడం సబబుకాదు. పార్టీ మహాసభలలో నాయకత్వ స్థానాలకు పోటీపడేందుకు, ఎన్నికయ్యేందుకు మహాసభలో ఉన్న ప్రతినిధులకు పూర్తి స్వేచ్ఛ ఉన్నది. అటువంటి స్వేచ్ఛకు భంగం కలగకుండా మహాసభలో అన్ని జాగ్రత్తలు తీసుకోబడుతున్నది. వాస్తవంగా అటువంటి స్వేచ్ఛను వ్యక్తిగత ప్రయోజనాలకోసం దుర్వినియోగం చేసిన సందర్భాలు ఉన్నాయి తప్ప స్వేచ్ఛను హరించిన సందర్భాలు లేవు.

కమిటీలలో ఉన్న నాయకుల పని విధానాన్ని ఎప్పటికప్పుడు కమిటీలలో సమీక్షించడం జరుగుతున్నది. లోపాలు దిద్దుకోవడం జరుగుతున్నది. కొన్ని సందర్భాలలో లోపాలను పదే పదే ఎత్తిచూపినా సరిదిద్దుకోనప్పుడు వాటిగురించి క్రింది కమిటీలకు కూడా చెప్పడం జరుగుతున్నది. అయితే ప్రతి చిన్న లోపాన్ని, ప్రతి చిన్న సమస్యని కమిటీలోనే కాకుండా నిరంతరం చెప్పాలన్న భావన మీ ప్రశ్నలో వ్యక్తం అవుతున్నది. అది సరైంది కాదు. సరిదిద్దడానికి ప్రయత్నం చేసి అది సాధ్యం కాదనుకున్నప్పుడే ఇతర స్థాయిలకి తెలియాలితప్ప అప్పటివరకు ఏ కమిటీలో వ్యక్తి భాగస్వామిగా వుంటే చర్చ ఆ కమిటీకే పరిమితం కావడం మంచిది.

అయితే నాయకులు భాగస్వాములుగా వున్న కమిటీల్లో తప్పు ఒప్పుల గురించి సరిగ్గా చర్చ జరగకపోతే మీరు అనుకున్నట్టుగా నష్టం జరుగుతున్నది. కానీ పార్టీలో మొత్తం మీద అలాంటి పరిస్థితి లేదు. కొన్ని కమిటీలలో కొంతమంది వ్యక్తుల విషయంలో తప్పు ఒప్పులగురించి సక్రమంగా చర్చ జరగని సందర్భాలు అప్పుడప్పుడు బయటపడుతున్నా అవి చాల తక్కువ. వాటిని కూడా నివారించేదానికి పార్టీ ఎప్పటికప్పుడు ప్రయత్నం చేస్తూనే ఉంటుంది.

**కామ్రేడ్ రాఘవులుగారికి, సిపిఐ మహాసభల్లో ప్రధానంగా కమ్యూనిస్టుల విలీనంపై చెబుతున్నారు. సిపిఐ(ఎం) మహాసభల్లోగానీ, నాయకుల ప్రసంగాల్లో గానీ ఆ సమస్య ప్రస్తావనకు రావడం లేదు. వామపక్షాల ఐక్యత గురించి మాట్లాడు తున్నారు. ఐక్యతలో కూడా ఈ తేడాలేమిటి? వివరించగలరు.**

**ఆర్. శ్రీరాములు,**

దయానంద్ కాలనీ,

వరంగల్

పదాలతో విన్యాసాలెన్ని చేస్తున్నా, నాయకుల మాటలకు మీడియాలో ఎన్ని వాఖ్యానాలొస్తున్నా, సిపిఐ, సిపియం సంబంధాలకు గురించి జరుగుతున్న చర్చల్లో రెండు అంశాలను గుర్తించవచ్చు. 1. సిపిఐ, సిపియం రెండు పార్టీలు విలీనమైపోయి ఒక పార్టీగా ఏర్పడటం, 2. సిపిఐ, సిపియంలు రాజకీయంగా, ఉద్యమాల రీత్యా గరిష్టమైన స్థాయిలో ఐక్యమత్యంతో పనిచేయడం. ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యమైనది, తక్షణం అవసరమైనది రెండో అంశమని సిపియం భావిస్తున్నది. ఈ క్రమంలో రెండు పార్టీలమధ్య విధానపరమైన ఏకీభావం ఆవిర్భవించే కొద్దీ మొదటి అంశం గురించి తగిన సమయంలో నిర్ణయాలు తీసుకోవచ్చని సిపియం అభిప్రాయం. కొంతమంది సిపిఐ నాయకుల ప్రకటనలను బట్టి మిగతా అంశాలతో నిమిత్తం లేకుండా తక్షణం రెండు పార్టీలు విలీనం అయిపోవాలన్న భావం వారికున్నదని అనిపిస్తుంది.

రెండు పార్టీలు కలిసిపోవడమనే అంశం చాలా ముఖ్యమైన, తీవ్రమైన రాజకీయ అంశం. బహిరంగ వేదికల్లో, మీడియా చర్చల్లో ప్రస్తావించుకోవాల్సిన, చర్చించుకోవాల్సిన అంశంకాదు. అందుకే ఈ అంశంపై సిపియం నాయకులు సంయమనంతో మాట్లాడుతుంటారు. ప్రస్తుతం వామపక్షాలు బలహీనంగా వున్న నేపథ్యంలో రెండు పార్టీలు కలిస్తే కమ్యూనిస్టు ఉద్యమానికి పునరుత్తేజం వస్తుందన్న భావంతో ఉన్న అనేకమంది వామపక్ష శ్రేయోభిలాషుల భావోద్వేగాలను దృష్టిలో పెట్టుకొని, వారిని మెప్పించేందుకు కొందరు మాట్లాడుతుంటారు. అటువంటి పద్ధతులవలన పెద్ద ప్రయోజనం లేదు. ప్రస్తుతం సిపిఐ, సిపియం మాత్రమే ఒక పార్టీగా ఏర్పడితే అంతా అయిపోదు. అనేక వామపక్ష పార్టీలు, శక్తులన్నింటినీ ఒక వేదిక మీదకు తీసుకురావడం, రాజకీయంగా ఐక్యంజేయడం తక్షణ అవసరం. అందుకే సిపియం వామపక్ష శక్తుల ఐక్యతను విస్తృతం చేసేందుకు రాష్ట్రాల స్థాయిలో, అఖిలభారత స్థాయిలో కృషిచేస్తున్నది. ఈ ప్రయత్నం ఇంకా ప్రారంభ స్థితిలోనే ఉన్నది. సిపిఐ అయినా, సిపియం అయినా, మరే వామపక్ష సంస్థ అయినా ఈ ఐక్యతను సాధించేందుకు సర్వ శక్తులు ఒడ్డి ప్రయత్నం చేయడం అత్యవసరం.

సరళీకరణ విధానాల కాలంలో విభిన్నమైన శక్తులు, సంస్థలు, వ్యక్తులు తమ స్వతంత్రతను నిలబెట్టుకుంటూనే విశాలమైన ఐక్య వేదికలను ఏర్పర్చుకొని ఉద్యమాలు నిర్వహిస్తున్నాయి. పెట్టుబడిదారీ విధానాన్ని ఎదుర్కొవడంలో ఇటువంటి అనుసంధానం చేయబడిన విశాల వేదికలు మంచి సాధనాలుగా ఉపయోగ పడుతున్నట్లు వివిధ దేశాల అనుభవాలు చెబుతున్నాయి.

అలాగే కొన్ని దేశాల్లో (ఉదా: నేపాల్) విధానపరమైన అంశాలను కూలంకుషంగా చర్చించుకోకుండా వివిధ కమ్యూనిస్టు గ్రూపులు ఒకే పార్టీగా ఏర్పడినప్పుడు అవి తమ ఐక్యతను నిలబెట్టు కోలేక మళ్ళీ ముక్క చెక్కలయ్యాయి. అందువలన సిపిఐ, సిపియం విలీనమైయ్యే అంశంపై ఓపిగ్గా వ్యవహరించాలని, వామపక్ష పార్టీల ఐక్యత విషయంపై చురుగ్గా, వేగంగా వ్యవహ రించాలని భావించి సిపియం వ్యవహరిస్తున్నది.

# వట్టికోట ఆళ్వారుస్వామి

(2వ పేజీతరువాయి)

యువతిని వివాహమాడాడు. అప్పటికి ఆళ్వారుస్వామి వయస్సు 22 సంవత్సరాలు. యశోదమ్మ ద్వారా ఆ కుటుంబానికి ఆస్తి పాస్తులొచ్చాయి. అయినప్పటికీ ఆళ్వారు స్వామి పత్రికా ఉద్యోగం మానలేదు. తన విజ్ఞాన తృష్ణను ఆపుకోలేదు. సాహితీ వేత్తలతో.. సంఘ సేవకులతో.. ప్రజా హిత సంస్థలతో పరిచయాలేర్పాటు చేసు కున్నాడు. సికిందరాబాదు ప్రాంతంలో యువకులను సమీకరించి, చైతన్యపరిచి వారిని సామాజిక సేవారంగంవైపు ఆకర్షించాడు. గ్రంథాలయోద్యమంతోనూ, ఆంధ్రోద్య మంతోనూ సంబంధాలూ ఏర్పడ్డాయి. నిజామాబాదులో జరిగిన ఆరో ఆంధ్ర మహాసభకు సికిందరాబాదు ప్రాంత ప్రతినిధిగా హాజరయ్యాడు.

ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘంలో కొంతకాలంపాటు కార్యవర్గ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించాడు. తెలుగుతల్లి పత్రికకు కొంతకాలంపాటు నిర్వహణా బాధ్యతలు చేపట్టాడు. ఆ పత్రిక అంతకు ముందు రాచమల్లు సరస్వతీదేవి సంపా దకత్వాన నడుస్తుండేది. స్వాతంత్ర్య సమర యోధులు కాశీనాథుని నాగేశ్వరరావు స్ఫూర్తితో 'దేశోద్ధారక గ్రంథ మాల'ను ఏర్పాటు చేశాడు.

1942లో క్విట్ ఇండియా ప్రేరణతో సికిందరాబాద్‌లో కాంగ్రెస్‌వాదిగా సత్యాగ్రహం లో పాల్గొన్నాడు. ఆ సందర్భంగా నిజాం ప్రభుత్వం ఆయన్ను అరెస్టు చేసింది. ఏడాదిపాటు సికిందరాబాద్ జైల్లో ఉంచింది. అక్కడ కమ్యూనిస్టు నాయకులతో పరిచయమూ, సాన్నిహిత్యమూ ఏర్పడింది. కమ్యూనిజం ఆశయాలు, ఆదర్శాలు, పోరాట నిబద్ధతలతో ప్రభావితుడయ్యాడు. జైలు నుంచి విడుదలయ్యాక ఆంధ్రమహాసభకు ఆర్గనైజరుగా పనిచేస్తూ హైదరాబాద్ జిల్లా శాఖకు అధ్యక్షుడయ్యాడు. 1943 ఫిబ్రవరిలో జరిగిన ప్రథమాంధ్ర అభ్యుదయ రచయితల సంఘం మహాసభల్లో కార్యవర్గ సభ్యుడుగా ఎన్నికయ్యాడు. అదే ఏడాది చదలవాడ పిచ్చయ్య చొరవతో 'మీజాన్' పత్రిక కార్యా లయంలో ఏర్పడిన తెలంగాణా అభ్యుదయ రచయితల సంఘానికి కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. 1944లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించాడు. కొద్దికాలంలోనే ఆయన పార్టీ ముఖ్య నాయకుల్లో ఒకడుగా గుర్తింపునూ, గౌరవాన్నీ పొందాడు.

మీర్జా ఇస్మాయిల్ 1946లో హైద రాబాద్ సంస్థానానికి ప్రధానిగా నియమించ బడిన వెంటనే ఆయన కమ్యూనిస్టు పార్టీపై తీవ్రంగా విరుచుకుపడ్డాడు. ఎందరో కార్యకర్తలను అరెస్టు చేయించాడు. ఆళ్వారుస్వామినీ అరెస్టుచేసి రెండేళ్లపాటు సంగారెడ్డి, గుల్బర్గా, హైదరాబాద్, వరంగల్లు జైళ్లలో నిర్బంధించారు. తన కారాగార జీవితాన్ని గ్రంథపఠనానికీ, మేధో వికాసానికీ వినియోగించుకున్నాడు. జైల్లో తోటి ఖైదీలకు చక్కని విజ్ఞానాన్ని అందించడంతోపాటు కమ్మని వంటకాలూ వండి తినిపించేవాడు. సాధారణ ఖైదీలతోనూ, రాజకీయ ఖైదీలతోనూ ఆత్మీయంగా మెలుగుతూ వారి కష్టసుఖాలనూ, జీవితానుభవాలనూ తెలుసుకున్నాడు. ఖైదీల సమస్యలపై జైలు అధికారులకు వినతిపత్రాలు అందజేస్తుం డేవాడు. అలా వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేసేవాడు. తన స్వీయా నుభవాలూ, తోటి ఖైదీల అనుభవాలూ జోడించి 1950లో 'జైలు లోపల' కథలను రాశాడు. 1948 సెప్టెంబరు 17 తరువాత అనేకమంది రాజకీయ నాయకులు జైలు నుంచి విడుదలయ్యారు. ఆళ్వారుస్వామి మాత్రం మరో ఏడాదిన్నరపాటు జైల్లో మగ్గాల్సి వచ్చింది.

జైలు నుంచి విడుదలైన తరువాత ఆయన దృష్టి సాహిత్యంవైపే ఎక్కువగా మొగ్గు చూపింది. ప్రచురణ రంగంపై దృష్టి కేంద్రీకరించి ఇరవైకి పైగా పుస్తకాలను ప్రచురించాడు. జైలుకు వెళ్లడానికి ముందు కూడా దేశోద్ధారక గ్రంథమాల ద్వారా పన్నెండు పుస్తకాలను వెలువరించాడు. గ్రంథ ప్రచురణతోనే సంతృప్తి చెందని ఆళ్వారుస్వామి సంచి భుజాన వేసుకొని ఊరూరా తిరిగి తాను ప్రచురించిన గ్రంథాలను ప్రచారం చేశాడు. పాఠకులనూ, వారిలో పఠనాసక్తినీ పెంపొందించాడు. దేశోద్ధారక సూచీ గ్రంథాలయం పేరుతో సికిందరాబాదులో ఒక రిఫరెన్సు లైబ్రరీని ఏర్పాటు చేశాడు. అనేక అరుదైన ప్రాచీన గ్రంథాలను సేకరించాడు. కొత్త ప్రచుర ణలనూ సమకూర్చాడు. దిన,మాస పత్రికల సంపుటాలను సేకరించి పెట్టాడు. ఈ కార్యక్రమాలన్నిటిలో పలువురు ప్రగతిశీల రచయితలను ఉద్యమంలోకి తెచ్చాడు. ఇలా దాదాపు దశాబ్దకాలంపాటు క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్న ఆళ్వారు స్వామి 1960లో మళ్లీ కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకున్నాడు. చురుకైన కార్యకర్తగానూ రాటు దేలాడు. అభ్యుదయ సాహిత్యోద్యమం తోనూ, శాంతి ఉద్యమం తోనూ మమేకమై పని చేశాడు. కొందరు మిత్రులతో కలిసి సర్వోదయ ప్రెస్ పేరుతో ఒక ప్రింటింగు ప్రెస్సును ఏర్పాటు చేశాడు. నష్టాలు రావడంతో దాన్ని మూసివేయాల్సి వచ్చింది. కొంతకాలం బీమా ఏజెంటుగా పనిచేసినప్పటికీ సఫలం కాలేకపోయాడు. ప్రజాసేవలో ప్రదర్శించిన నేర్పును, ప్రజలతో వ్యాపార సంబంధాలు నెరపడంలో చూపలేక పోయాడు.

1961 ఫిబ్రవరి 6న డిఫ్తీరియా జబ్బుతో ఆయన కన్నుమూశారు. చనిపోయేనాటికి ఆయన "గంగు" నవల అసంపూర్తిగా మిగిలి పోయింది. "గంగు" నవల 1938-47 మధ్యకాలంలో తెలంగాణా గ్రామసీమల్లో ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీలు సాయుధ పోరాటాన్ని ప్రారంభించడానికి ముందున్న స్థితిగతులను చిత్రించింది. ఆ కాలంలో తీవ్రమైన ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక సంక్షోభాన్ని ఎదుర్కొన్న కాలాన్ని అది సాక్షాత్కరింపచేసింది. ఆయన మరణానంతరం ప్రచురించబడింది. అంతకుముందే "ప్రజల మనిషి", అనే నవలను రాశారు. 1938కి పూర్వం నాటి తెలంగాణా జీవితాన్ని చిత్రించిన ప్రామాణికమైన నవల అది. తెలంగాణా ప్రాంతంలో ఆత్మకథాత్మక రాజకీయ పోరాట గాథల్ని కథలుగా, నవలలుగా రాసే పద్ధతికి ఒరవడి దిద్దిన రచయిత ఆళ్వారుస్వామి. ఆయన సాహిత్య వారసత్వాన్ని స్వీకరించిన దాశరథి రంగాచార్య, 'చిల్లరదేవుళ్లు', 'మోదుగుపూలు', 'మాయజలతారు', 'రానున్నది ఏది నిజం' వంటి గొప్ప నవలలు రాశారు. అంతేకాదు, దాశరథి కృష్ణమాచార్యులు తమ 'అగ్నిధార' కావ్యాన్నీ, కేతవరపురామకోటి శాస్త్రి తమ పిహెచ్‌డి సిద్ధాంత గ్రంథాన్నీ, దాశరథి రంగాచార్య 'జనపదం' నవలనూ ఆళ్వారు స్వామికి అంకితమిచ్చి తమ గౌరవాన్ని ప్రకటించుకున్నారు.

సామాజిక ఉద్యమ యోధుడిగా, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా, రచయితగా, ప్రచురణకర్తగా, గ్రంథాలయోద్యమకారుడుగా బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించిన వట్టికోట ఆళ్వారుస్వామి తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయమైన స్థానం సంపాదించు కున్నాడు. ఆయన సాహిత్య జీవితం, ఉద్యమ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం. అనుసరణీయం.

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-04-2015 Postal Regd. No L1/SD/407/13-15

# సిపిఐ(ఎం) 21వ అఖిలభారత మహాసభలు

**2015, ఏప్రిల్ 14 నుండి 19వ తేదీ వరకు**

**విశాఖపట్నం.**




**భారీ బహిరంగ సభ**

ఏప్రిల్ – 19న,
ఆర్.కె బీచ్,
విశాఖపట్నం.

## ఆహ్వానం




Marxistu, monthly organ of Communist Party of India (Marxist) A.P . State Committee.
Printer & Publisher B.V. Raghavulu. RNI Reg.No. APTEL/2006/17554. Vol.9, No.12. Published on April 1, 2015